సంపుటి : 78 సంచిక : 33 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ అధిక జ్యేష్ఠ బహుళ పాడ్యమి
01-07 జూన్ 2026
వెల : ₹20/-



# హిందువులు ఆధిపత్యవాదులు కాదు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.



# పద్మ పురస్కారాల ప్రదానం





2026 సంవత్సరానికి ప్రతిష్మాత్మక పద్మ పురస్కారాల ప్రదానం మే 25న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. హిందీ చలనచిత్రనటుడు దివంగత ధర్మేంద్ర తరపున ఆయన సతీమణి హేమామాలిని పద్మవిభూషణ్ పురస్కారాన్ని, అదే పురస్కారాన్ని ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు ఎన్. రాజం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న తెలుగు వారిలో మామిడాల జగదీష్, నృత్య విభాగంలో దీపికారెడ్డి, వైద్య విభాగంలో డాక్టర్ గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి, సాహిత్యం-విద్య విభాగంలో వెంపటి కుటుంబ శాస్త్రి, కళల విభాగంలో మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ తరపున ఆయన కుమారుడు ఉన్నారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తదితరులు హాజరయ్యారు.

# సంస్కృతంలో 17 మంది ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం!

మే 21న కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కోసం అస్సాం శాసనసభ సమావేశమైనప్పుడు అది భారత్ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిధ్వనించింది. ఇది ఆధునిక భారతదేశంలో శాసనసభ విధానాన్ని వలసవాద రహితం చేయడానికి ఒక నిజమైన ప్రతిబింబంగా నిలిచింది. 124 మంది కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. వారు తొమ్మిది విభిన్న భాషలలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ భాషలలో కొన్ని ఇంతకు ముందెన్నడూ భారత శాసనసభలో వినిపించలేదు. ఏ కొలమానంలో చూసినా, అది ఒక చారిత్రాత్మక మధ్యాహ్నంగా నిలిచింది. బహుశా అసోం శాసనసభ చరిత్రలో మొదటిసారిగా, అధికార పార్టీకి చెందిన 17 మంది ఎమ్మెల్యేలు సంస్కృత భాషలో ప్రమాణ స్వీకారం చేశారు. తద్వారా వారు ఒక రాజకీయ, సాంస్కృతిక ప్రకటనను స్పష్టం చేశారు. వేదాల భాష, భారతదేశ శాస్త్రీయ నాగరికతకు పునాది అయిన సంస్కృతాన్ని శాసనసభ ప్రమాణ స్వీకారానికి సాధారణంగా ఎంచుకోరు. ఒకే సమావేశంలో, ఒకేసారి 17 మంది ఎమ్మెల్యేలు సంస్కృత భాషను ఎంచుకోవడం అస్సాం శాసనసభ చరిత్రలో అపూర్వం, దేశంలోనే అరుదైన విషయం. ఒక బోడో వర్గానికి చెందిన ఎమ్మెల్యే, అహోం వర్గానికి చెందిన ఒక ఎమ్మెల్యే, తేయాకు వర్గానికి చెందిన ఒక ఎమ్మెల్యే, మైదాన ప్రాంతాల వర్గాలకు చెందిన శాసనసభ్యులు అందరూ తమ ప్రమాణ స్వీకార మాధ్యమంగా ఇదే ప్రాచీన భాషను ఎంచుకున్నారు. అది జాతి భేదాలకు అతీతంగా ఉన్న ఉమ్మడి నాగరిక గుర్తింపు ప్రకటనగా నిలిచింది.

సంస్కృతం ప్రధాన వార్తగా నిలిచినప్పటికీ, ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అసలైన చారిత్రక మలుపు భారత శాసనసభలో మునుపెన్నడూ ఉపయోగించని మూడు భాషలలో ఉంది. అసోం శాసనసభ చరిత్రలో తొలిసారిగా ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలు కర్బీ భాషలో, ముగ్గురు ఎమ్మెల్యేలు రాజబంగ్షీ భాషలో, ఒక ఎమ్మెల్యే రాభా భాషలో ప్రమాణ స్వీకారం చేశారు. కర్బీ, రాజబంగ్షీ, రాభా భాషలు అసోంలో లక్షలాది మంది ప్రజలు మాట్లాడే సజీవ భాషలు. వీటికి రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్ కింద గుర్తింపు లేదు. చట్టపరంగా వీటికి ఎలాంటి అధికారిక హోదా లేదు. అయినప్పటికీ, అస్సాం శాసనసభ వేదికపై రాజ్యాంగబద్ధమైన పదవికి ప్రమాణస్వీకార భాషగా వీటిని పలికారు. ఈ భాషలు మాట్లాడే వర్గాలకు, ఆ మరపురాని ఘట్టం కేవలం ఒక విధానపరమైన అంశం కాదు. అది వారి అస్తిత్వానికి సముచిత గౌరవం.

మే 21న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఒక అసాధారణమైన భాషా వైవిధ్యాన్ని ప్రతిబింబించింది. రాష్ట్రంలో ప్రధాన భాష అయిన అస్సామీలో 75 మంది ఎమ్మెల్యేలు, 17 మంది సంస్కృతంలో, బీజేపీకి చెందిన ఆరుగురు, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సహా తొమ్మిది మంది బెంగాలీలో, ఎనిమిది మంది బీపీఎఫ్ ఎమ్మెల్యేలు బోడోలో, ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలు కర్బీలో, బీజేపీ, బీపీఎఫ్, ఏజీపీలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు ఎమ్మెల్యేలు రాజబంగ్షీలో, నలుగురు ఆంగ్లంలో, ఒకరు హిందీలో, ఒకరు రాభా భాషలో ప్రమాణ స్వీకారం చేశారు.

అసోం అసెంబ్లీలో నెలకొన్న చరిత్రను ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ప్రశంసించారు. ఎమ్మెల్యేలు తమకు అత్యంత సౌకర్యవంతంగా, విశ్వాసంగా అనిపించే భాషలో ప్రమాణ స్వీకారం చేసేందుకు వీలుగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అతుల్ బోరా, ప్రో-టెం స్పీకర్ చంద్ర మోహన్ పటోవరీలతో సంప్రదించి, తదనుగుణంగా ఒక నిర్ణయాన్ని ముందుగానే తీసుకున్నట్లు తెలిపారు.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

అధీన రేఖలన్నీ అదుపులోనే ఉండాలి. పొలిమేరల పొడవునా..నిఘా నేత్రాలను మోహరించాలి. లేదంటే శత్రు దేశాలు కంచెలుదాటి దేశంలోకి ప్రవేశించి, దుర్ఘటనలను పరిచయం చేస్తాయంటారు. ప్రతి సరిహద్దును సురక్షితంగా ఉంచుకున్నప్పుడే, వైరి దాడిని తట్టుకోగమంటాడు యుద్ధ నిపుణుడు క్లాస్ విట్జ్. కానీ దురదృష్టావశాత్తు మన దేశంలోని సరిహద్దు రాష్ట్రాల్లో తిష్టవేసిన పాలకులు...భౌగోళిక యుద్ధ ఉద్రిక్తల సమయంలో ప్రమాదాలను గుర్తించడం లేదు. గుర్తించినా... తమ ప్రాబల్యం, ప్రాపకం, అహంకారం దెబ్బతింటుందని వాస్తవ స్థితిని గుర్తించ నిరాకరిస్తున్నారు.

సరిహద్దు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్లో దశాబ్దన్నర కాలంపాటు అధికారం చెలాయించిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి సరిగ్గా ఇదే చేసింది. సిలిగురి కారిడార్‌లోని 122 కి.మీ జాతీయ రహదారులను అప్పగించడంలో మంకుపట్టి పట్టింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో ఉన్న రాజకీయ వైరం కోసం సిలిగురిలోని ఏడు జాతీయ రహదారులను అప్పగించ నిరాకరించింది. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ శాసన సభ ఎన్నికల్లో మమత ఘోర ఓటమిని చవిచూసింది.

పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత సువేందు అధికారి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే...ఆగమేఘాలమీద వ్యూహాత్మక ప్రాంతమైన చికెన్ నెక్ పరిధిలోని సరిహద్దు ప్రాంతాలలో 120 ఎకరాలకు పైగా భూమి, జాతీయ రహదారి మార్గాలను బీఎస్ఎఫ్‌కి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. చికెన్‌నెక్‌ను బీఎస్ఎఫ్‌కు అప్పగించడంతో ఇక సరిహద్దు వెంబడి ఫెన్సింగ్ లేని ప్రాంతాలలో బీఎస్ఎఫ్‌కు భూమి లభించడం వల్ల, వ్యూహాత్మక వాచ్ టవర్ల ఏర్పాటు, పెట్రోలింగ్ కోసం రోడ్ల నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది.

1947లో సిరిల్ రాడ్ క్లిఫ్ ఆధ్వర్యంలో జరిగిన సరిహద్దుల గుర్తింపులో కుట్ర పూరిత వ్యూహం ఉంది. 1947లో సిరిల్ రాడ్ క్లిఫ్ భారతదేశాన్ని సందర్శించకుండానే 45 రోజుల్లో విభజన రేఖలు గీశారు. అప్పట్లో మన పాలకులు వాయువ్య సరిహద్దులపై

**శాలివాహన 1948 శ్రీ పరాభవ అధిక జ్యేష్ఠ బహుళ పాడ్యమి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**హిందువులు ఆధిపత్యవాదులు కాదు**
6లో

ధారావాహిక నవల
38 **గణపతిదేవుడు**
– మత్తి భానుమూర్తి
20లో



ప్రత్యేక వ్యాసం
**పర్యావరణ పరిరక్షణ తరుణం**
26లో



# జాగృతి

## సంపాదకీయం

పెట్టిన దృష్టిని బెంగాల్ విభజనపై పెట్టలేదు. నిజానికి చిట్టగాంగ్ ప్రాంతంలో 90% హిందువులు ఉండేవారు. ఇది శతాబ్దాలుగా త్రిపుర రాజ్యంతో ముడిపడి ఉండేది. కానీ, చివరి నిమిషంలో బ్రిటీష్ పాలకులు చిట్టగాంగ్ ను తూర్పు పాకిస్థాన్ కు కట్టబెట్టారు. దీనివల్ల ఈశాన్య భారతం తన సహజసిద్ధమైన సముద్ర మార్గాన్ని కోల్పోయింది. అంతే కాదు, సిలిగురి కారిడార్‌ను మనకో సవాలుగా, ప్రత్యామ్నాయం లేనిదిగా మార్చడంలో రాడ్ క్లిఫ్ తన కుట్రను విజయవంతంగా అమలు చేశాడు. తూర్పు పాకిస్థాన్ ఆవిర్భావంతో ఈశాన్య ప్రాంతానికి ఉన్న

## చారిత్రక నిర్ణయం.. వ్యూహాత్మకం

దారులన్నీ మూసుకుపోయి ‘చికెన్ నెక్’ మాత్రమే ఏకైక ఆధారమైంది.

నాడు అధికారంలో ఉన్న నెహ్రూ ప్రభుత్వానికి చైనా తెగబడేదాకా వ్యూహాత్మక ప్రాంతమైన ‘చికెన్ నెక్’ ప్రాధాన్యత అర్థం కాలేదు. మన ప్రత్యర్థి అతిచిన్న మార్గాన్ని స్వాధీనంలో ఉంచుకుంటే మొత్తం ఈశాన్య రాష్ట్రాలే చైనా వశమవుతాయని 1962లో తెల్లారింది. బీజింగ్ మీదపడిపోయాక అప్పుడు కళ్లు తెరిచారు నెహ్రూ. అంటే అప్పటిదాకా మన సరిహద్దులు, వ్యూహాత్మక భూభాగాల గురించి నాటి ప్రధానికి ఏమాత్రం పట్టింపు, అవగాహన లేదు.

1962 యుద్ధం తర్వాత సిలిగురి కారిడార్‌లోని ఏడు ముఖ్యమైన జాతీయ రహదారులను కేంద్ర సంస్థలైన ఎన్.హెచ్.ఏ.ఐ, ఎన్.హెచ్.ఐ.డి.ఎల్ సంస్థల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇది యాంత్రికమైన, తూతూ మంత్రపు నిర్ణయం. ఎందుకంటే... ఆ తర్వాత వ్యూహాత్మక ప్రాంతంలో రక్షణ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ జరగలేదు. 2000 సంవత్సరం తర్వాత చికెన్‌నెక్ ప్రాంతం నుంచి అస్సాం, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోకి అక్రమ వలసదారులు చొరబడ్డారు. సిలిగురి నగరం చుట్టూ ఉన్న 20 నుంచి 22 కిలోమీటర్ల ప్రాంతానికి అంతర్జాతీయ సరిహద్దు ఉంది. చికెన్‌నెక్‌కు పశ్చిమాన నేపాల్, ఉత్తరాన భూటాన్, దక్షిణాన బంగ్లాదేశ్, తూర్పున ఈశాన్య రాష్ట్రాలు ఉన్నాయి.

హోం శాఖ 2019 నివేదిక ప్రకారం, బంగ్లాదేశ్ నుండి సుమారు 1.5 కోట్ల మంది అక్రమ వలసదారులు భారతదేశంలోకి ప్రవేశించారని అంచనా. బీఎస్ఎఫ్ లెక్క ప్రకారం 2017–2019 మధ్య 4,000 మంది రోహింగ్యాలు ఈ మార్గం గుండా భారత్‌లోకి వచ్చారు. సిక్కిం సరిహద్దుకు సమీపంలోని చుంబీ లోయలో చైనా సైనిక స్థావరాలను విస్తరించింది. బీజింగ్ ఈ ప్రాంతంలో రోడ్లు, హెలిప్యాడ్‌లు, ఆయుధ గిడ్డంగులు నిర్మిస్తోందని 2021లో బయటపడిన శాటిలైట్ చిత్రాలు ఖరారు చేశాయి.

సరిహద్దు వెంబడి ఫెన్సింగ్ లేని ప్రాంతాలలో బీఎస్ఎఫ్‌కు భూమి లభించడం వల్ల అత్యాధునిక నిఘా కెమెరాలు, రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయడం సాధ్యమవుతుంది. కేంద్రం రాబోయే రోజుల్లో ఈ 122 ఎకరాల భూమి పరిధిలో అండర్ గ్రౌండ్ రైల్వే ప్రాజెక్టులు...సరిహద్దు బలగాలకు అవసరమైన లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేయనుందనే అంచనాలున్నాయి. చైనా దాడిని తట్టుకునేలా పటిష్ఠమైన భద్రతా వలయాన్ని నిర్మించే అవకాశం ఉంది. వ్యూహాత్మక అవసరాలను ముందే అంచనా వేసిన కేంద్రం ఈ ఏడాది జనవరిలో కలదాన్ మల్టీ–మోడల్ ప్రాజెక్ట్, మైత్రీ సేతు ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించింది. ఈ రెండు ప్రాజెక్టులు అత్యంత వ్యూహాత్మకమైనవి. మన దేశానికి ఉన్న తొమ్మిది భూ, సముద్ర సరిహద్దులను పటిష్టం చేసే పకడ్బందీ పథక రచన చేస్తోంది. ఈ ప్రయత్నం మరింత ముందుకు సాగాలని కోరుకుందాం.

01 జూన్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




కథ

**అంతర్మథనం**

– కె.రాజేశ్వరి





| | | |
|---|---|---|
| యమునోత్రీ! నమోస్తుతే....!! (పుణ్యకాలం) | – | 19 |
| సంక్షోభ వేళ విజయవంత పర్యటన! (అంతర్జాతీయం) | – | 24 |
| ‘సోనార్ బంగ్లా’కు శ్రీకారం (జాతీయం) | – | 28 |
| బంగారంతో సాటి ‘గాథా సప్తశతి’ (గళమెత్తిన గతం) | – | 30 |
| మరో చారిత్రక విజయం ‘భోజ్‌శాల’ (తీర్పు) | – | 32 |
| ధాన్యం కొనుగోళ్ల సంక్షోభం.. రైతన్నల అగచాట్లు (తెలంగాణ) | – | 34 |
| మతవిద్వేషాల సృష్టికి ‘దాదుల’ నాటకాలు (ఆంధ్రప్రదేశ్) | – | 36 |
| కరెన్సీ చిక్కుముడి (ఆర్థికం) | – | 38 |
| రొనాల్డోకి ఆరోసారైనా ‘కప్’ దక్కేనా? (క్రీడ) | – | 43 |
| బాలజాగృతి | – | 46 |
| వారఫలాలు | – | 48 |
| కూటమి ప్రభుత్వంలో ఎఫ్‌డీసీ బలోపేతం! (సినిమా) | – | 50 |




**ఏప్రిల్ 17న సిలికాన్ వ్యాలీలో జరిగిన థ్రైవ్ 2026 సదస్సులో ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే విజ్ఞానం, ఆధ్యాత్మికత, సాంకేతికతలతో అనుసంధానమైన ఒక నాగరికతా దృక్పథాన్ని సమర్పించారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలలో వేళ్లూనుకున్న నైతిక నవీకరణను సమర్థించారు. అదే సదస్సులో ప్రపంచ నాయకులు కృత్రిమ మేధ-ఏఐ, సుస్థిరత, మానవాళి భవిష్యత్తుపై చర్చించారు.**

“మన సంప్రదాయంలో జ్ఞానానికి మూలాలుగా ఇంద్రియ సంబంధితమైనవి, అతీంద్రియ సంబంధితమైనవి రెండూ ఉన్నాయి. జ్ఞానమనేది అవగాహన,తర్కంపై ఆధారపడి ఉంటుంది. అది పరిమితమైన మానవ జ్ఞానానికి అతీతమైనది. ఆధ్యాత్మిక విషయాలు, ప్రాపంచిక విషయాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. శాస్త్రీయ జ్ఞానంగా నేడు మనం అర్థం చేసుకునేది కూడా మన ఆధ్యాత్మిక జ్ఞానంలో ఇమిడి ఉంటుంది” అని ఏప్రిల్ 17, 2026న సిలికాన్ వ్యాలీలో జరిగిన గ్లోబల్ సైన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్ థ్రైవ్-2026 సదస్సులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌కార్యావాహ దత్తాత్రేయ హోసబలే తెలిపారు.

భారతీయ జ్ఞానపరంపరను పునరుద్ధరించడం ద్వారా అందివచ్చిన శాస్త్రీయ పురోగతికి ఒక అనివార్యమైన దృక్పథాన్ని ప్రకటించారు. అసలైన సాంకేతిక ఆవిష్కరణ ఆర్థిక వ్యవస్థ, జీవావరణం, నైతిక విలువలు ప్రాతిపదికగా ఉండాలని స్పష్టం చేశారు. మరింత వివరణ ఇస్తున్నట్టుగా మాట్లాడుతూ “మానవ దేహ నిర్మాణం, మనస్తత్వం, దేహం పనితీరు, దాని చలనం, నిశ్చలనం, దేహం దేనికి స్పందిస్తుంది? దేనికి స్పందించదు? అనే వాటికి సమాధానాలను చక్కగా వివరించే సూత్రాలు మన దగ్గర ఉన్నాయి. ఈ వివరణలు అత్యంత సమగ్రంగా, అధ్యయనంతో కూడుకున్నవిగా ఉంటాయి. అయినప్పటికీ ఆ సూత్రాలను ఆధ్యాత్మిక సూత్రాలుగా పరిగణిస్తుంటారు. కానీ సారాంశంగా చూసినప్పుడు అవి శాస్త్రీయమైనవి. గడచిన కాలంలో మరీ ముఖ్యంగా అప్పట్లో అదేపనిగా జరిగిన దండ యాత్రలు, విదేశీ పాలన కారణంగా వీటిలో చాలావరకు ధ్వంసమైపోయాయి. అలాంటి కష్టకాలంలో, మనం గత్యంతరం లేని పరిస్థితిలో మన శాస్త్రీయ వారసత్వ సంపదను విస్మరించవలసి వచ్చింది. ప్రస్తుతం ఆ జ్ఞాన సంపదను పునరుద్ధరించే ప్రయత్నంతో కూడుకున్న దశలో మనం ఉన్నాం. భారతీయ జ్ఞాన వ్యవస్థలను పాఠ్య పుస్తకాల్లో తిరిగి ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన ఒక విద్యా విధానాన్ని ప్రభుత్వం తీసుకొనివచ్చింది” అని తెలిపారు.

ఆవిష్కరణలకు ఒక చట్రాన్ని ఆయన ప్రతిపాదించారు. ప్రతి శాస్త్రీయ ఆవిష్కరణ కూడా నైతిక విలువలు, సమానత్వం, ఆర్థిక వ్యవస్థ అనే మూడు కీలకమైన గీటురాళ్లకు లోబడి ఉండాలని అన్నారు. ఈ గీటురాళ్లను తోసిరాజన్న పక్షంలో అసమానత్వం, సామాజిక అస్థిరత పెరిగిపోతుందని హెచ్చరించారు. సదస్సుకు హాజరైన నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులను ఉద్దేశించి హోసబలే ఈ హెచ్చరిక చేశారు. సమకాలీన శాస్త్రీయ ఆందోళనలకు పరిష్కారాన్ని నాగరికతా విజ్ఞానంతో

ముడిపెట్టారు. శాస్త్రీయ సంప్రదాయాలను తిరిగి కనుక్కునే క్రతువులో భాగంగా శతాబ్దాల కాలంగా రూపుదిద్దుకున్న మేధోపరమైన వారసత్వ సంపదను పునఃస్థాపించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ "దాదాపు ఒక వెయ్యి సంవత్సరాల కాలంలో, విదేశీ ఆధిపత్యంపై మనం జరిపిన పోరాటంలో, మన మేధోపరమైన వారసత్వ సంపదలో అధిక భాగం పక్కదారి పట్టింది. నేడు మనం చేయవలసిన ముఖ్యమైన పని ఒకటి ఉంది. మన నాగరికతా చరిత్రలోని శాస్త్రీయ సంప్రదాయాన్ని మనం కనిపెట్టాలి. దానిని తిరిగి స్థాపించాలి. అటు అంతరిక్షానికి, ఇటు విశ్వానికి సంబంధించిన పరిశీలనతో కూడుకున్న మన సంప్రదాయం సుసంపన్నమైనది. యావత్ జగత్తుకు వ్యామోహం లేదా విభ్రాంతి మూలాధారమై ఉన్నది. మన మూలగ్రంథాలు ఆసాంతం సంభాషణలు, చర్చలతో అవగాహన దోచుకోవడానికి ఉద్దేశించినది కాదు. ఇదంతా కూడా ప్రకృతిని అర్థం చేసుకోడానికే. దానిని అధ్యయనం చేయాలి, సద్వినియోగం చేసుకోవాలి. అదే సమయంలో ప్రకృతిని పరిరక్షించుకోవాలి. ఇలాంటి ఒక సమతూకం మన సంప్రదాయాలలో శాస్త్రీయ సామీప్యత, ఆవిష్కరణలు, ప్రయోగాలకు కేంద్రంగా ఉంటుంది" అని తెలిపారు.

విద్యావ్యవస్థ గురించి మాట్లాడుతూ సైన్సును, ఆధ్యాత్మికతను విడదీయడానికి బదులుగా ఆ రెండింటిని సమ్మిళితం చేయాల్సిన ఆవశ్యకతను సర్‌కార్యవాహ నొక్కి చెప్పారు."మన సమాజంలో సైన్సు విద్యకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. కానీ సైన్సును, ఆధ్యాత్మికతను వేరుచేయకుండా చూడటం ఎంతో ముఖ్యం. ఈ రెండూ వేర్వేరు విషయాలు కావు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఆధ్యాత్మికతను, సైన్సును వేరువేరుగా పరిగణిస్తుంటారు. కానీ మన సంప్రదాయంలో ఆ రెండూ సమ్మిళితమై ఉంటాయి. అటు శాస్త్రీయ పరిశీలనలోనూ, ఇటు లోతైన ఆధ్యాత్మిక సాధనలలోనూ ఒకే వ్యక్తులు, ఒకే సమూహాలు నిమగ్నమై ఉంటాయి. ఈ సంప్రదాయం నాగరికతా విజ్ఞానంతో మిళితమై ఉంది. మిళితమైన ఈ వైఖరి నైతిక విలువలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతో పాటుగా దైనందిన జీవనంలో భద్రత, జీవనోపాధి లాంటి వాటికి ఒక పునాదిగా ఉంటుంది. శాస్త్రీయ పరిశీలన అనేది వేరు కాదు. అది సమాజ అవసరాలతో అనుసంధానమై ఉంటుంది. మానవాళికి మహత్తరమైన శక్తిని ప్రసాదించే క్రమంలో ఇవన్నీ కూడా ఒక ప్రవాహం తీరుగా ముందుకు సాగాలి" అని అన్నారు.

ఆర్థిక వృద్ధి, విద్య, నాణ్యమైన జీవనం మధ్య అవినాభావ సంబంధాన్ని ప్రస్తావిస్తూనే అవి ఒకదానిపై ఒకటి ఆధారపడుతున్న వైనాన్ని

# ఆవిష్కరణలకు నాగరికత పట్టుగొమ్మ

నిండి ఉన్నాయి. భౌతిక ప్రపంచపు అభివ్యక్తీకరణలకు సంబంధించి మన నాగరికతకు చెందిన శాస్త్ర, సాంకేతిక గ్రంథాలలో సూక్ష్మ జగత్తు, స్థూల జగత్తుల మధ్య సంబంధం గురించి నిరంతరాయంగా సాగిన చర్చ ఉంది" అని వివరించారు. అదే సమయంలో మనం సాధించిన చారిత్రక ఘనతలను ప్రధానంగా ప్రస్తావించారు. వ్యవసాయ విధానాలు, పట్టణ ప్రణాళిక, విశ్వవిద్యాలయాలు, సివిల్ ఇంజినీరింగ్, తదితర రంగాల్లో చేరుకున్న అధునాతన స్థితిని వేలెత్తి చూపారు. ఇదే విషయాన్ని మరింత వివరిస్తున్నట్టుగా మాట్లాడుతూ "వీటన్నింటిని చూసినప్పుడు పేర్కొనదగిన ఘనతలను మనం కనుగొంటాము. అత్యంత అభివృద్ధి చెందిన వ్యవసాయ విధానాలు వేలాది సంవత్సరాల క్రితమే వాడుకలో ఉన్నాయి. అత్యంత అధునాతన స్థితిలో పట్టణ ప్రణాళిక ఉంది. విశ్వవిద్యాలయాలు ఏర్పాటు అయ్యాయి. సివిల్ ఇంజినీరింగ్‌లో గణనీయమైన అభివృద్ధి చోటు చేసుకుంది. ఇవన్నీ కూడా పదార్థ శాస్త్రాల పట్ల లోతైన అవగాహనను ప్రతిబింబిస్తున్నాయి. ఈ



ప్రముఖంగా పేర్కొన్నారు. “నానాటికి పురోగమిస్తున్న శాస్త్రీయ, సాంకేతిక రంగాలతో పాటుగా సామాజిక, విద్యావ్యవస్థలు ముందుకు సాగని పక్షంలో సమాజంలో అసమానతలు మరింతగా పెరిగిపోతాయి. కనుక వీటి మధ్య సమతూకం ఆవశ్యకతను పాలనాయంత్రాంగం తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. మనం ఒకవైపు అసమానతలు, దురభిమానం లేకుండా చూసుకోవాలి. మరోవైపు నిరంతరాయంగా శాస్త్రీయ పురోగతికి మార్గం సుగమం చేయాలి. ఈ రెండూ అవసరమైనవే. అయితే విద్యావ్యవస్థల ముంగిట ఒక సవాల్ కూడా ఉంది. అవే కనుక మన సంప్రదాయ జ్ఞానభాండ గారపు శాస్త్రీయ దృక్కోణాలు సక్రమంగా విద్యార్థులకు చేరవేయ లేని పక్షంలో అప్పుడిక ఈ సంప్రదాయాలను మూఢవిశ్వాసంగా తోసిపుచ్చే అవకాశం ఉంది. కనుక శాస్త్రీయమైనవి, అశాస్త్రీయమైనవి అనే వాటి మధ్య స్పష్టమైన వర్గీకరణ చేయాల్సిన అవసరం ఉంది. ఇది ఒక ముఖ్యమైన బాధ్యత. మన సమాజానికి ఇది ఒక సవాల్. కానీ శతాబ్దాలుగా సంప్రదాయ వ్యవస్థలలో శాస్త్రీయ పరిశీలన మనుగడ, విద్య ద్వారా అది ప్రసారమవుతున్న వైనాన్ని చూపే అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. నేడు ఈ భారతీయ జ్ఞాన వ్యవస్థను విద్యావిధానంలో అగ్రగామిగా నిలిపేందుకు సరికొత్త ప్రయత్నం జరుగుతున్నది” అని తెలిపారు. మానవాళి పట్ల విస్తృతమైన భావన, అందరూ కలిసిమెలిసి మనుగడ సాగించడంపై విశ్వవాపిత ఐక్యతకు చెందిన నాగరికతా సూత్రాన్ని హొసబలే నొక్కి చెప్పారు. “మానవాళి, దాని వైఖరి పట్ల తలెత్తే ఒక విస్తృతమైన ప్రశ్నకు సంబంధించినంతవరకు మనం అంతా ఒక శక్తిలో భాగం అనే మౌలిక భావన మన సంప్రదాయంలో ఉంది. ప్రజల హృదయాలలోకి ఈ భావన లోతుగా పాదుకోనంతవరకు వారి ఆలోచనలలో వ్యక్తి పూజ, ఆధిపత్యవాదం ఉంటుంది. ఐక్యమత్య భావన అభివృద్ధి చెందదు. మానవ అవసరాలు, ఆకాంక్షలను తీర్చడానికి మాత్రమే ఉన్నదనే విధంగా ప్రకృతిని పరిగణించిన పక్షంలో అప్పుడిక దోపిడీ మొదలవుతుంది. మన అవసరాలను తీర్చడానికే ఉన్నదంటూ మనం ప్రకృతిని ఒక బానిసగా చూస్తున్నట్టయితే మనం ప్రకృతిలో సమతుల్యతను దెబ్బతీయడానికి ఉపక్రమిస్తున్నట్టుగా భావించాలి. ఒకే శక్తి మానవులలో, జంతువులలో,




మొక్కలలో, సమస్త ప్రకృతిలో ఉందనే విషయాన్ని మనం అర్థం చేసుకున్న పక్షంలో అప్పుడు మనలో ఒక మంచి వైఖరి ఉద్భవిస్తుంది” అని తెలిపారు.

ఇదే సూత్రాన్ని మరింత వివరిస్తున్నట్టుగా మాట్లాడుతూ “హిందూ సంప్రదాయంలో ఈ భావన (ఐకమత్య భావన) కేంద్రీకృతమై ఉంది. నాలోనూ, మీలోనూ, అన్ని జీవులలోనూ ఒకే శక్తి ఉంటుంది. కనుక ప్రతి ఒక్క జీవిని తప్పనిసరిగా గౌరవించాలి. ఇతరులతో మన వ్యవహారశైలిని విశ్వవ్యాపిత ఐక్యత అనే భావన తీర్చిదిద్దుతుంది. అది మానవుల్లో మాత్రమే కాకుండా యావత్ ప్రాణికోటిలోనూ గౌరవం, అణకువ, సామరస్యాలను కలుగజేస్తుంది. మనం ప్రకృతి నుంచి విడవడకుడా మనం అందులో భాగమై ఉన్నాం. సాంకేతికతను మనం ఎలా అభివృద్ధి చేయాలి? ఎలా వినియోగించాలి? అనే అంశాలతో సహా మన చర్యలకు ఈ అవగాహన మార్గదర్శనం చేస్తుంది” అని చెప్పారు.

సాంకేతికత పాత్ర, దాని బాధ్యత గురించి హొసబలే మాట్లాడుతూ “ఒక ఉపకరణం లాంటి సాంకేతికత పరిణామక్రమం అత్యంత అప్రమత్తంగా జరగాలి. మన అవగాహన కోసమని అది మూడు పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలి. వాటిలో మొదటిది ఆర్థిక వ్యవస్థ. సాంకేతికత అనేది సమతూకంతో కూడుకున్న ఆర్థిక వృద్ధికి ఊతమిస్తున్నదా? లేక సమాజంలో అసమానత సృష్టిస్తున్నదా? రెండవది జీవావరణం లేదా పర్యావరణం. ప్రకృతిని సాంకేతికత గౌరవిస్తున్నదా? లేక దాని దోపిడీకి, అసమతుల్యతకు దారి తీస్తున్నదా? మూడవది నైతికత. నైతికతను సాంకేతికత సంతరించుకున్నదా? మానవ సంక్షేమానికి ఉపకరించే నైతిక విలువలకు అది కట్టుబడి ఉందా? నైతికత కొరవడిన సాంకేతికత సమాజంలో అసమానతలను సృష్టించిస్తుంది. ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుంది. ప్రకృతిని దోచుకుంటుంది. పర్యావరణంలో సమతూకాన్ని దెబ్బ తీస్తుంది. తద్వారా అది ఒక సమస్యగా మారుతుంది. అందుకని ఏదేనీ ఒక సాంకేతికతను ఆర్థిక వ్యవస్థ, జీవావరణం లేదా పర్యావరణం, నైతికత అనే మూడు గీటురాళ్లతో తప్పనిసరిగా పరీక్షించాలి. ఎప్పుడూ కూడా మానవ సంక్షేమం పరమావధిగా సాంకేతికత ఉండాలి. సమాజానికి లేదా ప్రకృతికి ఎలాంటి హాని తలపెట్టకుండా అది మానవ జీవనాన్ని మెరుగు పరచాలి” అని అన్నారు.

జ్ఞానానికి, విజ్ఞానానికి మధ్య భేదాన్ని సర్‌కార్యవాహ వివరిస్తూ “మన సంప్రదాయంలో జ్ఞానానికి, విజ్ఞానానికి మధ్య ఒక స్పష్టమైన భేదం ఉంది. విషయాల పట్ల అవగాహన కలిగి ఉండటాన్ని లేదా వాటిని అర్థం చేసుకోవడాన్ని జ్ఞానం అంటారు. జ్ఞానమనేది సమాచారాన్ని ప్రోది చేసుకోవడం, నేర్చుకోవడానికి సంబంధించినది. అలా పొందిన జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే సామర్థ్యమే విజ్ఞానం అవుతుంది. ఏ ప్రయోజనాన్ని ఆశించి, ఎక్కడ, ఎంత మేరకు, జ్ఞానాన్ని వినియోగించాలనేది విజ్ఞానం నిర్ణయిస్తుంది. జ్ఞానం ఒక్కటే ఉంటే సరిపోదు. దానికి విజ్ఞానం మార్గదర్శనం చేయని పక్షంలో అది అహంకారానికి, గర్వానికి దారి తీస్తుంది. దుర్వినియోగమవుతుంది. ఈ తారతమ్యాన్ని వివరించేందుకు మన సంప్రదాయంలో విస్తృతమైన సాహిత్యం ఉంది. జ్ఞానంతో పాటు ఎల్లప్పుడూ విజ్ఞానం ఉండాలి. అప్పుడే అది సార్థకమై, ప్రయోజనకరంగా మారుతుంది. జ్ఞానం విజ్ఞానంతో నడిచినప్పుడు, అది వ్యక్తికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడుతుంది. జ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం అత్యంత ముఖ్యమైన పని. నేడు జ్ఞాన సృష్టి జరుగుతోంది, కానీ అది ఎల్లప్పుడూ స్వేచ్ఛగా ప్రవహించదు. సమాజాలు, దేశాలు, నాగరికతల మధ్య జ్ఞానం స్వేచ్ఛగా ప్రవహించే పరిస్థితులను సృష్టించడం

అవసరం. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండేలా అది అందరికీ అందుబాటులో ఉండాలి" అని అన్నారు. పరిమితంగా జ్ఞానం అందుబాటులో ఉండటం వల్ల కలిగే నష్టాలపై హెచ్చరిస్తూ, "పరిమితంగా జ్ఞానాన్ని అందించే గుత్తాధిపత్యం విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి. మూఢనమ్మకాలతో నిండిన కొన్ని సంప్రదాయాలు ఉన్నాయి. వీటిని నిజమైన జ్ఞానం నుండి వేరు చేసి చూడాలి. జ్ఞానం అందరికీ అందు బాటులోకి వచ్చినప్పుడు, వ్యక్తులు సాధికారత పొందుతారు. సమాజాలు మరింత బలంగా తయారై, సమాజం మరింత సమతుల్యంగా, సమానంగా పురోగమిస్తుంది. జ్ఞానం అందరికీ అందుబాటులో వచ్చినప్పుడు శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక ప్రయోజనాలు కొద్దిమందికి మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికీ చేరువ అవుతాయి. అహంకారం అంటే కేవలం ఒక వర్గం, దేశం లేదా సమాజం తమను తాము ఇతరుల కన్నా ఉన్నతంగా భావించుకోవడం మాత్రమే కాదు. మానవులు తమను తాము ప్రకృతి, సృష్టికర్త కన్నా శ్రేష్ఠులుగా భావించి, వినయం లేకుండా ప్రవర్తించినప్పుడు, అది కూడా ఒక రకమైన అహంకారమే అవుతుంది'' అని తెలిపారు.

కృత్రిమ మేధస్సు, ఆరోగ్యం, సుస్థిరత వేగవంత మైన పరిణామం కేవలం ఆర్థిక లాభాలకే పరిమితం కాకుండా, మానవాళి విస్తృత ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడటం అనే ఏకైక అత్యవసరమైన లక్ష్యంపై ఈ సదస్సు దృష్టి సారించింది.

**ఏఐని ఎదుర్కోవడమెలా?**

కంప్యూటర్ హిస్టరీ మ్యూజియంలో అత్యంత కీలకమైన ఫైర్‌సైడ్ చాట్‌తో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమెరికా వ్యాపారవేత్త, గూగుల్ వ్యవస్థాపక బోర్డు సభ్యుడు రామ్ శ్రీరామ్, విద్యా రంగంలో విప్లవం వస్తుందని చెప్పారు. ప్రతి వ్యక్తికి అనుగుణంగా ఉండే విధానం ద్వారా కృత్రిమ మేధస్సు–ఏఐ, జ్ఞానాన్ని "ఉచితంగా, ప్రజాస్వామ్య బద్ధంగా" అందిస్తుందని పేర్కొన్నారు. ఇది విస్తృతంగా అందుబాటులోకి రానుంది. ఇందులో కొంత భాగం ఇంటర్నెట్‌తో జరిగింది. కానీ ఇప్పుడు ఏఐతో ఇది మరింత వేగంగా జరుగుతుంది. ఇది ప్రతి వినియోగదారునికి అనుగుణంగా ఉండే విధానం" అని తెలిపారు. "అత్యంత చౌకైన సాంకేతికత అత్యంత సుస్థిరంగా కూడా ఉండేలా మనం కృషి చేయాలి. మనం మనసు పెడితే అది సాధ్యమేనన్నది నా అభిప్రాయం" అని అన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత, అమెరికా ఇంధన శాఖ మాజీ మంత్రి ప్రొఫెసర్ స్టీవెన్ చూ పొంచి ఉన్న శ్రామిక సంక్షోభంపై ప్రసంగిస్తూ, ఉద్యోగాలను భర్తీ చేస్తున్న ఏఐ (AI) "సాంకేతిక విప్లవాన్ని" క్షీణిస్తున్న ప్రపంచ జనాభాతో సమాజం ఎలా సమన్వయం చేసుకుంటుందోనని ప్రశ్నించారు. "ఏఐ ఎన్నెన్నో ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఉద్యోగాలను భర్తీ చేయడాన్ని క్షీణిస్తున్న జనాభాతో ఎలా సమన్వయం చేస్తారు? ఈ పరివర్తన ఒక పెద్ద సవాల్" అని అన్నారు.

సాంకేతిక రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి, విధాన చట్రాల సమన్వయాన్ని ప్రోత్సహించడానికి శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, విధాన రూపకర్తల ప్రపంచ సమావేశంగా 'థ్రైవ్ 2026' సదస్సును రూపొందించారు. ఈ సదస్సుకు గ్లోబల్ ఇండియన్ సైంటిస్ట్స్ అండ్ టెక్నోక్రాట్స్ ఫోరమ్ (GIST USA), పాలో ఆల్టో నెట్‌వర్క్స్ వంటి పారిశ్రామిక దిగ్గజాల నుండి గణనీయమైన మద్దతు లభించింది. GIST USAకు చెందిన డాక్టర్ యెల్లోజీ రావు మిరాజ్కర్ ఈ కార్యక్రమాన్ని "ప్రాచీన జ్ఞానం, ఆధునిక విజ్ఞానం అద్భుతమైన సమ్మేళనం"గా అభివర్ణించారు. "గ్లోబల్ సైన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్–థ్రైవ్ 2026 సదస్సు AI, ఆరోగ్యం, సుస్థిరత రంగాలలో కీలకమైన పాలనా సవాళ్లను పరిష్కరించడానికి సాంకేతికత, విధాన రంగాలలోని ప్రపంచ నాయకులను ఒకచోట చేర్చింది.

# నిజమైన శాస్త్రవేత్త రుషిగా మారాలి

**థ్రైవ్ 2026 సదస్సులో మేధోపరంగా జరిగిన ఎంతో విలువైన ఒక సంభాషణ, దత్తాత్రేయ హోసబలే, హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ఫెలో, బిల్ డ్రెక్సెల్, మైక్రోస్టాఫ్ రెస్పాన్సిబుల్ ఏఐ పయనీర్ బెన్ ఓల్సెన్, స్టాన్‌ఫోర్డ్ న్యూరో సైంటిస్టు విలియం బి. హర్ల్‌బట్‌లను ఒకచోట చేర్చింది.**

చర్చ ప్రారంభంలో, హర్ల్‌బట్ మాట్లాడుతూ మానవాళికి మెదడు పనితీరు కొంత మాత్రమే తెలుసునని అన్నారు.. ఆత్మవిశ్వాసానికి, అవగాహనకు మధ్య ఉన్న ఈ అంతరం ఒక కలవరపరిచే వైరుధ్యాన్ని వెల్లడిస్తుందని ఆయన సూచించారు: సాంకేతిక సామర్థ్యం వేగవంతమవుతున్నప్పటికీ, ప్రాథమిక అవగాహన పరిమితంగానే ఉంది అని తెలిపారు. ఈ అంశాన్ని కొనసాగిస్తూ, పెరుగుతున్న "జ్ఞానాహంకారం" పట్ల హోసబలే హెచ్చరించారు. కృత్రిమ మేధస్సును ఎక్కువగా చైతన్యపరంగా చర్చిస్తున్న ఈ కాలంలో, వాస్తవికతపై తనకున్న పట్టును మానవాళి అతిగా అంచనా వేసే ప్రమాదం ఉందని తెలిపారు. "మానవ మేధస్సునే మనం ఇంకా అర్థం చేసుకోలేదు. అలాంటప్పుడు దాన్ని మనం పునఃసృష్టించగలమని లేదా అధిగమించగలమని అంత సులభంగా ఎలా చెప్పుకోగలం?" అని హోసబలే ప్రశ్నించారు. ఆధునిక చర్చలు తరచుగా విజ్ఞానశాస్త్రాన్ని, ఆధ్యాత్మికతను పరస్పర విరుద్ధమైన రంగాలుగా చిత్రీకరించడం లోనే అసలు సమస్య ఉంది. ఇది ప్రాథమికంగా తప్పు అని అన్నారు. "విజ్ఞానశాస్త్రం ఆధ్యాత్మికతకు వ్యతిరేకం కాదు," అని నొక్కి చెప్పారు. "దానిని అర్థం చేసుకోవడానికి, అనుభూతి చెందడానికి ఉన్న అనేక సాధనాలలో అది ఒకటి" అని తెలిపారు. ఈ రెండింటినీ సంఘర్షణలో ఉంచడం ద్వారా, సమకాలీన ఆలోచనా విధానం పరిశోధనాపరిధిని విస్తరించడానికి బదులుగా సంకుచితం చేస్తుందని అన్నారు. శాస్త్రీయ కృషితో పాటు ఆధ్యాత్మిక పరిశోధనకు కూడా గణనీయమైన కృషి చేసిన ఐజాక్ న్యూటన్ వంటి వ్యక్తులను హోసబలే ఉదహరించారు. టువంటి ఉదాహరణలు, జ్ఞానాన్ని విభాగాలుగా విభజించకుండా ఏకీకృతంగా చూసిన ఒక పూర్వపు మేధో సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తాయని సూచించారు. జ్ఞానానికి కేంద్రంగా "జ్ఞాపకాన్ని ఉంచుకోవడం" అనే భావనను పరిచయం చేయడం ద్వారా ఓల్సెన్ ఒక ఆలోచనా సరళిని విస్తరించారు. ఆయన సూత్రీకరణలో, మానవ మేధస్సు తరచుగా తన లోతైన మూలాలను మరచి పోతుంది. దానినే ఆధ్యాత్మిక మేధస్సు లేదా నాగరికత వారసత్వ జ్ఞానం అని పేర్కొన్నారు. ఈ సంభాషణ క్రమంగా సత్యాన్ని ఎలా చేరుకోవాలి? అనే ఒక తాత్విక ప్రశ్న వైపు మళ్లింది.

భారతీయ తాత్విక సంప్రదాయాల నుండి స్ఫూర్తి పొందిన హోసబలే సత్యం అనేది కేవలం ఒకే ఆవిష్కరణ పద్ధతికి పరిమితం కాదని వాదించారు. అనుభవపూర్వక ధ్రువీకరణపై ఆధారపడిన విజ్ఞానశాస్త్రం ఒక మార్గాన్ని అందిస్తుంది. కానీ అది ఒక్కటే మార్గం కాదు. "సత్యం ఒక్కటే", సరళం చేయాలి. నొక్కిచెప్పారు. "కానీ దానిని చేరుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి" అని నొక్కి చెప్పారు. శాస్త్రీయ పరిశోధన అసాధారణమైన అంతర్ దృష్టులను అందించినప్పటికీ, అది మానవ అనుభవ పరిధిని పూర్తిగా ఆవరించదు.

డ్రెక్సెల్ తాను "చిన్న సత్యాలు" అని వర్ణించిన వాటికి, అవి సూచించే విశాలమైన, సర్వోన్నత సత్యానికి మధ్య భేదాన్ని చూపడం ద్వారా ఈ అంశానికి దోహదపడ్డారు. ఈ దృక్కోణంలో, శాస్త్రీయ ఆవిష్కరణలు క్రమంగా పోగుపడుతూ,



అవగాహన పొరలను నిర్మిస్తాయి. అయినప్పటికీ, అంతిమ వాస్తవికత, అంటే "ఆంగ్లంలో పెద్ద అక్షరం టీ"తో మొదలయ్యే సత్యం, మరింత లోతైనదిగా, బహుశా కేవలం విశ్లేషణాత్మకమైన దానికంటే అనుభవపూర్వక మైనదిగా మిగిలిపోతుంది. ఈ చర్చ సహజంగానే తత్వశాస్త్రంలోని అత్యంత పురాతనమైన వాదోపవాదా లలో ఒకటైన మనస్సు, పదార్థం మధ్య సంబంధానికి దారితీసింది.

మానవులు ప్రధానంగా భౌతిక జీవులేనా? అనే ప్రశ్న ఉదయించింది. భారతీయ తత్వం నుండి మళ్లీ స్ఫూర్తి పొందుతూ, 'మాయ' అనే భావనను హోసబలే ప్రస్తావించారు. అంటే, భౌతిక ప్రపంచం అంతిమ వాస్తవికత కాదని, అది కేవలం ఒక తాత్కాలిక అభివ్యక్తి మాత్రమేనన్న ఆలోచనను వ్యక్తీకరించారు. ఈ చట్రంలో, చైతన్యం లేదా మనస్సు కేవలం పదార్థం ఉప ఉత్పత్తి మాత్రమే కాదు, అది ఒక ఉన్నతమైన అస్తిత్వ స్థాయిని కలిగి ఉంటుంది. భౌతిక పరిమితులను అధిగమించగల మనస్సు సామర్థ్యం, 'సమాధి' అనే భావనలో ఇమిడి ఉందని ఆయన వివరించారు.

అసలైన ప్రమాదం సాంకేతికతలో కాకుండా, దాని వినియోగాన్ని నిర్దేశించే ఉద్దేశ్యాలలోనే ఉందని హోసబలే నొక్కి చెప్పారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతికత కేవలం వాణిజ్య ప్రయోజనాలు లేదా అధికార పరిగణనలతో వినియోగానికి నోచుకుంటే, అవి మానవ సంక్షేమ సాధనాలుగా కాకుండా దోపిడీ సాధనాలుగా మారే ప్రమాదం ఉంది అని తెలిపారు.

చర్చ కొనసాగుతున్న కొద్దీ, ప్రపంచ నాగరికత గమనం గురించి ఒక ఉమ్మడి ఆందోళన వ్యక్తమైంది. ఈ సందర్భంలో, శాస్త్రీయ పరిశోధనను ఆధ్యాత్మిక జ్ఞానంతో ఏకీకృతం చేయడం అనే ఒక బలమైన ఆదర్శాన్ని హోసబలే వ్యక్తీకరించారు.

"నిజమైన శాస్త్రవేత్త ఒక రుషిగా మారాలి" అని వ్యాఖ్యా నించారు. అత్యున్నత స్థాయి అవగాహనలో, సైన్సు, ఆధ్మాత్మికతల మధ్య వ్యత్యాసం కనుమరుగవుతుందని తెలిపారు.



**ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 24న వాషింగ్టన్‌లో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ విద్యావేత్త, వాల్‌స్ట్రీట్ జర్నల్ సీనియర్ కాలమిస్ట్ వాల్టెర్ రస్సెల్ మీడ్‌తో ముఖాముఖిలో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రస్థానాన్ని సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సంస్థ విస్తరణపై మాట్లాడారు. దాని సంస్కృతిని , ఉనికిని, సేవను అర్థం చేసుకోవడాన్ని వెల్లడించారు. ఆర్‌ఎస్‌ఎస్ పట్ల పాశ్చాత్య అపోహలను కాదన్నారు. సంస్థను ప్రజలు స్వచ్ఛందంగా చేపట్టిన ఒక ఉద్యమంగా తెలిపారు. హిందువులు ఆధిపత్యవాదులు అంటూ వస్తున్న ఆరోపణలను విస్పష్టంగా తోసిపుచ్చారు. ముఖాముఖిలో ముఖ్యాంశాలు..**

# హిందువులు ఆధిపత్యవాదులు కాదు



**సదస్సులో పాల్గొనటం వల్ల మీకు ఎలాంటి అనుభవం ఎదురైంది?**

సదస్సులో భాగం కావడం పట్ల నేను సంతోషిస్తున్నాను. ఇందులో అనేక మంది ప్రముఖుల ప్రసంగాలను వినడంతో విద్యారంగానికి సంబంధించిన ఒక కసరత్తు చేసినట్టుగా అనిపించింది. సదస్సులో కార్యక్రమాలు ఆసక్తికరంగా, విషయం పట్ల మంచి అవగాహనను కలిగించేవిగా ఉన్నాయి. ఈ సదస్సుకు నన్ను ఆహ్వానించి, నేను ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ గురించి నాకు మాట్లాడే అవకాశం కల్పించిన హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు ధన్యవాదాలు. ఇక్కడి ప్రజలను కలుసుకోవడానికి, వారితో మాట్లాడటానికి నేను ఇక్కడికి వచ్చాను. స్టాన్‌ఫోర్ట్‌లో జరిగిన సదస్సులో కూడా పాల్గొన్నాను. అక్కడి చర్చలు సైన్సు, సాంకేతికత, అంతర్జాతీయంగా ఆరోగ్యం, సుస్థిరతలపై దృష్టి పెట్టాయి.

**వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆర్‌ఎస్‌ఎస్ నేడు దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నది?**

జాతికి, సమాజానికి ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న సేవకు 100 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. భారత్‌లో అనేకమందిని మేం చేరుకున్నాము. అమెరికా సహా పశ్చిమ దేశాలు, ఇతర దేశాలలో వేర్వేరు వర్గాల ప్రజలతో మమేకం కావడం ద్వారా వారిని ప్రభావితం చేయడం కూడా అవసరం అని మేం భావించాం. ఇలాంటి విదేశీ పర్యటనల ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, దాని పనితీరు గురించి తెలియపరచడానికి అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు, మేధావులతో సంభాషించే అవకాశం నాకు దక్కింది.

**ప్రపంచంలో అత్యంత పెద్దవైన సంస్థలలో ఒకటిగా ఆర్‌ఎస్‌ఎస్ ఉన్నప్పటికీ పాశ్చాత్య దేశాలలో దాని పట్ల అవగాహన పేలవంగా ఉంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఆర్‌ఎస్‌ఎస్ దైనందిన కార్యకలాపాలను వివరించండి.**

ఆర్‌ఎస్‌ఎస్ అనేది భారతదేశ పురాతన సాంస్కృతిక, నాగరిక విలువల నుంచి స్ఫూర్తి పొందిన స్వచ్ఛంద ప్రజా ఉద్యమ సంస్థ. ఈ స్ఫూర్తినే హిందూ తాత్వికత అని అంటారు. గడచిన 100 సంవత్సరాలుగా స్వయంసేవకులు అని మేం పిలుచుకునే స్వచ్ఛంద కార్యకర్తలను సృష్టించడంలో ఆర్‌ఎస్‌ఎస్ నిమగ్నమై ఉంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని సంతరించుకున్న ఒక సొసైటీని అది నిర్వహిస్తున్నది. వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, సమాజానికి సేవ చేయాలనే తత్వం, సంస్థను నిర్వహించే నైపుణ్యంతో కూడుకున్న స్వయంసేవకులను తయారు చేయడానికి దాదాపు 83,000 ప్రాంతాలలో రోజువారీ సమావేశాలను, మరో 30,000 ప్రాంతాలలో వారాంతపు సమావేశాలను ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహిస్తున్నది. వాటినే మేము శాఖలు అని పిలుచుకుంటాము. ఈ గంటసేపు సమావేశంలో పాల్గొన్న వారిలో జీవన విలువలు, ఆత్మవిశ్వాసం, ఐక్యమత్య భావనను పాదుగొల్పుతాము. ఇదంతా సమాజం, జాతి ఐక్యత మెరుగుదల కోసం సామాజిక మానవ మూలధనాన్ని సృష్టించడం లక్ష్యంగా జరుగుతున్నది. శాఖలలో సమాజంలో అన్ని వర్గాలకు చెందినవారు, అన్ని వయసుల వారు పాల్గొంటారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అవసరార్థులకు ఆర్‌ఎస్‌ఎస్

సేవలు అందిస్తున్నది. విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, తదితర రంగాల్లో కృషి చేస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు దాదాపు 40 పౌర సంస్థలను నెలకొల్పారు. వాటిలో అత్యధికం దేశవ్యాప్త సంస్థలుగా అవతరించి, జాతి నిర్మాణ కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నాయి.

**డాక్టర్ హెడ్గేవార్ నివాసాన్ని సందర్శించిన ఘట్టం నాకు ఇంకా గుర్తు ఉంది. అప్పట్లో తొలి సమావేశానికి ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ఒక చిన్న ఆరంభం నుంచి దేశవ్యాప్తంగా రోజూ 83,000 శాఖలు నిర్వహించే స్థాయికి ఈ సంస్థ ఎదిగింది. ఈ శాఖలకు ప్రజలను మీరు ఎలా సమీకరిస్తారు?**

వ్యక్తిగత సంబంధాలు, ఒకరితో ఒకరికి పరిచయాలతో నిబద్ధత ఏర్పడుతుంది. రోజువారీ శాఖలు సోదరభావాన్ని, సామాజిక నిబద్ధతను, కర్తవ్య నిర్వహణ భావన, సమాజానికి నిస్వార్థంగా తిరిగి ఇవ్వాలనే ఆకాంక్షను కలిగిస్తాయి. అనుభవం, సామర్థ్యం ప్రాతిపదికగా బాధ్యతలను అప్పగించడానికి, సంవత్సరం అంతా కార్యకలాపాలు చేపట్టడానికి ఒక సంస్థాగత నిర్మాణం ఉంది. కానీ కడకు కార్యకలాపాలు కొనసాగడంలో నిబద్ధత, సుహృద్భావ వాతావరణం కీలకమైన పాత్రను పోషిస్తాయి.

**కొంతమేరకు ఆర్‌ఎస్‌ఎస్ అత్యంత వివాదాస్పదమైనది. మీ వరకు ఆర్‌ఎస్‌ఎస్ గురించి అమెరికన్లు ఎక్కడ తప్పుగా అర్థం చేసుకున్నారు?**

అమెరికా కేవలం ఆర్‌ఎస్‌ఎస్ గురించే కాదు. భారతదేశం గురించి కూడా అపోహపడుతున్నది. భారత్ అధిక జనాభాతో, మురికివాడలతో, పేదరికంతో, పాములు, మురికివాడలు, స్వాములతో కూడిదని, భారతదేశం ఒక టెక్ హబ్ కూడా. భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. సాధారణ అమెరికన్ అవగాహనలో ఈ విషయాలు ఎందుకో విస్మరణకు గురవుతుంటాయి. అలాగే, ఆర్‌ఎస్‌ఎస్ గురించి, తెలిసిగానీ తెలియకగానీ, లేదా ఒక అజెండాలో భాగంగాగానీ సృష్టించిన కథనం ఏమిటంటే, ఆర్‌ఎస్‌ఎస్ ఒక హిందూ ఆధిపత్యవాది, ఒక విధంగా క్రైస్తవ వ్యతిరేకి, మైనారిటీ వ్యతిరేకి, మహిళల అభివృద్ధి వ్యతిరేకి అని. ఆధునీకరణ వ్యతిరేకి. ప్రజలు సానుకూలమైనవి కాకుండా వ్యతిరేకతను కలిగించే విషయాలనే ప్రచారం చేస్తారు.

**ఈ భావనను మీరు ఎలా సవాల్ చేస్తారు? అది(ఆర్‌ఎస్‌ఎస్) ఒక హిందూ ఆధిపత్య సంస్థ అని ప్రజలు అన్నప్పుడు మీరు ఎలా స్పందిస్తారు?**

హిందూ తాత్వికత, హిందూ సంస్కృతి ఆధిపత్యాన్ని అనుమతించవు. మేం మొత్తం ప్రపంచాన్ని ఒక కుటుంబంలాగా చూస్తాము. మానవులందరూ మాకు సోదరులు, సోదరీమణులు. ఆధిపత్యం అనే ప్రశ్నకు తావు లేదు. జీవులలోనూ, నిర్జీవులలోనూ, ఇలా ప్రతిఒక్కదానిలోనూ ఏకత్వాన్ని చూస్తాము. అలాంటి ఒక తాత్వికత హిందువుల మూలతత్వం అయినప్పుడు వారిలో ఆధిపత్య ధోరణి ఉండనే ఉండదు. అంతేకాకుండా చరిత్ర ప్రకారం చూసినప్పుడు హిందువులు ఏ దేశంపైనా దండయాత్ర చేయలేదు. ఎవ్వరినీ బానిసలుగా చేసుకోలేదు. హిందువులు ఒకరికి క్షమాపణ చెప్పే స్థితిలో లేరు.

**భారతదేశం సాంస్కృతికంగా, ఆర్థికంగా ఆధునికీకరణ చెందే కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ చాలా దగ్గరగా ఉంది. కొన్ని సందర్భాలలో పురాతన మూలాలను అనుభవిస్తూనే భవిష్యత్తుకు దారి తీసే ఆధునికీకరణ వేర్వేరు దిశలకు లాగుతున్నట్టు కనిపిస్తుంది. ఆ క్రమంలో తన మూలలకు తిరిగి వెళ్లడానికి, భవిష్యత్తు వైపు చూడటానికి మధ్య సమతూకాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఎలా పాటిస్తుంది?**

స్పష్టంగా చెప్పాలంటే సందర్భానుసారంగా ఉద్రిక్తతను సృష్టిస్తూ, పాటించాల్సినవిగా అనిపించే సాంస్కృతిక విలువలు, ఆధునికీకరణ పరస్పరం విరుద్ధమైనవి కావు. అవి ఏకకాలంలో మనుగడ సాగించగలవు. పారిశ్రామికీకరణ, సాంకేతికతలను తీసుకొనివచ్చే ఆధునికీకరణ సాంస్కృతిక విలువలతో కలిసి పనిచేస్తుంది. మనం ఈ ధోరణిని ఇటీవలి దశాబ్దాలలో భారత్, జపాన్ లేదా చైనా దేశాలలోని ఓరియంటల్ సొసైటీలలో చూశాము. ఆయా సొసైటీలు వాటి నాగరికతా విలువలను చెక్కుచెదరకుండా కాపాడుకుంటూనే ఆధునికీకరణను అవలంభించాయి.

హిందూ తాత్వికత సనాతనాన్ని ప్రతిపాదిస్తుంది. సనాతనం అంటే నిత్యమైనది, శాశ్వతమైనది అని అర్థము. అది పురాతనమైది అయినప్పటికీ నిత్యమూ వర్థిల్లుతున్నది. దీనికి తాత్వికమైన తార్కాణంగా మర్రిచెట్టును చెప్పుకోవచ్చు. నాగరికతా విలువలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టుగా లోతైన, బలమైన వేళ్లు మర్రిచెట్టుకు ఉంటాయి. కానీ అదే చెట్టుకు అనేక కొమ్మలు ఉంటాయి. ప్రతి రుతువులోనూ కొత్త చిగురులు, ఆకులు పుట్టుకొస్తుంటాయి. పువ్వులు వికసిస్తుంటాయి. ఇది ఎంత కొత్తదనాన్ని సంతరించుకుంటుందో అంతే పురాతనత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంటుంది. సంస్కృతి, ఆధునీకరణ కలిసి పోగలవు. అలాంటి కలిసిపోవడం అనేది సృష్టిలో ఒక భాగం.




**అంతర్జాతీయ రాజకీయాల విషయానికి వస్తే.. భారత్‌ను ఒక అవిభాజ్య వ్యూహాత్మక భాగస్వామిగా, ఆసియా ఖండంలో ఎలాంటి విపత్కర పరిస్థితిని అయినా చక్కదిద్దే ఒక సమవర్తిగా అమెరికా చూస్తున్నది. ఈ పాత్రను పోషించడంలో సుస్థిరమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధి భారత్‌కు అవసరమవుతుంది. తన పూర్తి సామర్థ్యాన్ని ఆవిష్కరించడంలో భారత్ ఏం చేయవలసి ఉంటుంది?**

అన్ని దేశాలతోనూ మరీ ముఖ్యంగా అమెరికా లాంటి అగ్ర రాజ్యాలతో సత్‌సంబంధాలను కలిగి ఉండాలని భారత్ కోరుకుంటుంది. ఎందుకంటే భారత్ పరిమాణం, జనాభా, సాంకేతికంగా ముందంజ, ఆర్థిక పరిపుష్టిని చూసినప్పుడు ఒక వ్యూహాత్మక భాగస్వామ్యం(అమెరికా లాంటి దేశాలతో) సహజంగానే అవసరమవుతుంది. దీనిని సాధించడమనేది పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం, ఒకరి అవసరాలను మరొకరు గుర్తించడం ద్వారానే సాధ్యమవుతుంది. పరస్పరత్వం లేని పక్షంలో విశ్వాసం కొరవడుతుంది.

**ఒక బలమైన భారత్‌కు పునాదిగా ఒక పటిష్టమైన హిందూ సంస్కృతి గుర్తింపు అవసరం అని ఆర్‌ఎస్‌ఎస్ చాలా కాలంగా వాదిస్తున్నది. అది భారత్‌లో మైనారిటీలను పరాధీనంలోకి పడిపోయే ముప్పును**

**ఆర్‌ఎస్‌ఎస్ దృష్టిలో, హిందూ గుర్తింపు అనేది మతపరమైనది కాదు. అది ఒక నాగరికతా గుర్తింపు. ఆర్‌ఎస్‌ఎస్ ఎల్లప్పుడూ సాంస్కృతిక నైతిక విలువలు, నాగరికతా విలువలకు ప్రాధాన్యతనిచ్చింది. వీటికి ఏ మతంతోనూ ప్రత్యక్ష సంబంధం లేదు. రాజకీయ ప్రయోజనాలు, చరిత్రను తప్పుగా అర్థం చేసుకోవడం తదితర కారణాల వల్ల ఉద్రిక్తతలు అప్పుడప్పుడు తలెత్తుతూనే ఉన్నాయి. ఈ వర్గాలన్నింటితో నిరంతర, సమగ్ర సంభాషణలు అపోహలను తొలగించడంలో కచ్చితంగా సహాయపడతాయని ఆర్‌ఎస్‌ఎస్ విశ్వసిస్తుంది.**



**తీసుకువస్తుందా? లేకుంటే పొరుగు దేశాలతో సమస్యలను సృష్టిస్తుందా?**

ఆర్ఎస్ఎస్ దృష్టిలో, హిందూ గుర్తింపు అనేది మతపరమైనది కాదు. అది ఒక నాగరికతా గుర్తింపు. ఆర్ఎస్ఎస్ ఎల్లప్పుడూ సాంస్కృతిక నైతిక విలువలు, నాగరికతా విలువలకు ప్రాధాన్యతనిచ్చింది. వీటికి ఏ మతంతోనూ ప్రత్యక్ష సంబంధం లేదు. రాజకీయ ప్రయోజనాలు, చరిత్రను తప్పుగా అర్థం చేసుకోవడం తదితర కారణాల వల్ల ఉద్రిక్తతలు అప్పుడప్పుడు తలెత్తుతూనే ఉన్నాయి. ఈ వర్గాలన్నింటితో నిరంతర, సమగ్ర సంభాషణలు అపోహలను తొలగించడంలో కచ్చితంగా సహాయపడతాయని ఆర్ఎస్ఎస్ విశ్వసిస్తుంది. ఆర్ఎస్ఎస్ ఒక మైనారిటీ వర్గం, వారి నాయకత్వంతో అటువంటి సంభాషణలలో నిమగ్నమై ఉంది. పొరుగు దేశాల మధ్య వివిధ కారణాల వల్ల, ఆ దేశాల రాజకీయ నాయకత్వం వల్ల ఉద్రిక్తతలు నెలకొన్నాయి. గత దశాబ్దాలలో చాలాసార్లు పరస్పర సంబంధాలు, విశ్వాసం దెబ్బతిన్నాయి. ఒక పొరుగు దేశంతో మాత్రమే సమస్య ఉంది. అది భారత గర్భం నుండి పుట్టిన తర్వాత పొరుగు దేశంగా మారింది. కానీ ఆ దేశం ద్వారా సమస్యలు సృష్టించడానికి దాని వెనుక చాలా మంది ఉన్నారు.

**నాగరికతా గుర్తింపు గురించి మీరు మాట్లాడుతున్నప్పుడు అమెరికాలో యూదుల వ్యవహార శైలి నాకు గుర్తుకు వచ్చింది. వారిలో కొందరు ధార్మికతకు కట్టుబడి ఉంటారు. మరికొందరు ప్రపంచ దృక్కోణం లేదా ఆహారం ద్వారా మతాన్ని సాంస్కృతికంగా అనుసరిస్తుంటారు. భారత్‌లో హిందూ ధర్మాచరణను సైతం మీరు అదేవిధంగా భావిస్తున్నారా?**

కొంతవరకు అలాగే ఉండవచ్చును కానీ పోలికలు ఎప్పుడూ కూడా నూటికి నూరు శాతం కచ్చితంగా ఒక్కలాగా ఉండవు. సుసంపన్నమైన సుదీర్ఘకాలపు చరిత్రలో ఉపనిషత్తులు, వేదాలు ప్రాతిపదికగా ఒక ప్రపంచ దృక్కోణాన్ని భారత్ అభివృద్ధి చేసుకుంది. ఆ కారణంగానే సమాజం, ప్రకృతి ప్రాతిపదికగా సామాన్య జనులకు దానిని వివరించిన సాధు, సత్‌పురుషులు ఈ నిర్దేశిత ప్రపంచ దృక్కోణం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. అది మన దైనందిన జీవనాన్ని నిర్దేశించింది. భారత్‌కు ఆత్మగా ఆధ్యాత్మికత ఉన్నది. ఆ ఆత్మ వ్యక్తీకరణగా భారతీయ సంస్కృతి విరాజిల్లుతున్నది.

**గల్ఫ్ దేశాలు, ఇస్లాం ప్రపంచ దౌత్యంలో ఒక కీలకమైన పాత్రధారిగా తనను తాను పాకిస్తాన్ ఇటీవల ప్రకటించుకున్నది. ఈ పరిమాణాన్ని ఆర్ఎస్ఎస్ ఎలా అంచనా వేస్తుంది?**

ఇలాంటి రాజకీయాలను ఆర్ఎస్ఎస్ పట్టించుకోదు. అయితే భారత్ ప్రయోజనార్థం భారత ప్రభుత్వం చేసే ప్రకటనలకు, వెలిబుచ్చే భావనలకు మేము మద్దతుగా ఉంటాము.

**ఆర్ఎస్ఎస్‌కు, భారత్‌లో పాలక పక్షానికి(బీజేపీ) మధ్య బంధం గాఢమైనది. ప్రధాని నరేంద్ర మోదీ తన జీవితంలో అధిక భాగాన్ని ఆర్ఎస్ఎస్‌లో ఒక చురుకైన కార్యకర్తగా గడపడానికి వెచ్చించారు. వందేళ్ల ప్రస్థానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న ఆర్ఎస్ఎస్ తదుపరి కార్యాచరణ ఎలా ఉండనుంది?**

అభినందన తెలిపిన మీకు ధన్యవాదాలు. మేం వృద్ధి చెందినప్పటికీ "బిగ్ బ్రదర్స్" – పెద్దన్నలుగా మారలేదు. బలానికి తోడుగా అణకువ ఉండాలని హిందూ తాత్వికత బోధిస్తుంది. దానిని మేం ఆచరిస్తున్నాం. బలం, విజయం మమ్మల్ని వినయ సంపన్నులను చేస్తాయి. ఆ వినయాన్ని కలకలం కాపాడుకుంటాము.

కనుక వచ్చే దశాబ్దాలలో సమాజం, జాతి, మానవాళికి నిస్వార్థంగా సేవచేసే స్వయంసేవకులను సృష్టించే పనిని ఆర్ఎస్ఎస్ కొనసాగిస్తుందని వినయపూర్వకంగా మీకు తెలియజేస్తున్నాను. "నిజమైన హిందువు హిందువుగానే ఉంటాడు. అతడు ప్రపంచ పౌరుడిగా అవతరిస్తాడు" అని నానుడి. ఈ నానుడిని ఆర్ఎస్ఎస్ విశ్వసిస్తుంది. వచ్చే శతాబ్దపు వాకిట నిలిచిన ఆర్ఎస్ఎస్ ఐదు కీలకమైన విషయాలపై దృష్టి పెట్టింది.

**1. సామాజిక ఐకమత్యం, సామరస్యం:** భారతీయ సమాజంలో ఐకమత్యాన్ని సాధించడానికి విబక్షలను అధిగమించడం.

**2. పర్యావరణానుకుల జీవనం:** ప్రకృతికి ప్రజలను చేరువ చేసే క్రమంలో, పచ్చదనంతో కూడుకున్న పరిశుభ్రమైన జీవనాన్ని(నీరు, విద్యుత్ వినియోగంలో ఆదా) సాధారణ ప్రజలకు అందించడానికి చిన్నవైన, చేయదగిన పనులను ప్రోత్సహించడం.

**3. కుటుంబ విలువలు:** భావి తరాలలో సాంస్కృతిక, మానవీయ విలువలను పాదుగొల్పడం. ఒక ఆరోగ్యకరమైన కుటుంబం ఒక ఆరోగ్యకరమైన దేశానికి భరోసా ఇస్తుంది.

**4. జాతీయ స్వావలంబన:** మన షరతులకు లోబడి ప్రపంచానికి మన తలుపులు తెరుస్తూనే ఆర్థికం, భద్రత, తదితర రంగాలలో స్వావలంబన సాధించడం.

**5. పౌర విధులు:** వ్యక్తులు, సామాజిక సమూహాలలో పౌరసత్వ గుణాలు, సత్‌ప్రవర్తనలు, పౌర కర్తవ్యభావనను పాదుగొల్పడం.

ఇవి అన్నీ విశ్వజనీన విలువలు. ఎక్కడైతే దురవస్థ, కష్టాలు ఉంటాయో అలాంటి చోట మానవాళికి సేవ చేయడానికి ఒక దృఢమైన, ఆత్మవిశ్వాసంతో కూడుకున్న జాతి(దేశం) అవసరమని మేం విశ్వసిస్తాము.



# అపార్థాల నుండి దృఢ

**ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే తన అమెరికా పర్యటనలో భాగంగా స్టాన్‌ఫోర్డ్, వాషింగ్టన్, చికాగోలలోని మేధోమథన బృందాలు, విద్యావేత్తలు, ప్రవాస భారతీయులతో సంభాషించారు. భారత్‌పై ఒక నాగరికతా దృక్పథాన్ని ప్రదర్శించారు. దీర్ఘకాలంగా పాతుకుపోయిన అపోహలను ఖండించారు. ధర్మం, ఐక్యత, ప్రపంచ బాధ్యతను నొక్కి చెప్పారు.**



దత్తాత్రేయ హోసబలే వివిధ అంశాలపై ఆర్ఎస్ఎస్ వైఖరిని స్పష్టం చేయడం, అలాగే ఆర్ఎస్ఎస్, భారత్, హిందూ ధర్మంపై ఉన్న అపోహలను తొలగించడం, అమెరికాలోని మేధో మథన సంస్థలు, విద్యావేత్తలు, విధాన రూపకర్తలు, సాంకేతిక పారిశ్రామికవేత్తలు ప్రవాస భారతీయులతో సంప్రదింపులు జరపడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం. భారత్ హిందూ నాగరికతతో విలసిల్లు తున్నది. హిందూ విశ్వాసం పట్ల జరుగుతున్న వక్రీ కరణలు సమాజం, దేశంపై ఉన్న అభిప్రాయాలను ప్రభావితం చేస్తాయి. కులం, కూర, ఆవు వంటి సాధారణ మూసధోరణులు మనకు తెలిసినవే అయినప్పటికీ, అవి కేవలం ఉపరితలాన్ని మాత్రమే తాకుతాయి. ప్రాచ్యవాద కథనాలు తమ వలస పాలనను చట్టబద్ధం చేసుకోవడానికి హిందువులను ఆదిమవాసులుగా చిత్రీకరించాయి. భారతీయులను నాగరికత లేనివారిగా చూపిస్తూ, వలసవాదులను నాగరికులుగా, జ్ఞానవంతులుగా ప్రదర్శించాయి. అమెరికాకు వలస వచ్చిన తొలినాళ్ల నుంచే భారతీయ-అమెరికన్లు ఇటువంటి తప్పుడు ప్రాతినిధ్యానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేస్తున్నారు. హిందూ ధర్మం చిత్రణకు సంబంధించిన కాలిఫోర్నియా పాఠ్యపుస్తక ఉదంతం, కాలి ఫోర్నియాలో "కుల" చట్టానికి వ్యతిరేకంగా జరిగిన రాజకీయ, న్యాయ పోరాటం, ఈ గొప్ప సంస్కృతి, చరిత్ర పట్ల జరుగుతున్న వక్రీకరణకు వ్యతిరేకంగా పోరాడాలనే హిందూ అమెరికన్ల సంకల్పాన్ని పరీక్షించాయి.

పశ్చిమ దేశాలు తమ వలస రాజ్యాలలో మేధోపరమైన చర్చలపై నియంత్రణ సాధించడంతో, తమ వ్యాఖ్యానాల ద్వారా ఆయా సంప్రదాయాలకు చెందిన స్థానికులు తమ సొంత ధార్మిక, సాంస్కృతిక

# ప్రతి స్థాయిలో సుస్థిర సమాజ నిర్మాణం



ఏప్రిల్ 28-29 తేదీలలో బెర్లిన్‌లో పర్యటించిన సందర్భంగా, జర్మనీ విధానరూపకల్పన సంస్థలు, ప్రవాస భారతీయులతో దత్తాత్రేయ హోసబలే మమేక మయ్యారు. వచ్చే 100 సంవత్సరాలలో ఆర్ఎస్ఎస్ కార్యాచరణను వివరించారు. స్టిఫ్టుంగ్ విస్సెన్‌షాఫ్ట్ అండ్ పొలిటిక్స్ (జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ సెక్యూరిటీ అఫైర్స్), కొన్రాడ్-అడెనౌర్-స్టిఫ్టుంగ్ (కొన్రాడ్ అడెనౌర్ ఫౌండేషన్), అబ్‌గెయోర్డ్ నెటెన్‌హౌస్ ఆఫ్ బెర్లిన్ (బెర్లిన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) సభ్యులు సహా ప్రముఖ జర్మనీ సంస్థల సీనియర్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. పరస్పర అవగాహనను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సమావేశాలు జరిగాయి. ఈ చర్చల సందర్భంగా జర్మనీలోని ప్రవాస భారతీయుల ముఖ్యమైన పాత్రను పాల్గొన్నవారు గుర్తించారు. ఈ సంభాషణల సందర్భంగా హోసబలే మాట్లాడుతూ "కుటుంబాల నుండి సమాజాల వరకు ప్రతి స్థాయిలో సుస్థిర సమాజాల నిర్మాణానికి, పర్యావరణ బాధ్యతకు దోహదపడటమే వచ్చే 100 సంవత్సరాలకు ఆర్ఎస్ఎస్ దార్శనికతగా ఉంది. ఇది సమష్టి సార్వజనీన విలువలపై ఆధారపడి ఉంటుంది" అని అన్నారు. అన్ని సంభాషణలలోనూ స్థిరంగా వ్యక్తమైన అంశం ఏమిటంటే, భారత్, జర్మనీ సమాజాలు నిర్మాణ పరమైన సారూప్యతలను పంచుకుంటాయి. ముఖ్యంగా సామాజిక ధోరణి, సామాజిక వ్యవస్థీ కరణ, అభివృద్ధి చెందుతున్న కుటుంబ వ్యవస్థలలో ఈ సారూప్యతలు ఉన్నాయి. ఈ చర్చలు సాంస్కృతిక, విధానపరమైన సందర్భా లలో సుస్థిరత, సామాజిక సమైక్యతను కాపాడుకునే పద్ధతులు, పౌర సమాజ సంస్థల విస్తృత పాత్రను కూడా ప్రస్తావించాయి.

జర్మనీలో నివసిస్తున్న భారతీయులకు ఆ దేశ

# నిశ్చయం వరకు



వారసత్వంపై స్వీయ అవగాహనలో కూడా తీవ్రంగా ప్రభావితులయ్యారు. వలస పాలనలో ఉన్న మనస్సులో, వలసవాద చైతన్యం స్వీయానుభూతి ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుంది.

పరిశీలన అనే చర్య వాస్తవికతను ప్రభావితం చేస్తుంది అనేది క్వాంటం సిద్ధాంతంలోని అత్యంత ఆసక్తికరమైన భావనలలో ఒకటిగా ఉంది. హిందూ ధర్మాన్ని అధ్యయనం చేసే పశ్చిమ దేశాల పండితులకు ఈ భావన ఒక శక్తిమంతమైన ఉపమానంగా ఉపయోగపడుతుంది. పశ్చిమ దేశాల విద్యా పరిశీలన హిందూ ధర్మాన్ని తప్పుగా నమోదు చేయడమే కాకుండా, తరచుగా హిందువులను అపరిచితంగా లేదా ప్రతికూలంగా భావించే రీతులలో దానిని పునర్నిర్మిస్తుందనే హిందువుల ఆందోళనలను ఇది వివరిస్తుంది. "పరిశీలకుని పక్షపాతం'' ఆ సంప్రదాయం పట్ల అందరి అవగాహనను, దానిని అనుసరిస్తున్న స్థానికుల స్వీయ అవగాహనను రెండింటినీ మార్చి వేసిందని చెప్పడానికి ఇది చాలు.

**ఒక సార్థక పర్యటన**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 79 సంవత్సరాల తర్వాత, ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాల తర్వాత, హిందూ ధర్మానికి, భారత దేశానికి ప్రాతినిధ్యం వహించడంలో తమ ప్రాతినిధ్యాన్ని తిరిగి పొందాలన్న హిందూ సమాజపు ఆత్మవిశ్వాసం నుంచి ఉద్భవించిన ఆకాంక్షతో ప్రేరేపితులైన హోసబలే అమెరికాలో స్టాన్‌ఫోర్డ్, వాషింగ్టన్, చికాగోలను సందర్శించారు. శాస్త్రీయ, సాంకేతిక పురోగతి, ఆర్థిక లాభం కంటే నైతికత, సమానత్వం, పర్యావరణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన నొక్కి చెప్పారు.

వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన "న్యూ ఇండియా కాన్ఫరెన్స్"లో కూడా పాల్గొన్నారు. హడ్సన్ స్కాలర్ వాల్టర్ రస్సెల్ మీడ్, ఫ్లోరిడా విశ్వవిద్యాలయం, హామిల్టన్ స్కూల్‌లో ప్రొఫెసర్ అలెగ్జాండర్ హామిల్టన్‌లతో కలిసి అంతర్జాతీయంగా భారతదేశం పాత్రపై జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో ఇండో-పసిఫిక్ డైనమిక్స్, భారత్-అమెరికా వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలపై కూడా చర్చించారు. దత్తాజీతో పాటు ఇండియా ఫౌండేషన్‌కు చెందిన రామ్ మాధవ్, బీజేపీకి చెందిన విజయ్ చౌతైవాలే, మాజీ ప్రతిపక్ష ఎంపీ ప్రియాంక చతుర్వేదిలతో కూడిన ఉన్నత స్థాయి భారత ప్రతినిధి బృందం కూడా ఉంది.

హడ్సన్ సదస్సు తర్వాత, వాషింగ్టన్‌లో "ప్రస్తుత ప్రపంచంలో భారత్ అంతర్జాతీయ దృక్కోణం, దాని పాత్ర" అనే అంశంపై జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త వాల్టర్ ఆండర్సన్, విదేశీ విధానంపై చరిత్రకారుడు వాల్టర్ రస్సెల్ మీడ్ సహా భారతీయ-అమెరికన్ సమాజ సభ్యులు, పండితులు పాల్గొన్నారు. హోసబలే మాట్లాడుతూ హిందువులు ఎన్నడూ దండయాత్రలు చేయలేదని, ఎవ్వరినీ బానిసలుగా చేసుకోలేదని లేదా క్షమాపణ చెప్పదగిన చర్యలకు పాల్పడలేదని పేర్కొన్నారు. మీడియా, విద్యా రంగంలోని కొన్ని వర్గాలలో ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా ముద్ర వేసిన 'హిందూ ఆధిపత్య వాదం'ను తిరస్కరించారు. చికాగోలో జరిగిన ఒక సామాజిక కార్యక్రమంలో హిందూ బహుళత్వాన్ని ప్రశంసిస్తూ, హిందూ ఐక్యత ఆవశ్యకతను హోసబలే నొక్కిచెప్పారు. హిందువుల మధ్య ఐక్యత లేకపోవడం హిందూ సమాజానికి శాపంగా మారిందని, దాని ఫలితంగా రాజకీయంగా బలహీనపడుతున్నామని విచారం వ్యక్తం చేశారు. బహుళత్వం, మత స్వేచ్ఛ, సహనాన్ని పరిరక్షించడం అనేది ప్రపంచవ్యాప్తంగా బలమైన హిందూ ఉనికిని కొనసాగించడంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. "ఏకం సత్ విప్ర బహుధా వదంతి" (ఋగ్వేదం 1.164.46) అనే వాక్యాన్ని కేవలం హిందూ ధర్మం మాత్రమే చెప్పగలదని, అంటే సత్యం ఒక్కటే, కానీ జ్ఞానులు దానిని అనేక విధాలుగా చెబుతారని అన్నారు. సమాజాన్ని సంఘటితం చేయడంలో, దేశ నిర్మాణాన్ని ప్రోత్సహించడంలో, సామాజిక సేవను ప్రోత్సహించడంలో, ఆపదలలో సహాయాన్ని అందించడంలో, విద్యను అభివృద్ధి చేయడంలో, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంలో ఆర్ఎస్ఎస్ పాత్రను హోసబలే ప్రముఖంగా ప్రస్తావించారు.

పాశ్చాత్యులకు ఆర్ఎస్ఎస్ దృక్పథాన్ని తెలియజేయడం, సాంస్కృతిక, వ్యూహాత్మక సంబంధాలను నిర్మించడం ఈ పర్యటన లక్ష్యమని మీడియా పేర్కొంది. ప్రవాస భారతీయుల స్పందన ఎక్కువగా సానుకూలంగా ఉంది. అయితే, సమాజ నిర్మాణ సంస్థగా ఆర్ఎస్ఎస్‌కు పెరుగుతున్న ప్రభావంతో హిందూ వ్యతిరేక సమూహాలు కలవరపడ్డాయి.

**– అవతన్స్ కుమార్,**
భాషావేత్త, సీఎన్‌పీఏ, ఎస్ఈపీసీ
పాత్రికేయ పురస్కారాల గ్రహీత

సామాజిక, ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మకంగా పాల్గొనవలసిన బాధ్యత ఉందని హోసబలే నొక్కి చెప్పారు. విద్య, సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి రంగాలలో సామాజిక అభివృద్ధి, సామాజిక సమైక్యత, క్షేత్రస్థాయి సమీకరణలో ఆర్ఎస్ఎస్ నిమగ్నమై ఉంది. అంతేకాకుండా ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో స్వచ్ఛంద సేవకులతో నడుస్తున్న సామాజిక సంస్థలలో ఒకటిగా ఆర్ఎస్ఎస్ నిలిచిందని తెలిపారు.

ఈ పర్యటనలో భాగంగా, బెర్లిన్‌లో హిందూ స్వయంసేవక్ సంఘ్ (హెచ్ఎస్ఎస్) నిర్వహించిన ఒక సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభకు 200 మందికి పైగా స్వయంసేవకులు హాజరయ్యారు. నాగరిక, సామాజిక మార్పిడుల ద్వారా భారతీయ సంస్కృతి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. శాంతియుత భాగస్వామ్యం, సాంస్కృతిక కొనసాగింపునకు ప్రాధాన్యతనిచ్చారు.



# మైనారిటీలూ భారతీయులే

అమెరికాకు చెందిన మీడియా సంస్థ నేషనల్ పబ్లిక్ రేడియో (NPR)తో జరిపిన ఒక సుదీర్ఘ సంభాషణలో ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక వైఖరిని దత్తాత్రేయ హోసబలే వివరించారు. విమర్శలకు ప్రతిస్పందించారు. భారతదేశ నాగరికతా గుర్తింపు, మైనారిటీలు, ప్రపంచ దృక్పథంపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ఏప్రిల్ 24న హోసబలే హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించిన సందర్భంగా, వాషింగ్టన్‌లో NPRకు చెందిన రాబ్ ష్మిట్జ్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూ, పాశ్చాత్య మీడియాకు ఆర్ఎస్ఎస్‌ను చేరువ చేసిన తీరుకు ఒక నిదర్శనంగా నిలిచిపోయింది. సమాజంలో మైనారిటీల స్థానం, భారత్ పట్ల ఆర్ఎస్ఎస్ దార్శనికతలో వారి స్థానం గురించి అడిగిన ప్రశ్నకు హోసబలే స్పందిస్తూ, "వారు మన దేశంలో, సమాజంలో అంతర్భాగం. వారూ నాలాగే పౌరులే, వారి పూర్వీకులు కూడా భారత్‌కు చెందిన వారే" అని పేర్కొన్నారు.

ముస్లింలను ఆక్రమణదారులుగా ముద్ర వేయడంపై వ్యక్తమవుతున్న ఆందోళనల గురించి ఆయన మాట్లాడుతూ, "భారత్‌పై దండయాత్ర అనేది చరిత్రలో ఒక వాస్తవం. ప్రస్తుత ముస్లింలను మేము ఆక్రమణదారులుగా పరిగణించము. ప్రస్తుత ముస్లింలు, వారి పూర్వీకులు భారతీయ మూలాలకు చెందినవారే. అంటే వారిలో అధికశాతం మందికి దండయాత్ర వల్ల వచ్చిన వారసత్వం కాదు. కానీ భారత్‌పై దండయాత్ర జరిగింది, అది వాస్తవం" అని అన్నారు. మరో ముఖ్యమైన సంభాషణలో "నాగరికంగా, సాంస్కృతికంగా మేము వారిని హిందువులుగానే గుర్తిస్తాము. ఒకవేళ మీరు హిందువు అనేదాన్ని ఏదైనా మతపరమైన కోణంలో చూస్తే, హిందూ మతం అంటూ ఏదీ లేదు. అది ఒక జీవన విధానం" అని హోసబలే అన్నారు. హింసాత్మక ఘటనలతో హిందూ సంఘాలకు చెందిన వ్యక్తులకు సంబంధం ఉందనే ఆరోపణలను కూడా ఎన్‌పీఆర్ లేవనెత్తింది. దీనికి స్పందిస్తూ "ఆర్ఎస్ఎస్ ఒక తీవ్రవాద సంస్థ కాదు. మాది రహస్య సంస్థ కాదు. బహిరంగ సంస్థ. అది ఒక క్షేత్రస్థాయి సంస్థ. మేము ప్రతిరోజూ కనిపిస్తుంటాము. మేము తెర వెనుక ఏ కార్యకలాపాలు చేయడం లేదు" అని అన్నారు. ఇంటర్వ్యూలో ప్రస్తావించిన నిర్దిష్ట కేసుల గురించి మాట్లాడుతూ "ఆ ఘటనలన్నింటిపైనా కోర్టులో విచారణ జరిగింది. అవి నిరూపణ కాలేదు. వాటిలో ఆర్ఎస్ఎస్ సభ్యుల ప్రమేయం లేదు. ఆ దిశగా న్యాయస్థానం తీర్పు ఇచ్చింది" అని చెప్పారు.



"ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరంలో ఉంది. అది సామాన్యులతో కలిసి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నది. కనుక ఆర్ఎస్ఎస్ ప్రస్థానానికి, భారత్ ప్రస్థానానికి అవినాభావ సంబంధం ఉంది. ఆ క్రమంలో ఈ వృత్తాంతాన్ని ప్రపంచానికి తెలియ జెప్పాలని మేము ఆకాంక్షిస్తున్నాము. హిందువుల గురించి, ఆర్ఎస్ఎస్ గురించి, చివరకు భారత్ గురించి, దాని చారిత్రక పథం గురించి రకరకాల అర్థాలు, అపార్థాలు చోటు చేసుకున్నాయి. కనుక సమాజంలో వేర్వేరు రంగాలలో, భిన్నమైన వర్గాలలో ప్రముఖులతో నేరుగా సంభాషణ జరపాలి.

ఈ సంభాషణ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నది. మరీ ముఖ్యంగా ఈ పర్యటన యూకే, ఐరోపా, ప్రత్యేకించి జర్మనీ, అమెరికా దేశాలపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం ప్రజలు భారత్ పట్ల ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. వారిలో కొందరు యోగా ద్వారా, మరికొందరు కుంభమేళా ద్వారా భారత్ లేదా హిందుత్వను అర్థం చేసుకున్నారు. అన్ని రంగాల్లోనూ ఆర్థికంగా భారత్ ఆవిర్భవించిన వైనాన్ని తెలుసు కోవడానికి ఇంకొందరు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈ వృత్తాంతాన్ని తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతున్నారు. స్పందన చాలా బాగుంది. ప్రజలు కడకు విద్యావేత్తలు అత్యంత ఆసక్తితో, ఎంతో లోతుగా చర్చించారు. నేను లండన్‌లో పర్యటించినప్పుడు అక్కడి విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యావేత్తలు తాత్వికపరమైన అంశాలు, భారత్ వృద్ధి వృత్తాంతం, అందులో ప్రజల భాగస్వామం, ప్రజలను భాగస్వాములుగా చేయడంలో ఆర్ఎస్ఎస్ సహాయపడుతున్న వైనం గురించి చర్చించారు. వేర్వేరు దేశాల్లోని ప్రముఖ వ్యక్తులను మేము కలుసుకున్నాము. జపాన్, దక్షిణ కొరియా, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, చివరకు కజకిస్థాన్ లాంటి దేశాలు, పొరుగు దేశాలలో పర్యటించడానికి మేము ప్రయత్నిస్తున్నాము. ఆర్ఎస్ఎస్ ను పరిచయం చేయడానికి మాత్రమే మా లక్ష్యం(పర్యటనల ద్వారా) పరిమితం కాదు. అది హిందూ తాత్వికత, హిందుత్వం, భారత్ చరిత్ర, భారత్ భవిష్యత్తు గురించి చర్చించడం అందులో భాగం అవుతుంది"

– సునీల్ అంబేకర్,
అఖిలభారతీయ ప్రచార ప్రముఖ్,
ఆర్ఎస్ఎస్

# సంఘ శతాబ్ది వేళ ప్రపంచవ్యాప్త సంభాషణ

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే, అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్‌తో కలిసి, 2026 సంవత్సరం ఏప్రిల్ 10 నుండి 15 వరకు యునైటెడ్ కింగ్‌డమ్‌ను సందర్శించారు. ఈ శతాబ్ది సంవత్స రాన్ని సామాజిక సామరస్యం, దేశ నిర్మాణం, సమాజ సేవ అనే ఆశయాలకు పునరంకితం అయ్యే కాలంగా పాటిస్తున్నారు. ఈ స్ఫూర్తితో, సర్‌కార్యవాహ ఈ పర్యటన సందర్భంగా బ్రిటిష్ జనజీవనంలోని వివిధ వర్గాలతో సంభాషించారు. "ప్రపంచం పట్ల ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథం" అనే శీర్షికతో ఒక ప్రైవేట్ రౌండ్‌టేబుల్ చర్చను రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్‌కు చెందిన చాథమ్ హౌస్ నిర్వహించింది. సంఘను సామాజిక పరివర్తన కోసం పనిచేసే ఒక పౌర ఉద్యమంగా సర్‌కార్యవాహ అభివర్ణించారు. స్వయంసేవకులు విద్యార్థులు, రైతులు, నిపుణులు ఇలా సమాజంలోని అన్ని వర్గాల నుండి వస్తారని, ఈ సంస్థ చిన్న పాఠశాలల నుండి పెద్ద ఆసుపత్రుల వరకు 1,29,000కు పైగా సేవా కార్యక్రమాలను పూర్తిగా స్వయంసేవకుల ద్వారానే నిర్వహిస్తుందని తెలిపారు. భారతదేశ విదేశాంగ విధానం, యువత భాగస్వామ్యం, సాంస్కృతిక గుర్తింపు, పౌర జీవనం మధ్య సంబంధం సహా పలు అంశాలపై చర్చ జరిగింది.

లండన్ నగరంలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబిలిటీ, "అండర్ స్టాండింగ్ ఇండియా ఫ్రమ్ ది గ్రాస్‌రూట్స్" – క్షేత్రస్థాయి నుంచి భారత్ పట్ల అవగాహన అనే శీర్షికతో ఒక సదస్సును నిర్వహిం చింది. ఈ కార్యక్రమంలో ఆ కేంద్రం డైరెక్టర్, ఫెలోలు, పరిశోధకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో భారత్‌ను ఒక నాగరికతా సంస్థ అనే భావనను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్‌కార్యవాహ రాష్ట్రానికి, ఆధునిక జాతి రాజ్యానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ "భూమి, ఉమ్మడి సాంస్కృతిక విలువలు, చరిత్ర, దాని ప్రజల కారణంగా ఒక జాతి ఉనికిలోకి వస్తుంది. రాష్ట్రం అనాది కాలం నాటిది, అయితే జాతి రాజ్యం అనేది ఫ్రెంచ్ విప్లవం తర్వాత వచ్చిన ఒక భావన" అని అన్నారు. వ్యవస్థాగత మార్పును సంఘం ఏ ప్రాతిపదికపై తీసుకువస్తుందో తెలిపే క్రమంలో హిందూ సమాజంలో స్వీయ–దిద్దుబాటు పాత్రను కూడా ఈ చర్చ స్పృశించింది.

"ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులలో ప్రపంచం పట్ల ఆర్‌ఎస్‌ఎస్ దృక్కోణం''పై సర్‌కార్యవాహ ప్రసంగాన్ని వినడానికి వాణిజ్య ప్రముఖులు సమావేశమయ్యారు. గత వందేళ్లుగా సంఘం ఒక విస్తృత ప్రజా ఉద్యమంగా ఎలా ఎదిగిందో ఆయన ప్రస్తావిస్తూ, "వ్యక్తిగత స్థాయిలో సద్గుణాల ద్వారా వ్యక్తి నిర్మాణం, దానికి తోడు సామాజిక చైతన్యం" అనే రెండు స్థాయిలలో శాఖ పనిచేస్తుందని వివరించారు. స్వయంసేవకులకు ఎల్లప్పుడూ తగిన వనరులు ఉండకపోవచ్చు, కానీ వారు సమాజానికి తిరిగి సేవ చేయడానికి ఒక మార్గాన్ని కనుగొంటారు అని తెలిపారు.

విద్య, ఆరోగ్య సంరక్షణ, గిరిజన సంక్షేమం వంటి రంగాలలో సేవాభారతి వంటి సంస్థలు చేస్తున్న కృషి, ఈ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడంలో దాతృత్వం పోషిస్తున్న పాత్రతో సహా, సంఘ్ సేవా కార్యక్రమాలపై సభికులు ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్‌లోని హిందూ అధ్యయన కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ గావిన్ ఫ్లడ్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్– SOAS రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ మాథ్యూ నెల్సన్,యూనివర్సిటీ కాలేజ్ లండన్–UCL ప్రొఫెసర్ లూసియా మిచెలుట్టి వంటి పండితులు పాల్గొన్నారు. ఈ చర్చ సంఘ సంస్థాగత స్వరూపాన్ని, సామూహిక స్థాయిలో స్వచ్ఛంద సేవ అర్థాన్ని పరిశీలించింది. భారత్‌లోని సంఘ ప్రాజెక్టులను సందర్శించవలసిందిగా పండితులకు బహిరంగ ఆహ్వానం అందింది. హౌస్ ఆఫ్ కామన్స్, హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు చెందిన వివిధ పార్టీల పార్లమెంటు సభ్యుల బృందం "భారత్ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర" అనే అంశంపై జరిగిన సదస్సులో పాల్గొంది. బ్యాక్‌బెంచ్ బిజినెస్ కమిటీ ఛైర్మన్ రాబర్ట్ బాబ్ బ్లాక్‌మన్ సహా కన్జర్వేటివ్ పార్టీ, లేబర్ పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సంభాషణలో సంఘ మౌలిక సూత్రాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ, గిరిజన సంక్షేమం, విపత్తు సహాయం వంటి క్షేత్రస్థాయి కార్యక్రమాలలో దాని కృషి, భారత్ భవిష్యత్తుపై దాని దృక్పథం వంటి అంశాలను ప్రస్తావించారు. యూకే–భారత్ సంబం ధాలను బలోపేతం చేయడంలో ప్రవాస భారతీయుల పాత్ర గురించి కూడా చర్చించారు. యునైటెడ్ కింగ్‌డమ్ నలుమూలల నుండి వచ్చిన సామాజిక నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఇది ఉమ్మడి ఆందోళన కలిగించే విషయాలపై సంభాషణకు, చర్చకు అవకాశం కల్పించింది. రగ్బీలో జరిగిన హిందూ స్వయంసేవక్ సంఘ్ యూకే కార్యకర్త మండలి సమావేశానికి సర్‌కార్యవాహ హాజరయ్యారు.




(ఆర్గనైజర్ నుంచి)

**అనువాదం: మహేష్ ధూళిపాళ్ళ**

# మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# వ్యక్తివాద నియమాలు-2

**పారిశ్రామిక విప్లవానికి మూలకారణమైన వ్యక్తివాదంలో ప్రధానంగా ఏడు నియమాలున్నాయి. వాటిలో మొదటిది వ్యక్తిగత స్వార్థానికి చెందిన నియమం. రెండోది స్వేచ్ఛాయుత పోటీ నియమం. మూడోది జనాభా నియమం. ఆ నియమాల్లోని లొసుగులేమిటో వివరించిన తరువాత శ్రీకరపాత్రీ స్వామి తదుపరి నియమాలను చెబుతున్నారు.**

4వ నియమం: అమ్మకాలు-కొనుగోళ్లకు సంబంధించిన నియమం : అమ్మకాలు - కొనుగోలు ధర కంటే ఎక్కువగా ఉంటే వస్తువుల ధరలు తగ్గుతాయి. అమ్మకాలతో పోల్చితే కొనుగోళ్లు ఎక్కువగా ఉంటే ధరలు పెరుగుతాయి.ఈ నియమం తప్పకుండా సరైనదే కానీ, ఇది కూడా సర్వదా అపరివర్తనీయం కాదు. ఉత్పత్తి - అమ్మకాలు,వ్యక్తుల ఆదాయం...అనివార్యం,అత్యవసర వస్తువులను అందు బాటులో ఉంచడం కోసం తగు నియంత్రణ అవసరం అవుతుంది. కొనుగోళ్లు తక్కువగా ఉన్నప్పుడు గిట్టుబాటు కాకపోయినా సరే, తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. అందువల్ల సామాన్య వ్యక్తుల ఆదాయం... అత్యవసర వస్తువుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని కొన్ని వస్తువులకు కనీస ధర, మరికొన్నింటికి గిట్టుబాటు ధరలను నిర్ణయించడం అవసరం.

5వ నియమం వేతనాల అంశం : 'ఉద్యోగుల సంఖ్య అవసరమైన నియమాల సంఖ్య కంటే ఎక్కువగా ఉన్నప్పుడు వేతనం తగ్గుతుంది. నియామకాల సంఖ్య ఎక్కువగానూ, ఉద్యోగుల సంఖ్య తక్కువగానూ ఉన్నప్పుడు వేతనాలు పెరుగుతాయి. ఒకవేళ ఇద్దరు పెట్టుబడిదారులు ఒకే ఉద్యోగిని కావాలనుకున్నప్పుడు వేతనం పెరుగుతుంది. అదే ఇద్దరు నిరుద్యోగులు ఒకే పెట్టుబడిదారుడిని ఉద్యోగం కోసం ప్రార్థిస్తుంటే వేతనం తగ్గుతుంది. 'వ్యక్తివాదుల ప్రకారం, 'వేతన నిర్ధారణ విషయంలో ప్రభుత్వం కలగ చేసుకోకూడదు.' సామాన్య దృష్టిలో చూసినప్పుడు ఈ నియమం సరైనదే కానీ మార్పులు లేనిది మాత్రం కాదు. అన్ని సందర్భాల్లోనూ వర్తించదు.

ఎందుకంటే ఏదైనా వివాదం తలెత్తినప్పుడు న్యాయస్థానాలు న్యాయమైన వేతనాన్ని నిర్ధారించి చెప్పాల్సి ఉంటుంది. ఈ విధంగానే పౌర జీవనంలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు వీలుగా ప్రభుత్వాలు కనీస వేతనాన్ని తప్పకుండా నిర్ధారించి చెప్పాల్సి ఉంటుంది. వ్యవసాయం, గోసంరక్షణ, వాణిజ్యం వంటివాటిలో లాభంలో ఆరో భాగం శ్రామికులకు ఇవ్వాలని భారతీయ శాస్త్రాలు నిశ్చయంగా చెప్పాయి. దీనిని మరింత విస్తారంగా ముందు ముందు వివరిస్తాను. పనివాళ్ల కుటుంబ పోషణ, ఆరోగ్యం, శిక్షణ, పని నైపుణ్యం వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని, కనీస వేతనాన్ని నిర్ణయించడం ప్రభుత్వానికి లేదా సమాజానికి చెందిన బాధ్యత.

కనీస వేతనం కంటే ఎక్కువ ఇవ్వదలిచినప్పుడు, శ్రామికుల నియామకాల సంఖ్యను అనుసరించి తగ్గింపు లేదా హెచ్చింపు జరగడం కొంతవరకు సబబే. స్టువర్ట్ మిల్ మొదలైనవారు శ్రామికుల సంఖ్యను తగ్గించి, డిమాండ్‌కు అనుగుణంగా వేతనాలు పెంచడం సబబైనదని నమ్మారు. 'వేతన నిధి సిద్ధాంతం' ప్రకారం,ప్రతి దేశపు జాతీయాదాయంలో ఒకశాతం వేతనాల చెల్లింపునకు ఖర్చవుతుంది. మూలనిధి వేరుగా, స్థిరంగా ఉంటుంది.

కార్మికుల సంఖ్య ఎక్కువైతే ప్రతివారికీ తక్కువ వాటా లభిస్తుంది. ఆ సంఖ్య తక్కువగా ఉంటే ఎక్కువ వాటా వేతనంగా లభిస్తుంది. ఉదాహరణకు 'జాతీయ వేతననిధి'లో 100 రూపాయలు ఉన్నప్పుడు శ్రామికుల సంఖ్య 10 అయితే ప్రతి శ్రామికునికి 10 రూపాయల చొప్పున వేతనంగా అందుతుంది. ఒకవేళ శ్రామికుల సంఖ్య 5 అయినప్పుడు రూ. 20 చొప్పున దక్కుతాయి. ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వాలు కూడా తమ సంపదను పెంచుకోవడం కోసం చేసే ప్రయత్నాల్లో శ్రామికుల పేదరికాన్ని తగ్గించడానికి ఎట్టి చర్యలూ తీసుకోవడం లేదు. ధర్మ నియంత్రణలో ఉన్న పాలనాతంత్రంలో ఎన్నడూ ఇటువంటివి తలెత్తేవి కాదు.

6వ నియమం : భూమి పన్ను నియమం: దీనిని చెప్పినవాడు రికార్డో. అతడి అభిప్రాయం ప్రకారం... 'భూమి లేదా ఏదేని వస్తువుపై పన్ను దానంతట అదే నిర్ధారితం అవుతుంది. ఉదాహరణకు 'ఎ' అనే వ్యక్తికి చెందిన భూమిలో పంట దిగుబడి సగటు దిగుబడి కంటే తక్కువగా ఉన్నప్పుడు, 'బి' అనే వ్యక్తికి చెందిన భూమిలోని పంట దిగుబడి సగటు దిగుబడి కంటే ఎక్కువగా ఉంటే ఆ అదనపు దిగుబడే పన్ను అవుతుంది.' దీనిని కూడా వారు అపరివర్తనీయంగా, స్థిరమైన నియమంగా చెప్పారు. ఈ విషయంలో భారతీయుల దృష్టికోణం ప్రకారం శ్రమ,లాభం అనే వాటిని దృష్టిలో ఉంచుకుని ఆరోవంతు లేదా 5 లేదా 4 లేదా 9వ వంతు,మరికొన్నిచోట్ల 10వ వంతు భాగం వరకు ప్రభుత్వం పన్నును నిర్ధారించవచ్చు. ఇదే సరైనది అనిపిస్తుంది.

7.అంతర్జాతీయ వాణిజ్యాలకు సంబంధించిన చట్టాలు:దేశాల మధ్య ఎగుమతి,దిగుమతులపై ప్రభుత్వాలు పన్నులు వేయకూడదు. దేశీయ మార్కెట్లలో డిమాండ్, సప్లయిల ఆధారంగా ధరలు, సప్లయ్ నిర్ణయంమైనట్లే అంతర్జాతీయ మార్కెట్లలో కూడా వస్తువుల ధరవరలు, ఎగుమతి దిగుమతులు నిర్ధారితం కావచ్చు. దీనినే 'స్వేచ్ఛా వాణిజ్యం' అని కూడా అంటారు. దీని గురించి మరికొంత తెలుసుకోవాల్సి ఉంది.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

త్రివేణి సంగమంలో వాహిని అయిన యమున దేశంలోని ప్రధాన నదుల్లో ఒకటి. హిమాలయాల్లో యమునోత్రి అనే ప్రదేశంలో ఉద్భవించిన ఈ నది హరియాణా రాష్ట్రం గుండా ప్రవహించి ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశిస్తోంది. ఢిల్లీ, నోయిడా, మధుర, బృందావనం, ఆగ్రా నగరాలలో ప్రవహిస్తూ ప్రయాగ్ రాజ్ వద్ద గంగానది అంతర్వాహిని అయిన సరస్వతీతో సంగమిస్తుంది. ఈ నది జన్మస్థలి నుంచి దాదాపు 860 మైళ్లు ప్రవహిస్తుంది.



జూన్ 2 నుంచి యమున పుష్కరాలు

# యమునోత్రీ! నమోస్తుతే..!!

యమున జీవనది. దాని ఆవిర్భావం,దాని మహత్తుల గురించి పురాణేతిహాసాల్లో, వైదిక గ్రంథాల్లో ఉంది. ఈ నదీమాత శ్రీకృష్ణ పరమాత్మని పాదస్పర్శతో పునీతమైనదని పురాణవాక్కు. ఆయన బాల్యమంతా ఈ నది పరీవాహక ప్రాంతం లోనే గడిచింది. శ్రీ శుకయోగీంద్రుడు నైమిశారణ్యంలో మహర్షులకు శ్రీమద్భాగవతాన్ని వినిపిస్తున్నప్పుడు పరమాత్ముని దివ్య లీలావైభవం వినేందుకు పురాణస్థలికి యమునే ముందుగా చేరేదని పురాణాలు పేర్కొంటున్నాయి. యమునోత్రి కూడా గంగోత్రిలానే పరమపావన ప్రదేశం. దీనికి 'సూర్యతనయ, శమనస్వస్తా కాళింది' అనే పేర్లు ఉన్నాయి. గంగా నదికి ఉపనది అయిన యమునకు ఎన్నో ఉప నదులున్నాయి. రంతిదేవుని కారణంగా జన్మించినట్టు చెప్పే చంబలి వాటిలో ముఖ్యమైనది. దీనికే చర్మణ్వతి అనే పేరు కూడా ఉంది. గౌరి, సాహిబి, సింధ్, బెట్వా, ధసన్, క్రెన్ అనే ఉపనదులు యమునలో సంగమిస్తున్నాయి. యమునోత్రిలో వేడి నీటి గుండాలున్నాయి. యమునోత్రి వద్ద యమునా మాత ఆలయం ఉంది. ఆ నదీ మతల్లి విగ్రహం 'తాబేలు మీద నీటి కడవ పట్టుకొన్నట్టు' ఉంటుంది. భరతుడు, అంబరీషుడు, శంతనుడు తదితర చక్రవర్తులు ఈ నది ఒడ్డున ఎన్నో పుణ్యకార్యాలు నిర్వహించారు.

త్రివేణీ సంగమం దేశంలోనే అత్యంత పుణ్యప్రదమైన ప్రదేశాల్లో ఒకటిగా ప్రసిద్ధం. అక్కడ 60 కోట్ల పుణ్యతీర్థాలు సంగమించాయని, ఈ తావున స్నానం చేస్తే విశేష ఫలితం ఉంటుందని మహాభారతం పేర్కొంది. యుమునా నది నీటిని నోటి నిండుగా స్వీకరించిన వారికి సోమయాగం చేసినంత ఫలితం దక్కుతుందని కూడా తెలిపింది. పుష్కర స్నానాదికాలను అటుంచి, కార్తికంలో ఈ నదీస్నానం అత్యంత శుభప్రదమంటారు. నదీ తీరంలోని మధురలో జనార్దనుడిని, శివకేశవులను, సూర్యుడిని ఆరాధించినా, పితృదేవతలకు పిండప్రదానం చేసినా ఎనలేని పుణ్యం దక్కుతుందంటారు.

**జూన్ 2 నుంచి యుమున పుష్కరాలు**

పుష్కరం అంటే 'పుణ్య జలం' అనే అర్థం చెబుతారు. మనిషికి పుష్టినిచ్చే వాటిలో నీరు (పోషయతీతి పుష్కరం) ఒకటి. పుష్కరుడు నివాసం ఉన్నంత కాలంలో ఆయా నదులను మరింత పుణ్యదాయినులుగా భావిస్తారు. పుష్కరుడితో పాటు గురు (బృహస్పతి) గ్రహం ఏడాదికి ఒక రాశి వంతున పన్నెండు రాశులను పన్నెండేళ్లలో చుట్టి వస్తుంది. బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్క నదికి పుష్కరాలు వస్తుంటాయి. .

**'మేషే గంగా వృషే రేవా మిధునేచ సరస్వతీ!**
**కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా!!**
**కన్యాయాం కృష్ణవేణీ చ కావేరీ ఘటకే స్మృతా!**
**వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కర వాహినీ!!**
**మకరే తుంగభద్రా చ కుంభే సింధునదీ స్మృతా!**
**మీనే ప్రణీతా చ నదీ గురోస్సంక్రమణే స్మృతా!!!**

మేషంలో (గంగ), వృషభం (రేవ), మిథునం (సరస్వతి), కర్కాటకం (యమున), సింహం (గోదావరి), కన్య (కృష్ణా), తుల (కావేరి), వృశ్చికం (భీమారథీ), ధనుస్సు (బ్రహ్మపుత్ర), మకరం (తుంగభద్ర), కుంభం (సింధు), మీనం (ప్రాణహిత) ఇలా పుష్కరాలు వస్తుంటాయి. ఈ ఏడాది బృహస్పతి కర్కాటక రాశిలోకి ప్రవేశించడం ద్వారా యమున పుష్కర శోభను సంతరించుకొంటోంది.

**'జన్మప్రభృతి యత్పాతం స్త్రియావా పురుషైనవా**
**పుష్కరేత్ స్నాన మాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి'..**

పుట్టినప్పటి నుంచి సంక్రమించే పాపాలు తొలగిపోయేందుకు పుష్కర సమయంలో నదీస్నానం చేయాలని శాస్త్రం చెబుతోంది. 'దివ్యములై ఈ జలాలు మంగళకరములై మా అభీష్టములను నెరవేర్చుగాక! తాగేందుకు అనువైన నీటిని ఇచ్చుగాక! నీరు మా వైపు ప్రవహించుగాక' (**'శంనో దేవీరభీష్టయ ఆపోభవంతు పీతయే/శంయోరభిస్రవస్తునః'**) అని పుష్కరస్నానం వేళ జలదేవతా ప్రార్థన చేయాలి.

స్నానానంతరం శాస్త్రానుసారం జపం, హోమం, అర్చన, దానం, పితృతర్పణం వంటివి చేయాలి. పుష్కరసహిత బృహస్పతితో పాటు ముక్కోటి దేవతలు, పితృదేవతలు నదిలో ఉంటారని పురాణవచనం. బృహస్పతి పుష్కర నదిలో ఏడాది పొడవునా ఉన్నా, ఆది,అంత్య పుష్కరాలు (తొలి పన్నెండు రోజులు, తుది పన్నెండు రోజులు) శ్రేష్ఠమని చెబుతారు. మిగిలిన రోజుల్లో మధ్యాహ్న సమయంలో రెండు ముహూర్తాల(నాలుగు గడియలు) కాలం ఆ నదిలో పుష్కర ప్రభావము ఉంటుందట.

నీటిలో రెండు శక్తులున్నాయని వేదం చెబుతోంది. దాహార్తిని తీర్చడం, శుభ్రపరచడం బాహ్యశక్తులైతే; మేధ్యం, మార్జనం అంతర్గత శక్తులుగా వివరిస్తోంది. మేధ్యం అంటే నదీ స్నానం సమయంలో మూడుసార్లు మునక వేస్తే తెలిసీ తెలియక చేసే పాపాలు పోతాయని, 'మార్జన' అంటే నీటిని చల్లుకోవడం అంటే సంప్రోక్షణ అని అర్థం. దీని వలన ద్రవ్యశుద్ధి జరుగుతుందని పురాణాల వర్ణన. నీరు నారాయణ స్వరూపం కనుక స్నాన ప్రక్రియలో ఆయన స్పర్శతో పునీతులు అవుతారని విశ్వాసం.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

పన్ను వసూలు నియోగాధికారులతో కలసి వచ్చి మహారాజుతో నిండు పేరోలగంలో చెప్పాడు మురారి.

అప్పటికే మోటుపల్లి స్థల పాలకుడు భీమయ దేవరను రాజధానికి పిలిపించింది రుద్రమదేవి. ఆర్థిక నియోగ నిపుణుడు సదగామభట్టును కూడా పిలిపించాడు మహారాజు.

"మేము.. అంటే రుద్రమదేవి, మురారిదేవుడు, నేను, పన్ను వసూలు అధికారులు, పరదేశీ వణిజశ్రేణి ముఖ్యులు.. అందరం ఆందోళన చెందుతోంది మోటుపల్లి రేవు గురించే మహారాజా! అక్కడ జరుగుతున్న అకృత్యాలు ఇన్నీఅన్నీ కావు. దాదాపు వందమంది సముద్రపు దొంగలు అక్కడ ఉన్నారు. ఒక్కొక్కడి వద్ద వందలమంది కిరాతకులున్నారు. 'కడవంత గుమ్మడికాయ కత్తిపీట'కు లోకువ అన్నట్లు ఆకాశమంత ఎత్తున్న మహానౌకలను కూడా వీళ్ల నీటిలో ముంచేయగలరు. అందున్న సమస్తం దోచుకోగలరు. కొందరు వణిజులు తోటి వణిజుల నాశనం కోరుతూ ఇలాంటి సముద్రపు దొంగలను పెంచి పోషిస్తున్నారు."

"ఒకప్పుడు ఎప్పుడు చూసిన పది విదేశీనౌకలు మోటుపల్లిరేవులో లంగరు వేసి ఉండేవి. ఈ మాసంలో ఒక్కటంటే ఒక్క విదేశీనౌక వస్తే ఒట్టు. గత ఆరు నెలలుగా ఇదే పరిస్థితి." చెప్పాడు మరొక అధికారి.

"మనం భరించలేనంత విపరీతమైన పన్నులు విధిస్తున్నామని, మనకంటే దంతపుర (కళింగ) రేవు వారు విధించే పన్నులు తక్కువ అని,దిగువన పుదుక (పుదుచ్చేరి)రేవులో పన్నులు కూడా మనకంటే సగానికి సగం తక్కువ అని.. విదేశీ వణిజుల ప్రతినిధులు చెబుతున్నారు మహారాజా..!" చెప్పాడు మరొక రేవు అధికారి.

వినివిని చిరాకు పడిపోయాడు మహారాజు గణపతిదేవుడు.

"అబ్బబ్బబ్బా.. ఆపండి. వినలేక చెవులు చిల్లులు పడిపోతున్నాయి. సరే! నేనొక నిర్ణయానికొచ్చాను. అక్కడున్న కిరాతక మూకలను ఏరి పారేయాలి. విదేశీ వణిజుల ఆత్మవిశ్వాసం పెరిగి వాళ్లు తిరిగి మన రేవుకు వచ్చేలా వారికీ అభయం ఇద్దాం. నష్టపోతే ఆ సరకు మొత్తాన్ని లెక్కకట్టి తిరిగి చెల్లిస్తామని శాసనం వేయిద్దాం. సరేనా?!" అన్నాడు.

అందరి ముఖాలలో ప్రసన్నత ద్యోతక మాడింది. సిద్దయదేవర ముఖాన మాత్రం విషాదరేఖల్లో మార్పులేదు.

"సిద్దయా! ఆ కిరాతక సముద్ర దొంగలను అణచి వేయడానికి మీకు కొందరు రక్షణ భటులను పంపుతాను. సరిపోతుందా??" అన్నాడు సిద్దయను చూస్తూ.

"క్షమించాలి మహారాజా! మామూలు రక్షకభటులవల్ల ఆ కిరాతకుల నిర్మూలన కష్టం. దయచేసి ఎవరైనా ప్రముఖ మండడి నాయకత్వంలో సైనికుల పటాలం ఒకటి దాడి చేస్తేనే.."

"ఆగాగు.. మండడి నాయకత్వంలో దాడి..అంటే మెరుపుదాడి? ఓ పటాలం సైన్యం మెరుపుదాడి చేస్తేనే వాళ్ల నిర్మూలన సాధ్యమంటావ్?!!"

"అవును మహారాజా.." అన్నాడు చేతులు జోడించి దీనంగా సిద్దయ.

సిద్దయకు సంఘీభావంగా మురారి సహా మొత్తం అందరూ చేతులు జోడించారు.

అప్పటికి గాని గణపతిదేవునికి మోటుపల్లి రేవులో జరుగుతున్న ఘోరకలి అర్థం కాలేదు.

"ఔరా..! అంటే సాధారణ రక్షకభటులు కూడా నియంత్రించలేని అకృత్యాలు అక్కడ జరుగుతున్నాయా!?.. నిజమే అయితే సహించరాని నేరం." అన్నాడు.

అనంతరం మండడి దుర్గిరెడ్డి నేతృత్వంలో ఓ పటాలం అశ్వికదళం ఓ రాత్రికి రాత్రి మోటుపల్లి స్థల గ్రామాలపై విరుచుకుపడి దాదాపు అందరూ సముద్ర దొంగలను కిరాతకంగా హతమార్చింది.

గాలప్ప తదితర దొంగలు తమను అప్పరుసుశెట్టి నియమించినట్లు అంగీకరించగా వారందరికి ఉరిశిక్ష విధించి అప్పరసు కోష్టాగారాలను ఉన్నపళంగా అంకాలశెట్టికి స్వాధీనం చేసి అప్పరుసును రాజ్యం విడిచి వెళ్లిపోవలసినదిగా రేవు న్యాయస్థానం తీర్పు చెప్పింది.

అనంతరం విదేశీవణిజులశ్రేణి సభ్యులను అనుమకొండకు పిలిపించి పట్టు వస్త్రాలతో సత్కరించి మోటుపల్లి రేవులో తిరిగి వారంతా ప్రశాంతంగా వాణిజ్యం నిర్వహించుకోవాలని కోరుతూ.. ప్రస్తుతమున్న పన్నులలో మూడు వంతులు తగ్గించి, కేవలం నామమాత్రపు పన్నులను నిర్ణయిస్తూ.. వారి సరకు మొత్తానికి బాధ్యత కాకతీయ రాజ్యపాలనా వ్యవస్థ తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అలా మోటుపల్లి రేవులోని వీరభద్రస్వామి గుడి మండప కుడ్యంపై శాసనం వేయించాడు గణపతిదేవుడు.

1.ఎగుమతులు, దిగుమతులపై కొత్తగా 1/30 వంతు సుంకంగా చెల్లించాలి. (గతంలో ఇది ఒక వంతు ఉంటే ఇప్పుడు కేవలం అందులో 30వ వంతు చెల్లిస్తే చాలు.)

2.ఒక గద్యాణం విలువ కలిగిన పన్నీరు,దంతం, జవ్వాది, కర్పూర తైలం, రాగి, సీసం, పట్టుదారాలు, పగడాలు, సుగంధ ద్రవ్యాలపై,1/2, 1/8 వంతుల సుంకాన్ని రూకలలో (నాణేలు) చెల్లించాలి.

3.ఒక గద్యాణం విలువ కలిగిన మిరియాలపై 3/4 వంతు, 1/16 వంతు రూకలలో చెల్లిస్తే సరిపోతుంది.



# గణపతిదేవుడు




38

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

4.ఒక మూట (స్వరూపం) పట్టుబట్టలపై 1/2 వంతు పన్ను రూకలలో చెల్లించాలి.

5.ఒక గద్యాణం విలువ కలిగిన పోకచెక్కలపై 1/2 వంతు శిస్తును రూకలలో చెల్లించాలి.

ఇలా మొత్తం రెండువందల వస్తువులపై పన్నులను నామ మాత్రంగా ఉంచి ఆ శాసనంలో విపులంగా ప్రకటించాడు. దానిని కాకతీయ అభయశాసనంగా తూర్పు పశ్చిమ తీరరేవులలో ప్రముఖంగా చెప్పుకున్నారు. దాంతో తిరిగి మోటుపల్లి రేవు పూర్వవైభవంతో కళకళలాడుతోందని వార్తలు రావడంతో మురిసి పోయేలోగా మరో కొత్త సమస్య తలయెత్తింది.

* * *

ముసురు.. మాసం రోజులుగా వర్షాలు..

వర్షం మొదలయిన రోజు రైతులు తలపైకెత్తి దేవుడ్ని తలచుకుని 'కనికరించావా దేవయ్యా..' అనుకున్నారు.

కానీ దినమూ వర్షాలు కురుస్తుండటంతో ఇప్పుడు తిట్టుకుంటున్నారు.

వర్షాలు.. వర్షాలు.. దాంతో కాలువలు, వాగులు, వంకలు, ఏరులు, నదులు పొంగి పొర్లుతున్నాయి. మరి కొన్ని రోజులు ఇలాగే కురిస్తే ఎదిగిన పైరు మునిగిపోయే ప్రమాదం ఉంది.

నదులపై ముఖ్యంగా తెలుగు రాజ్యాలలో నదులపై ఆనకట్టలు లేవు. కారణం ఒక్కటే..అన్ని చిన్నచిన్న రాజ్యాలు.ఎవరికీ పక్కవాడిపై అభిమానం లేదు. శత్రుత్వమే. పక్కరాజ్యాన్ని ఆక్రమించుకోవాలనే ప్రణాళికలు తప్ప ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని నివారించడానికి కలిసికట్టుగా పనిచేద్దామనే అంశమే తెలియని కాలం.

పడమర ఉదయించి తూర్పునకు ప్రవహించే మహానదీ మతల్లులున్న తూర్పు ప్రాంత రాజ్యాలకు, ఏటేటా వరదలు వచ్చి రైతులు పంటలు కోల్పోతున్నా, ప్రాణాలు పోతున్నా రాజులు పట్టించుకోరు.పైగా, 'అయ్యో మా పన్నుల వసూలు తగ్గిపోతుందేమో' అన్న బెంగ వారిది పాపం.

స్థానిక సమయం వారే ఆయా గ్రామాలలో అందరూ కలిసికట్టుగా నష్టనివారణ చర్యలు చేపడతారు తప్ప రాజుల సహాయం ఉండదు. ఇటీవల స్థల సమయం వారు, నాడు లేదా విషయ సమయం వారు కలసికట్టుగా కొంత శ్రమించి కాలువలకు గట్లు నిర్మించుకోవడం చేస్తున్నారు. అవి కూడా తాత్కాలికమే. నదికి వరద వస్తున్నప్పుడు, అతి వర్షాలు కురుస్తున్నప్పుడు మాత్రమే. సాధారణ పరిస్థితుల్లో ఎవ్వరూ ఏమీ చేయరు. భవిష్యత్ ఏమిటి? రేపటి సంగతి, వచ్చే ఏడాది, వచ్చే పదేళ్లు, వందేళ్లు....ఇలా ఆలోచించడం అసలు తెలియదు.

ఇప్పుడిప్పుడే ఆ ధోరణి పెరుగుతోంది. అన్నింటికీ మహారాజువైపు చూడటం మొదలయ్యింది. గణపతిదేవుని పాలనలో అన్ని అంశాలు మహారాజు వద్దకు తీసుకు వెళ్లడం అనే సంప్రదాయం వచ్చింది.

ఆయనకు నివేదించాడు వ్యవసాయ నియోగామాత్యుడు పరవులనాయడు.

వెంటనే నీటి పారుదల నిపుణులతో సమావేశం ఏర్పాటు చేయమన్నాడాయన. సమావేశంలో, ముగ్గురు నిపుణులు, సంబంధిత నియోగులు.. మొత్తంగా పదిమందితో చర్చ జరిగింది.

గతంలో ఎప్పుడో నలభై ఏళ్లనాడు జరిగిన చింతనా శిబిరంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలే ఇక్కడ.. ఇప్పుడు కూడా ప్రస్తావనకు వచ్చాయి.

"అసలు ఎక్కడో పడమట కొండలలో పుట్టి వేల యోజనాలు ప్రవహించి చివరగా తూర్పున మన రాజ్యాల గుండా పోయి సముద్రంలో కలుస్తాయి. కానీ ఎగువన ఎక్కడా ఒక్కటంటే ఒక్క ఆనకట్ట లేదు మహారాజా! అందువల్ల ఎగువన కురిసిన నీరంతా ప్రవహించి ప్రవహించి మన రాజ్యాలను ముంచెత్తుతున్నాయి. మన పంటలను నాశనం చేస్తున్నాయి. వందలాది మంది బీదాబిక్కి ప్రాణాలు కోల్పోతున్నారు. బతికినవాళ్లు ఎగువనుండి వచ్చిపడిన ఒండ్రు మట్టితో తిరిగి పంటలు బాగా పండించుకుంటున్నారు కాని తక్షణ మరణాలు, పంట నాశనాన్ని పాపం వాళ్లు గుర్తించడం లేదు."

"మరి పాలకులో?? రాజులేమి చేస్తున్నారు??"

"పాపం.. పన్నులు వసూలు తగ్గుతాయని కోటలో కూర్చుని బాధ పడుతుంటారు ప్రభూ."

"కానీ.. కానీ ఈ ఏడాది కొందరు సామంతులు వచ్చి నన్ను సంప్రదించారు అమాత్యా..!"

"అదే నిజమైతే అంతకంటే సంతోషం మరొకటిలేదు ప్రభూ! అది కూడా మీరు ప్రజాపక్షం వహిస్తున్నారు కాబట్టి వాళ్లు కూడా వచ్చారని నా అభిప్రాయం ప్రభూ.."

"సరే సరే.. తక్షణ కర్తవ్యం?"

నదులు మన తెలుగు రాజ్యాలలోకి మొదలయినచోటు నుండి నదుల గట్లను, కాలువల కట్టలను పటిష్టపరిస్తే కనీసం ప్రవాహం పక్కకు పోకుండా సరాసరి సముద్రంలోకి పోతుంది. ఆ పని వెనువెంటనే ప్రారంభించాలి." అమాత్యుడు అన్నాడు.

"ఆ పని స్థానిక సమయం వాళ్లు ఏటేటా చేస్తూనే ఉన్నారు కదా స్వామీ.."

"నా అభిప్రాయం ఏవిటంటే వాళ్లు వాళ్ల గ్రామాల వరకు,లేదా స్థల, నాడు వరకు గట్లు పటిష్టపరచుకుంటున్నారు. కానీ ఒక్కొక్కసారి కృష్ణమ్మ, గోదావరమ్మ లేదా బోలెడన్ని ఉపనదులు ఉధృతంగా వస్తే ఇవేవీ ఆగడంలేదు. గత ఏడాది అదేగా జరిగింది.."

"అవన్నీ మట్టి ప్రాకారాలు.. వరద వస్తే గట్లు తెగుతున్నాయి.."

గణపతిదేవుడు కలగజేసుకున్నాడు. "మట్టితో నిర్మించడం ఏవిటి?రాళ్లతో నిర్మిస్తే శాశ్వతంగా ఉంటుంది కదా.." అందరూ ఆగిపోయారు.

మరో నిపుణుడు అన్నాడు. "ఈ అభిప్రాయం.. అంటే కొండరాళ్లతో నిర్మిస్తే గట్టిగా ఉంటుంది అని ఓ స్థల నాయకునికి చెప్పాను ప్రభూ! కానీ 'దగ్గరలో కొండలు లేవు కదా? దూరం నుండి తేవాలి అంటే ఖర్చు తడిసి మోపెడు అవుతుంది. మా వద్ద అంత సొమ్ము లేదు కదా'.. అంటూ ఆ ప్రయత్నం చేయలేదు ప్రభూ!"



మత్తి భానుమూర్తి

"సరే సరే. నదులు మన సామంత రాజ్యాలలోకి ప్రవేశించిన చోటు నుండి సముద్రంలో కలిసే వరకు అన్ని నదులకు రెండువైపులా గట్లు పూర్తిగా కొండరాళ్లతో చాలా ఎత్తున.. తాడిచెట్టు ఎత్తున కట్టించండి. అందుకు అయ్యే ఖర్చు మొత్తం రాజ్య భాండాగారం నుండి తీసుకోండి. సరిపోకపోతే మహారాజు భాగం నుండి తీసుకోండి. ఒక్క ప్రాణ నష్టం, పంట నష్టం జరగకూడదు. ఇది మా ఆజ్ఞ.."

అద్భుతం.. అంతా బానే ఉంది కాని సమస్య కొండరాళ్ల వద్ద వచ్చింది.

* * *

గంపలపల్లె స్థల. విసురునాడు రాజ్యం..

వ్యవసాయ పని పాటలు మొదలయ్యే ఏరువాక పున్నమి నాటికి ఈ గ్రామంలో తయారయ్యే గంపలకు గిరాకి ఎక్కువ. కొత్త గంపలతో ఏరువాక పండుగ చేసుకుంటారు రైతులు.

గంపలపల్లె, గురిందలగూడెం, నామంపల్లె, పంగుల్లపాడు, నటేశగుల్ల. ఐదు గ్రామాలున్న స్థల.

గోదావరినది ప్రవేశించిన తొలి తెలుగురాజ్యం. నది వెళుతున్నదారిలో మూడో రాజ్యం విసురునాడు. దానిలోనిది ఈ స్థల. వర్షపాతం అధికంగా నమోదయ్యే రాజ్యాలలో ఒకటి. బంగారు పంటలు పండే రాజ్యంగా ఇతరులు ఈర్ష్య పడతారు కాని వర్షాకాలంలో అక్కడ నష్టమయ్యే పంటల గురించి, వరదలకు చనిపోయే ప్రజల గురించి ఆ ఇతర గ్రామవాసులు చెప్పుకోరు.

గొప్పలు చెప్పుకోవడం ధనవంతులకంటే పేదలకే ఎక్కువ సరదా.

గంపలపల్లె దగ్గర గోదావరి వెడల్పు ఎక్కువ. ఆవలి తీరం చూడాలంటే కళ్లపై చేయి పెట్టుకోవలసిందే.

నది ఒకానొక ఏడాది ఉధృతంగా దూకుడుగా ప్రవహిస్తుంది. అప్పుడు వర్షాలు తక్కువ ఉండొచ్చు. కాని ఎగువన కురిసిన వర్షం సముద్రంవైపు వచ్చే స్తుంది. దారిలో అక్కడక్కడా కాలువలు తవ్వారు కాని ఆనకట్టలు లేవు. ఆ వచ్చే గోదావరి గంపలపల్లె దగ్గర మరింత వేగంగా ప్రళయ తాండవం చేస్తుంది. ఖర్మ కొద్దీ ఆ స్థల, గ్రామ సమయసెట్టిలు దుర్బలురు. నిమ్మకు నీరెత్తినట్లుంటారు. "అంతా ఆ శివుడి దయ.." అనేది వారి ఊతపదం.

ఆ ఊళ్లో ఉన్న అతి బలవంతుడు మార్తాండ భట్టారకుడు. ఆయన స్థానిక శివాలయ పూజారి. ఇప్పుడు ఆయన రుద్రునికి దేవాలయం నిర్మిస్తున్నాడు. ఆ ఊరివాడైన నకులశెట్టి గొప్ప పరదేశీ వర్తకుడు. వేలకోట్ల ధనరాసులకు అధిపతి. ఆయన మార్తాండ భట్టారకుని ప్రియశిష్యుడు. మార్తాండుడు ఎప్పుడు కోరితే అప్పుడు కోరిన ధనసహాయం చేస్తాడు. ఆ ధన సహాయంతో మార్తాండుడు ఈ గుడి నిర్మిస్తున్నాడు.

"గురువర్యా! ప్రపంచమంతా తరలివచ్చి చూసేటంత పెద్ద దేవాలయం మన గ్రామంలో నిర్మించాలి. మనం చెల్లించే పన్నులు, కప్పాలు అన్ని తీసుకుపోయి వాళ్ల రాజ్యాలలో పెద్ద పెద్ద దేవాలయాలు నిర్మిస్తున్నారు చోళ, చాళుక్య పాలకులు. మన సొమ్ముతో మనం నిర్మించుకుంటే తప్పేముంది.. మీకు నేనున్నాను.. ఆ రుద్రునికి అద్భుతమైన దేవాలయం నిర్మించండి.."

శిష్యుని అభయంతో మార్తాండభట్టు ఆనందంతో రెచ్చిపోయాడు. మహా విశాలమైన దేవాలయానికి రూపకల్పన చేసి ప్రారంభించాడు. నదీతీరంలో ఉన్న ఈ గ్రామానికి దగ్గరలో కొండలు, పర్వతాలు లేవు. శిల్పులు కోరిన బండలను, రాళ్లను చాలా దూరం నుండి వ్యయప్రయాసల కోర్చి తెప్పిస్తున్నాడు. దేవాలయ నిర్మాణం ఉధృతంగా సాగుతోంది. నివాసం గ్రామంలో ఉండగా గుడి నిర్మాణం నిమిత్తం శిల్పులతో పాటు తాత్కాలికంగా చిన్నపాటి నివాసాన్ని అక్కడే ఏర్పర చుకుని ఉన్నాడు.

ఓ రోజు ఉదయం ఆయన రుద్రదేవుని మూల విరాట్టు విగ్రహరూపంపై ఆగమశాస్త్రం, ప్రతిమాశాస్త్ర గ్రంథాలను పరిశీలిస్తూ.. చాలా ఏకాగ్రతతో ప్రధాన స్థపతులతో చర్చిస్తూ ఉన్నాడు. ఆ సమయంలో నివాసం బయట గుర్రాలు ఆగిన కలకలం వినపడింది. ఆయన సహాయకులు చూసి వచ్చి చెప్పారు.

"మన స్థల సమయశెట్టి పరమేష్టి.. మరికొందరు స్థల, మండల నియోగులు వచ్చారు స్వామీ.."

మార్తాండుడు ఆశ్చర్యపోయాడు. ఈ స్థానిక సమయాల వాళ్లతో, నియోగులతో తానెప్పుడూ ఏ సహాయం కోరలేదే.. ఎందుకు వచ్చారబ్బా! అనుకుంటూ బయటకు వచ్చాడు.

**"స్వామీ! మహామండలేశ్వరుల విధాన నిర్ణయం. గోదావరి నదికి రెండు వైపులా తాడిఎత్తు కట్టలు నిర్మించాలని ఆదేశం పంపించారు. మన స్థల ప్రాంతం పొడవునా ఈ కుడివైపు మన బాధ్యత. గట్టును ప్రతి ఏడాదీ మట్టితో నిర్మిస్తున్నాం. కాని ఈసారి మట్టి వాడవద్దని.. కొండరాళ్లతో నిర్మించ వలసినదిగా ఆదేశించారు మహారాజులవారు. ఎక్కడా రాళ్లు దొరకడం లేదు. అవతల వర్షాలు ఆగకుండా కురుస్తున్నాయి. రేపోమాపో వరద రావచ్చునని పెద్దలు అంచనా వేస్తున్నారు. కాబట్టి మీరు గుడికోసం తరలించి తెచ్చిన కొండరాళ్లను గట్టు నిర్మించడానికి తీసుకువెళతాం. అనుమతించండి.."**

దాదాపు పాతిక మంది. అధికార నియోగ ముఖ్యులు..సమయసెట్టి వినయంగా నమస్కరించి చెప్పాడు.

"స్వామీ! మహామండలేశ్వరుల విధాన నిర్ణయం. గోదావరి నదికి రెండు వైపులా తాడిఎత్తు కట్టలు నిర్మించాలని ఆదేశం పంపించారు. మన స్థల ప్రాంతం పొడవునా ఈ కుడివైపు మన బాధ్యత. గట్టును ప్రతి ఏడాదీ మట్టితో నిర్మిస్తున్నాం. కాని ఈసారి మట్టి వాడవద్దని.. కొండరాళ్లతో నిర్మించ వలసినదిగా ఆదేశించారు మహారాజులవారు. ఎక్కడా రాళ్లు దొరకడం లేదు. అవతల వర్షాలు ఆగకుండా కురుస్తున్నాయి. రేపోమాపో వరద రావచ్చునని పెద్దలు అంచనా వేస్తున్నారు. కాబట్టి మీరు గుడికోసం తరలించి తెచ్చిన కొండరాళ్లను గట్టు నిర్మించడానికి తీసుకువెళతాం. అనుమతిం చండి.."

విషయం అర్థమై కోపంతో కంపించి పోయాడు మార్తాండుడు.

లిప్తల కాలంలో తన కోపాన్ని అణచుకున్నాడు. అవతల మండలాధికారులున్నారు. వాళ్లకు కోపం తెప్పిస్తే ఏ న్యాయస్థానానికి నివేదిస్తారో.. ఏ శిక్ష వేయిస్తారో తెలియదు.

"అవి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తెప్పించిన శిలలు, బండలు, రాళ్లు. స్థపతులు అనేక ప్రాంతాలు తిరిగి ఉలులతో కొండలను కొట్టి చూసుకుని దేవతల విగ్రహాల కోసం, మూలవిరాట్టు కోసం ఎంపిక చేయగా లక్షలాది నాణేలు ఖర్చుచేసి వందల ఎడ్లబళ్లపై ఇక్కడికి చేర్పించిన శిలలు. అవి మీకు సాధారణ రాళ్లుగా కనిపిస్తున్నాయా సెట్టి.. వాటిని ఇవ్వను గాక ఇవ్వను."అని చెప్పాడు.

వచ్చిన వారంతా ముఖాముఖాలు చూసు కున్నారు. మహారాజుల ఆదేశాలను ధిక్కరిస్తే తక్షణ శిక్షగా పైస్థాయి అధికారులు.. అక్కడే గుంజకు కట్టి కాసేపు కొరడా ఝుళిపించి రాళ్లను తరలించు కుపోగలరు.

కానీ ఇక్కడ ఉన్నది రాజ్యంలో గుర్తింపు ఉన్న ప్రముఖ పండిత పూజారి. అందులోనూ నకులసెట్టి లాంటి ప్రముఖ వణిజునికి గురువు. మరోవైపు ఆయన రాళ్లను సేకరించింది దేవాలయ నిర్మాణం కోసం. అలాంటి వాడితో ఆచి తూచి మాట్లాడాలని వాళ్లకు తెలుసు.

మండలాధికారి అన్నాడు. "తమరు గుడి నిర్మాణం కోసం తీసుకుంటున్న జాగ్రత్తలు మాకు తెలుసు స్వామీ. కాని అవతల వరద భయపెడు తోంది. వరద వస్తే ప్రజలు.. ముఖ్యంగా రాజ్యానికి అన్నంపెట్టే రైతులు చనిపోతారు. పంటలు నాశనం అవుతాయి.."

"ఈ పరిస్థితి మనం చేస్తున్న పాపాల ఫలితమే మహానుభావా! గోదారమ్మకు కోపం తెప్పిస్తే పరిస్థితి

అలాగే ఉంటుంది. ఈ కలియుగంలో నిత్యమూ మనం ఎన్నెన్నో పాపాలు చూస్తున్నాం. అయినా మేము యజ్ఞయాగాల ద్వారా మన ప్రాంతాన్ని పరిరక్షిస్తున్నామని మహామండలేశ్వరులకు మా మాటగా నివేదించండి. రేపటి నుండే వరుణ యజ్ఞం ప్రారంభిస్తానని పెద్దలకు తెలియజేయండి. ఇక బయలుదేరండి..” లేచి లోపలికి వెళ్లిపోయాడు.

వచ్చిన అధికారులంతా నిలబడిపోయారు. ఏమి చేయడానికి వారికి తోచలేదు. మహామండలేశ్వరుల కార్యాలయానికి నివేదించడం తప్ప తక్షణం వాళ్లు చేయగలిగింది ఏమీ లేదు. అదే చేశారు.

వారికి తగిన జవాబు వచ్చింది.

మరునాటి నుండి ఆ గుడినిర్మాణ ప్రాంగణంలోనే వరుణ యజ్ఞం ప్రారంభిం చాడు మార్తాండ భట్టారకుడు.

దేవుడిని బూచిగా చూపి ఎవరినైనా అడ్డుకోవడం ప్రతి పూజారికి పెద్ద కవచం.. ఆనాడయినా.. ఈనాడయినా..

వర్షం కురుస్తూనే ఉంది. మబ్బులు పరుగులు పెడుతూనే ఉన్నాయి. మెరుపులు, ఉరుములు రెచ్చిపోతూనే ఉన్నాయి. గోదావరమ్మ పరుగుల వేగం రోజు రోజుకీ ఉధృతం అవుతూనే ఉంది.

తెలుగు రాజ్యాలలోని అన్ని ప్రధాన నదులు, ఉపనదులు, పెద్ద కాలువలు, అప్పటికే తవ్విన సముద్రాల్లాంటి చెరువులు. అన్నింటికి.. అన్ని రాజ్యాలలో యుద్ధ ప్రాతిపదికన ఇరువైపులా కొండరాళ్లతో కొండలంత ఎత్తున గట్లు, కట్టలు.. నిర్మిస్తున్నారు. కొన్ని చోట్ల నిర్మించేశారు. అన్ని కట్టలు, గట్టులపై అమ్మవార్ల విగ్రహాలు.. ఎవరికి నచ్చిన గ్రామదేవత.. మైసమ్మ, బాలమ్మ, కైసమ్మ, గంగానమ్మ, మారెమ్మ, మాంకాళమ్మ..

గంపలపల్లె స్థలలో గోదారమ్మ పారుతున్న ప్రాంతమంతా రెండువైపులా గట్ల నిర్మాణం.. వాటిపై అమ్మవార్ల, వరుణదేవుని విగ్రహాలు, కొన్ని చోట్ల చిన్న చిన్న గుళ్లు నిర్మిస్తున్నారు కూడా. కేవలం గంపలపల్లె గ్రామం వద్ద.. ఎడమవైపున గట్టు నిర్మాణం పూర్తికాగా గుడి నిర్మిస్తున్న కుడివైపు మాత్రమే నిర్మాణం జరగ దంలేదు.

గుడి నిర్మాణాన్ని కొనసాగిస్తూనే మార్తాండుడు పాలకుల నుండి వచ్చే ముప్పును ఊహించి ఎదురుదాడికి తగిన కార్యకలాపాలు చేశాడు. వీరశైవ బృందాలను, భక్తులైన అమాయక గ్రామీణులను పెద్ద ఎత్తున తరలించి గ్రామానికి ఆమడ దూరంలోనే రక్షణకోటలా నిలబెట్టాడు.

వారం రోజుల అనంతరం కొన్ని వందల ఎడ్లబళ్లు దేవాలయం వద్దకు తరలి వచ్చాయి,గట్టు నిర్మించడానికి కావలసిన రాళ్లను తరలించడానికి. మార్తాండుడు రెచ్చగొట్టి పొలిమేర వద్ద నిలబెట్టిన వీరశైవ బృందాలు ఆ ఎడ్లబళ్లను అడ్డుకున్నాయి. రాళ్ల తరలింపు కోసం వచ్చిన ఎడ్లబళ్లు అక్కడే ఆగిపోయాయి.

వరుణయజ్ఞం విఘ్నం లేకుండా జరుగుతోంది. కాని ఆ రాత్రి ఉన్నట్టుండి ఈదురుగాలులు పెరిగాయి. వర్షం తీవ్రరూపం దాల్చింది. అన్ని నదులు వరదలతో పోటెత్తాయి. తాడేత్తున రాతి గట్లు పూర్తయిన చోట ఏ నదీ దారి తప్పి గ్రామాలపై పడలేక పోయింది. అన్ని నదులు, వాటి పాయలు సరాసరి సాగిపోయి సముద్రంలోని పరుగులు పెడుతున్నాయి. కేవలం ఒక్కచోట మాత్రమే గోదారమ్మ గట్టు లేకపోవడంతో కట్టు తప్పింది.

అది గంపలపల్లె వద్ద!!

కుడివైపు..గుడి నిర్మాణం వైపు, వరుణ యజ్ఞశాల వైపు.. గోదారమ్మ ఉవ్వెత్తున ఉత్సాహంతో ఎగిరెగిరి దూకిదూకి తన సరదాలను తీర్చుకుంది. ఫలితం.. యజ్ఞశాలే కాదు స్థలలోని ఐదు గ్రామాలను ముంచెత్తింది. యజ్ఞశాల వద్ద అందరూ వరద ఉధృతికి చనిపోయారు. శవాలు అక్కడున్న బండరాళ్లకు తాకి నిలిచి పోయాయి. ఆ వరద నీటిలో తేలియాడు తోంది మార్తాండ భట్టారకుని శరీరం.. శవం!!

ప్రజలు తమ సమస్యలకు కేవలం దేవుళ్లను నమ్మడం తగ్గించి మహారాజులను నిలదీయడం, వారు బాధ్యతగా ప్రవర్తించి తెలుగు రాజ్యాలను ఏకరాజ్యంగా భావించి, నిపుణులతో చర్చించి.. తగిన నిర్మాణాలు చేపట్టడం మొదలయ్యింది.. దానికి ఆరంభకుడు కాకతీయ మన్మహామండలేశ్వరుడు గణపతిదేవుడు!!

* * *

సబ్బినాడు రాజ్యం..

ఛామనపల్లె గ్రామంవైపుగా రెండెడ్ల బండి పోతోంది. లోపలున్న ఇద్దరు ఆ బండి కుదుపులకు, ఎడ్ల మెడల్లోని గంటల శబ్దాలకు, రివ్వురివ్వున వీస్తున్న గాలుల జానపద పాటలకు, అటూఇటూ ఎటు తలతిప్పి చూసినా కనిపించే పంట పొలాల పచ్చదనానికి.. రెప్పవేయకుండా చూస్తూ అనుభూతిస్తున్నారు.

చూస్తుంటే వారిద్దరూ పట్టణవాసులని.. బలిష్టమైన వారి శరీరాలు వారిని మహాయోధులుగా.. వారు ధరించిన దుస్తులు వారిని సాధారణ పౌరులుగా చూపుతున్నా వారి చుట్టూ కనిపించనిదేదో శక్తి వారిని మహాపురుషులుగా ప్రకటిస్తోంది.

వారిద్దరి మాటలను బట్టి బావ బావమరదులని.. తెలుస్తోంది.

వారిద్దరూ సాధారణ పట్టణ పౌరులుగా మారువేషాల్లాంటి రూపాలలో కనిపిస్తున్నవారు. కాకతీయ మహామండలేశ్వరుడు గణపతిదేవుడు, ఆయన స్వయానా బావమరిది, మహాయోధుడు, గజసాహిణి, అపూర్వ నాట్యవేత్త జాయచోడుడు.. అని మాత్రం ఎవ్వరూ గుర్తించలేరు.

కారణం వారు ప్రయాణిస్తున్న మార్గం పూర్తిగా పట్టణ వాసనలకు దూరం.

అనుమకొండ నుండి పూర్తి రాజలాంఛనాలతో సబ్బినాడు మండలేశ్వరుని రాజప్రాసాదానికి వచ్చారు కానీ అక్కడి నుండి సాధారణ పౌరులుగా వెళ్లాలన్న చిలిపి ఆలోచన గణపతిదేవునికి కలిగింది. బావగారి కోరికను ఏనాడూ త్రోసి పుచ్చని పరమ విధేయ బావమరిది జాయచోడుడు. సరే..!అంటూ తనూ ఉత్సాహం చూపాడు.

కాకతీయ రాజ లాంఛనాలను, అంగరక్షకులను అక్కడే వదిలేసి సాధారణ దుస్తులు ధరించిన వారిరువురిని విభ్రమంగా చూస్తున్న సబ్బినాడు మండలేశ్వరుని.. 'ఎడ్లబండి కట్టించమని.. బండి పెరికవానికి కూడా తమ గురించి చెప్పవద్ద'ని ఆదేశించి ఆ ప్రకారమే ఎడ్ల బండెక్కి గ్రామీణ అందచందాల మధ్యగా తిలకిస్తూ పులకిస్తూ సాగిపోతున్నారు.

**సశేషం**



# సంక్షోభ వేళ విజయవం



**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు దేశాల (యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ) వ్యూహాత్మక పర్యటనను విజయవంతంగా ముగించారు. ప్రపంచ భౌగోళిక రాజకీయ మార్పుల నేపథ్యంలో ఇంధన భద్రత, సరఫరా గొలుసుల బలోపేతం, అత్యాధునిక సాంకేతికత, తయారీ భాగస్వామ్యాలపై ఈ పర్యటనలో ప్రధానంగా దృష్టి సారించారు. స్థూలంగా చెప్పాలంటే ఈ ఐదు దేశాల పర్యటనలో దౌత్య పరంగా కీలక విజయాలు సాధించడం విశేషం.**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ తాజా పర్యటనలో భాగంగా యూఏఈతో దీర్ఘకాలిక లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాకు సంబంధించి ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్‌ఓసీ) మనదేశంలో ముడి చమురు నిల్వ సామర్థ్యాన్ని 30 మిలియన్ బారెళ్లకు పెంచేలా కుదిరిన ఒప్పందం మనదేశ ఇంధన భద్రత పరంగా అత్యంత కీలకం. గుజరాత్‌లోని ధోలేరాలో నిర్మాణమవుతున్న 11 బిలియన్ల డాలర్ల విలువైన టాటా ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ ప్లాంట్‌కు అధునాతన లితోగ్రఫీ పరికరాలను సరఫరా చేయడానికి డచ్ దిగ్గజం 'ఏఎస్ఎంఎల్' తో కుదిరిన ఒప్పందాన్నీ చారిత్రాత్మకమనే చెప్పాలి.

**యూఏఈతో కీలక ఒప్పందాలు**

ప్రధాని నరేంద్రమోదీ మే 15న యూఏఈలో కేవలం రెండున్నర గంటల పాటు జరిపిన పర్యటన ఎంతో కీలకంగా మారింది. ఆయన యూఏఈకి వెళ్లడానికి ఒక్కరోజు ముందు ఇజ్రాయెల్ ఒక ఆశ్చర్యకర ప్రకటన చేసింది. ఇరాన్–యు.ఎస్. యుద్ధం జరుగుతున్నప్పుడు ఇజ్రాయిల్ ప్రధాని రహస్యంగా యూఏఈ అధ్యక్షుడిని కలిసారన్నది ఆ ప్రకటన సారాంశం. అంతేకాదు ఐరన్ డోమ్ టెక్నాలజీ, యాంటీ మిస్సైల్ బ్యాటరీలు ఇజ్రాయెల్, యూఏఈకి ఇచ్చింది. ఇంతటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యూఏఈకి తప్ప మరే ఇతర దేశానికి ఇవ్వలేదు. ఈ ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానంతో యూఏఈ, ఇరాన్‌పై దాడులు చేస్తూనే ఉంది. ఇది ఎవ్వరికీ తెలియదు. ఇరాన్‌కు తెలిసినా, దీన్ని బయటకు చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేక మిన్నకుండిపోయింది. అయితే ఇజ్రాయిల్ ప్రభుత్వ ప్రకటనను యూఏఈ అధికారికంగా ఖండించడంతో ఈ రెండు దేశాల మధ్య స్వల్ప విభేదాలు పొడచూపిన తరుణంలోనే మోదీ యూఏఈ వెళ్లడం గమనార్హం. యూఏఈపై, ఇరాన్ చేసిన దాడులను మోదీ తన పర్యటన సందర్భంగా ఖండించడం ఇక్కడ కీలకం. అంతకు రెండు రోజుల ముందు యూపీలో సంభవించిన ఆకస్మిక తుపానులో వంద మందికి పైగా మరణించడంపై యూఏఈ సంతాపం తెలపడం గమనార్హం.

ఇదిలావుండగా యుద్ధం వల్ల నష్టపోయిన యూఏఈ ఎక్కువ చమురు ఉత్పత్తి చేసి నష్టాన్ని పూడ్చుకోవాలనుకోవడాన్ని ఓపెక్ దేశాలు అంగీకరించనందున ఈ గ్రూపునుంచి బయటకు రావడం మన దేశానికి కలిసొచ్చింది. ముఖ్యంగా ఓపెక్ దేశాల నుంచి బయటకు వస్తున్నట్టు యూఏఈ ప్రకటించిన తర్వాత ప్రధాని పర్యటన జరగడం విశేషం. మనకు ఇంధన భద్రత పరంగా, పెట్టుబడుల పరంగా యూఏఈతో మరింత సన్నిహిత సంబంధాలకు ఈ పర్యటన దోహదం చేసింది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో కలిసి రక్షణ, ఇంధన భద్రత, సాంకేతికత, మౌలిక సదుపాయాల రంగాలలో పలు వ్యూహాత్మక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. హోర్మూజ్ జలసంధి మూత వల్ల చమురు సరఫరా దెబ్బతిని మనదేశం తీవ్రంగా నష్టపోయింది. అందువల్ల ఈ జలసంధితో సంబంధం లేకుండా మనదేశానికి చమురు సరఫరా చేయగలిగిన దేశం యూఏఈ మాత్రమే!

ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ (ఐఎస్‌పీఆర్ఎల్), అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్‌ఓసీ)ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం, భారతదేశంలోని వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాలలో (ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, ఒడిశాలోని చండీఖోల్) యూఏఈ 30 మిలియన్ బారెళ్ల ముడి చమురును నిల్వ ఉంచనుంది. అత్యవసర సమయాల్లో ఈ చమురును ఉపయోగించుకునే మొదటి హక్కు మన దేశానికే ఉంటుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), అడ్నాక్ (ఏడీఎన్‌ఓసీ) గ్యాస్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం మనకు నిరంతరాయంగా ఎల్‌పీజీ సరఫరా అవుతుంది. ఇరు దేశాల మధ్య ఉన్న కేవలం 'కొనుగోలుదారు–విక్రేత' సంబంధాన్ని మార్చి, సంయుక్తంగా సైనిక సామాగ్రిని తయారుచేసేందుకు ఒక సమగ్ర రక్షణ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేశారు.

**నెదర్లాండ్స్ (డచ్)తో వ్యూహాత్మక భాగస్వామ్యం**

ప్రధానమంత్రి మోదీ, నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో ఇరు దేశాల సంబంధాలను "వ్యూహాత్మక భాగస్వామ్యం" స్థాయికి పెంచేందుకు నిర్ణయించారు. రక్షణ, సెమికండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ సాంకేతిక రంగం వంటి రంగాలు సహా మొత్తం 17 వ్యూహాత్మక ఒప్పందాలు కుదిరాయి. గుజరాత్‌లోని ధోలేరాలో ఏర్పాటు చేస్తున్న 11 బిలియన్ డాలర్ల టాటా సెమీకండక్టర్ ప్లాంట్‌కు అధునాతన లితోగ్రఫీ టూల్స్ సరఫరా చేయడానికి డచ్ కంపెనీ 'ఏఎస్ఎంఎల్‌తో వాణిజ్య–సాంకేతిక ఒప్పందం అత్యంత కీలకం. 2026 – 2030 మధ్య కాలంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, పెట్టుబడుల రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసేందుకు ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను విడుదల చేశారు. ఈ ప్రణాళిక ద్వారా సరఫరా శృంఖలాల పునరుద్ధరణ, ఉపాధి కల్పన, పెట్టుబడుల విస్తరణను వేగవంతం చేయనున్నారు. కృత్రిమమేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, సైబర్ భద్రత, అంతరిక్ష రంగాల్లో ఉమ్మడి పరిశోధనలు నిర్వహించేందుకు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఉమ్మడి రంగంలో రక్షణ పరికరాల తయారీ, జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు వీలుగా రక్షణ రంగంలో పరస్పర సహకారం కొనసాగించేం దుకు ఇరుదేశాలు సంతకాలు చేశాయి. భవిష్యత్తులో ఇంధన, సాంకేతిక అవసరాలకు అవసరమైన "క్రిటికల్ మినరల్స్" సరఫరా కోసం భారత గనుల మంత్రిత్వశాఖ, నెదర్లాండ్స్ విదేశీ మంత్రిత్వశాఖల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. విద్యార్థులు, పరిశోధకులు,



# ...త పర్యటన!

నిపుణుల సురక్షిత ప్రయాణాలకోసం "మైగ్రేషన్–మొబిలిటీ"పై ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. దీనివల్ల భారతీయ ఐటీ, ఇంజినీరింగ్ నిపుణులకు వీసా ప్రక్రియ మరింత సులభం కావడంతో పాటు, ఏటా వెయ్యిమందికి రెండేళ్లపాటు పని అనుమతులు కల్పించే ప్రత్యేక 'యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్'ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి ఇరుదేశాలు అంగీకరించాయి. రేవులు, అంతర్గత జలమార్గాల ఆధునికీకరణకు, పర్యావరణ అనుకూల రవాణాకు వీలుగా "గ్రీన్ అండ్ డిజిటల్ సీ కారిడార్" పేరుతో వ్యూహాత్మక ప్రణాళికను అమలుపరచనున్నారు. ఈ పర్యటన సందర్భంగా నెదర్లాండ్స్‌లోని లైడెన్ విశ్వవిద్యాలయం తమ వద్ద గల చోళుల కాలంనాటి విశిష్ట 'అనైమంగళం రాగి శాసనాలను' (లైడెన్ శాసనాలు) భారత్‌కు తిరిగి అప్పగించింది.

**స్వీడన్‌తో ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక**

ప్రధాని నరేంద్రమోదీ స్వీడన్ పర్యటనలో భాగంగా ఆ దేశంతో ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక ఒప్పందాలను భారత్ కుదుర్చుకుంది.ఓస్లోలో జరిగిన "3వ ఇండియా–నార్డిక్ సదస్సు" (నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్‌లను నార్డిక్ దేశాలుగా వ్యవహరిస్తారు)మోదీ పాల్గొన్నారు. ఆ దేశ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో జరిగిన చర్చల్లో, ఇరు దేశాల మధ్యగల ద్వైపాక్షిక సంబంధాలను "వ్యూహాత్మక భాగస్వామ్యం" స్థాయికి పెంచారు. 2026–30 మధ్యకాలానికి రక్షణ, వాణిజ్యం, పెట్టుబడుల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించారు. ప్రస్తుత ద్వైపాక్షిక ఒప్పందాన్ని రాబోయే ఐదేళ్లలో రెట్టింపు చేయాలని ఇరుదేశాలు లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. కృత్రిమమేధ, 6జి, క్వాంటమ్ కంప్యూటింగ్, అంతరిక్ష రంగాల్లో పరిశోధనలకోసం "ఇండియా– స్వీడన్ టెక్నాలజీ అండ్ ఏఐ కారిడార్"తో పాటు జాయింట్ ఇన్నోవేషన్ పార్ట్‌నర్‌షిప్ 2.0ను ప్రారంభించారు. "మేకిన్ ఇండియా", "మేక్ విత్ స్వీడన్" చొరవ కింద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, రక్షణ ఉత్పాదనలపై ఒప్పందాలు కుదిరాయి.



**నార్వేతో ఐదు కీలక ఒప్పందాలు**

నార్వే ప్రధాని జొనాస్ గర్ స్టోర్‌తో జరిగిన సమావేశంలో పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలకు సంబంధించిన 5 కీలక ఒప్పందాలపై భారత్ సంతకాలు చేసింది. స్వచ్ఛ ఇంధనం, పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ షిప్పింగ్, బ్లూ ఎకానమీ (సముద్ర వనరుల అభివృద్ధి) లక్ష్యంగా "హరిత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని" ప్రకటించారు. సముద్రతీర పవన విద్యుత్, కార్బన్ క్యాప్చర్, వ్యర్థాల రీసైక్లింగ్ సాంకేతిక పరిజ్ఞాన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ అధీనంలోని సీఎస్ఐఆర్, ఆ దేశ ప్రముఖ పరిశోధనా సంస్థ ఎస్ఐఎన్‌టీఈఎఫ్‌ల మధ్య ఒప్పందాలు కుదిరాయి. మనదేశానికి చెందిన యూపీఐ, ఆధార్ వంటి డిజిటల్ వ్యవస్థలను గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంయుక్తంగా అందించడానికి ముక్కోణపు సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. నార్వే రాజు 5వ హెరాల్డ్, ప్రధాని నరేంద్రమోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని "గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్"ను ప్రదానం చేశారు.

**మరో స్థాయికి ఇటలీ సంబంధాలు**

ఈ పర్యటనలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో జరిగిన చర్చల అనంతరం ఇరుదేశాల బంధాన్ని 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి విస్తరించారు. ఇందుకోసం 2025–29 మధ్య కాలంలో ఉమ్మడి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళిక అమలును మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. 2029 నాటికి ఇటలీ మనదేశంలో 20 బిలియన్ యూరోల పెట్టుబడులు పెట్టేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య 14 బిలియన్ యూరోలుగా ఉన్న వాణిజ్యాన్ని 2029 నాటికి 22 బిలియన్ యూరోలకు పెంచాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. భారత్– ఈయూ దేశాల మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరగా అమల్లోకి వస్తే ఈ లక్ష్యాలు సత్వరం నెరవేరతాయని ఇరుదేశాల ప్రధానులు అభిప్రాయ పడ్డారు. మిలిటరీ హార్డ్‌వేర్, ప్లాట్‌ఫారమ్‌ల ఉమ్మడి అభివృద్ధి, ఉమ్మడి ఉత్పత్తి కోసం ఒక ఖచ్చితమైన రక్షణ రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. ఈ మేరకు రెండు దేశాలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని ప్రకారం హెలికాప్టర్లు, నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌లు, మెరైన్ ఆయుధాలు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలకు సంబంధించిన రంగాల్లో ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. రక్షణ, హై–టెక్ పరిశ్రమలకు అత్యంత అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల సరఫరా, ప్రాసెసింగ్ కోసం ముఖ్యమైన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

అంతర్జాతీయ ఉగ్రవాదానికి నిధులు నిలిపివేత, మనీలాండరింగ్ నియంత్రణ కోసం భారత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ),ఇటాలియన్ గార్డియా డి ఫైనాంజా మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఏఐ, సెమీకండక్టర్లు, అంతరిక్ష పరిశోధనలు, అధునాతన సాంకేతిక రంగాల్లో ఉమ్మడిగా పనిచేసేందుకు వీలుగా ఒప్పందాలు కుదిరాయి. ఈ పర్యటనలో భాగంగా రోమ్‌లోని ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీకి "ఎఫ్ఏఓ అగ్రికోలా మెడల్" బహూకరించారు. భారత్‌లో ఆహారభద్రత, స్థిరమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా నరేంద్రమోదీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

**ప్రపంచ పర్యావరణంలో త్వరితగతిన పెనుమార్పులు సంభవిస్తున్నాయన్నది గత కొంత కాలంగా మనం చూస్తున్నాం. ఇవి విపరీత పరిణామాలు. మానవాళిని అతలాకుతలం చేస్తున్న ఉత్పాతాలు. దాదాపు అన్ని ఖండాలలోనూ ఇదే పరిస్థితి. మంచు తుఫానులు, ఆకస్మిక వరదలు, టోర్నడోలు, పెద్దపెద్ద వడగళ్ల వానలు, పిడుగులు, కొండచరియలు విరిగిపడడం దాదాపు ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలో పరిపాటి అవుతుండగా, ప్రజలు తీవ్ర ఇక్కట్లకు లోనవుతున్నారు. వర్షాభావంతో ఎడారి ప్రదేశాలైన గల్ఫ్ దేశాలలోకూడా గత కొద్ది కాలంగా పడుతున్న విపరీత వర్షాలు, వరదలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. ఈ విపరీత వాతావరణ మార్పులకు కారణాలు విశ్లేషించి మానవాళి తగురీతిగా ప్రపంచ కార్యకలాపాలను అనుసంధానిస్తే పరిస్థితులు కొంతవరకూ విరుగుడు ఉండవచ్చేమో అనిపిస్తోంది.**



# పర్యావరణ పరిరక్షణ

పెరుగుతున్న విపరీత వాతావరణ మార్పులు, పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2026 సందర్భంగా యునైటెడ్ నేషన్స్ ఈ సంవత్సరము “Inspired by Nature. For Climate. For Our Future”. అంటే.. ‘ప్రకృతిని చూసి స్ఫూర్తి పొంది మన భవిష్యత్తును, మన వాతావారణాన్ని మనమే కాపాడుకోవాలి’ అనే నినాదాన్ని ప్రవేశపెట్టింది. ఈ నినాదాన్ని ప్రపంచ మంతా తెలియచేయాలనీ, పాటించాలనీ యునైటెడ్ నేషన్స్ వరల్డ్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రపంచ మంతా చాటుతూ, వాతావరణాన్ని కాపాడుకు నేందుకు తక్షణ చర్యలు తీసుకోవడమూ, అనుకూల పర్యావరణాన్ని దృఢ పరచుకోవడమూ, మనకు ఈ భూమి, ప్రకృతి ఇచ్చే ప్రతికూల సంకేతాలను ప్రజలం దరూ గమనించి ప్రతిస్పందిస్తూ వాతావరణాన్ని పరిరక్షించుకోవడమూ. ఈ దిశలో ఈ సంవత్సరం చేయవలసిన ముఖ్య ప్రయత్నాలిలా ఉన్నాయి. 1. ఈ విషయాలు ప్రచారం చేయడానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవాలను స్వచ్ఛందంగా జరిపే దేశం (host country) అజర్ బైజాన్, ఆదేశపు రాజధాని బకు నగరం.

2. అందరూ ఈ ప్రయత్నంలో భాగస్వాములై ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని అనుకూల వాతావరణాన్ని సాధించుకుందాం. 3. 2026లో వాతావరణం–ఈ విశ్వంలో ఉన్న గ్రహాలన్నిటి స్థితిగతులతో, ముఖ్యంగా భూమి పై జరుగుతున్న విపరీత వాతావరణ మార్పులతో ముడిపడి ఉందని, హానికరంగా మారుతున్న/ దిగజారుతున్న వాతావరణాన్ని సూచిస్తున్నాయని, ప్రకృతిని పరిరక్షించుకోవడమే మన మనుగడకు కీలకం. ఆ దిశలో పని చెయ్యాలి.

ఈ విషయంలో అజర్ బైజాన్ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం అభివృద్ధికై తీసుకుంటున్న చర్యలు: 1. పచ్చదనం పెంపొందించుకోవడానికి, సంప్రదాయ ఇంధన వనరులను (రెన్యువబుల్ ఎనర్జీ సోర్సస్) ఉపయోగించుకోవడానికి చాలా వేగవంత మైన కార్యప్రణాళికను అమలుచేయడం. 2. కర్బన ఉద్గారాలను 2035 కల్లా దాదాపు 40% తగ్గించడానికి చేసుకున్న పారిస్ ఒప్పందానికి కట్టుబడి పనిచేయడం. 3. పునరుత్పాదక వనరుల (రెన్యువబుల్ ఎనర్జీ సోర్సస్) వినియోగం 2030 కల్లా 30% పెంచడం. 4. 230 MW గారాడగ్ సోలార్ ప్లాంట్ సహా 240 MW కిజీ అబషేరోన్ విండ్ ఫామ్ ప్రాజెక్టలను అతిరిక్తంగా 1 GW సామర్థ్యం త్వరలోనే కలిగిఉండడానికి ప్రాజెక్టులను త్వరతగతిన పూర్తి చేసే ప్రణాళికలతో పనిచేస్తుంది. 5.:బకు నగరంలో సుస్థిర పట్టణాభివృద్ధి (అర్బన్ సస్టెనబిలిటీ సాధించే దిశగా పయనిస్తూ ఆధునిక / తక్కువ ఇంధన ఉద్గారాలను విదుదలచేసే/లేదా పూర్తిగా ఉద్గారాలు లేని బస్సులను ఉపయోగించడం. పెట్రోల్ /డీజిల్‌కి ప్రత్యామ్నాయ్యంగా ఎలక్ట్రిక్ రవాణా/మెషినరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడం. నీటి ఎద్దడి ప్రాంతాలలో తక్కువ నీటితో చేసే ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించడం నిర్వీర్యమైన పర్యావరణ వ్యవస్థను పునరుజ్జీవింపచేయడము మొదలైనవి చేపడుతోంది.

ఇంకా ప్రకృతి, ప్రజల మీద పర్యావరణ కాలుష్యం భారం పడకుండా ప్లాస్టిక్ వేస్ట్ తగ్గించడం, కొత్త, మరింత ప్రభావవంతమైన పర్యావరణ పరిరక్షణ చట్టాలను రూపొందించడం, వాణిజ్య కలాపాలలో 15 మైక్రోన్ సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగం నిషేధించడం మొదలైన అనేక చర్యలు చేపడుతోంది. ఈ దేశం తీసుకుంటున్న ఇంకా ఇలాంటి మరెన్నో పర్యావరణ పరిరక్షణ విధానాలు ఎంతో అభినందనీయమైనవి కదా!

అతివేగంగా మారుతున్న ప్రపంచ పర్యావరణ స్థితిగతులను గమనిస్తే, ముఖ్యంగా 21వ శతాబ్దంలో గత రెండు దశాబ్దాలుగా వాతావరణ, పర్యావరణ సంబంధమైన అనేక విపరీత పరిణామాలు, ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కొన్నిసార్లు శాస్త్రజ్ఞులకు, పర్యావరణవేత్తలకు ఇవి విస్మయాన్ని కలిగిస్తూ, పర్యావరణ పరిరక్షణ రంగంలో ఇంకా లోతైన పరిశోధనలు జరగాలనే అవసరాన్ని, ప్రపంచంలోని




అన్ని దేశాలు రోజు రోజుకూ క్షీణిస్తున్న పర్యావరణ పరిరక్షణకై అనేక జాగ్రత్తలు, జీవన శైలిలో మార్పులు చేపట్టాలని సూచిస్తున్నాయి.

గత రెండు దశాబ్దాలలో పర్యావరణ అసమతుల్యతతో ప్రపంచం ఎదుర్కొన్న సమస్యలు: గత రెండు దశాబ్దాలలో ప్రపంచ పర్యావరణంలో త్వరితగతిన మార్పులు, ఎన్నడూ లేనంత భూ ఉపరితల వేడి పెరగడం, ధ్రువాలలోని మంచు నిల్వలు తగ్గిపోవడం, కర్బన ఉద్గారాల విపరీత పెరుగుదల. అయితే అనేక దేశాలు సమాంతరంగా సాంప్రదాయేతర ఇంధనాలు (రెన్యువబుల్ ఎనర్జీ సోర్సస్) వాడడం, అడవుల పెంపకం లాంటి అనుకూల చర్యలు తీసుకున్నప్పటికీ ముఖ్యంగా సముద్ర ఉపరితలం నుంచి వీచే వేడిగాలులు ఎక్కువై పోయాయి. తీవ్రమైన తుఫానులు, విపరీతమైన వర్షాలు, వరదలు జీవ వైవిధ్యంపై ప్రభావం చూపాయి. ఎన్నో పక్షి, జీవ, జంతుజాతులు అంతరించి పోతున్నాయి.

ఈ విషయంలో యునైటెడ్ నేషన్స్ ఆధ్వర్యంలో 2015లో పలుదేశాల మధ్య జరిగిన పారిస్ అగ్రిమెంట్ (ఒక ఆశాకిరణం)వివరాలు ఇలా ఉన్నాయి.

1. ఈ పారిస్ అగ్రిమెంట్ పలు భాగస్వామ్య దేశాలు తప్పకుండా పాటించవలసిన ఒక అంతర్జాతీయ ఒప్పందం.

2. దీంట్లో 195 దేశాలు 2015లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాయి.

3. ఈ అగ్రిమెంట్ ముఖ్య ఉద్దేశ్యం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న సగటు ఉష్ణోగ్రతలను పెరగనీయకుండా నిరోధించి కనీసం 2 డిగ్రీలు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవడం. అంటే ప్రపంచంలో విచ్చలవిడి పారిశ్రామీకరణ జరగక ముందు ఉన్న ఉష్ణోగ్రతల కంటే 1.5 డిగ్రీ తక్కువ స్థాయికి చేరుకోవడం.

4.ఈ లక్ష్యాలను ప్రతిదేశం తన జాతీయ స్థాయిలో తగిన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవడానికి తీవ్రమైన కృషి చేయడం.

5.పై లక్ష్యాలను సాధించడానికి చేసిన ప్రతిజ్ఞ ఎంతవరకూ నెరవేరుతోందన్నది ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి సమీక్షించుకోవడం. 5 ఏళ్లకొకసారి సభ్య దేశాలు ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను సమర్పించడం. ఈ అగ్రిమెంట్ కింద అన్ని సభ్యత్వ దేశాలు ఎటువంటి పురోగతిని సాధిస్తున్నాయన్నది దఫ దఫాలుగా సమీకృతంగా సమీక్షించడం,తద్వారా ప్రపంచం అనుకున్న దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించడంలో పురోగతిని పొందడం.

6. అభివృద్ధి చెందిన దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతికత, సహాయక నిధులిచ్చి ఆ దేశాలు పర్యావరణాన్ని అభివృద్ధి పరచడం. వాతావరణం లోచోటుచేసుకొనే ప్రతికూల మార్పులను అరికట్టడంలో సహాయపడడం.

7. పారిస్ అగ్రిమెంట్ ప్రతి సభ్యదేశానికీ వాయు ఉద్గారాలను తగ్గించడంలో తమదైన లక్ష్యాలను నిర్దేశించుకునే వెసులుబాటు కల్పించింది. దీనిద్వారా సభ్యదేశాలు తమ ప్రణాళికలను సమర్పించడం, తమ లక్ష్యాలను కనీసం 5 ఏళ్లకు ఒకసారి సవరించుకోవడం. ఈ దిశలో ప్రపంచ వ్యాప్తంగా సభ్యదేశాలలో పారదర్శకత రావడం, జవాబుదారీతనాన్ని పారిస్ అగ్రిమెంట్ నొక్కి చెబుతోంది.

'పారిస్' ఒప్పందలో భారత్ కీలకపాత్ర : భారతదేశం పారిస్ అగ్రిమెంట్‌లో సభ్యురాలు, అతి క్రియాశీలక దేశం. తదనుగుణంగా తన అనుసమర్ధన (ఇన్స్ట్రుమెంట్ ఆఫ్ రాటిఫికేషన్) ను భారతదేశం యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్‌కు అక్టోబర్ 02,2016న సమర్పించింది. ప్రపంచం లోని ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ, తదనుగుణ పరిమాణంలో కర్బన ఉద్గారాలను విడుదల చేసే దేశం గా తన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలతో పారిస్ అగ్రిమెంట్ ద్వారా నిర్దేశిం చుకున్న లక్ష్యాలను (వీటినే నేషనల్ డిటర్మినేషన్స్ అంటాము) చేరుకోవడానికి భారతదేశం చురుకుగా ముందుకు సాగుతోంది. భారతదేశం పారిస్ అగ్రిమెంట్‌కి అనుగుణంగా ఈ క్రింది కార్యక్రమాలు చేపట్టింది.

1. అగ్రిమెంట్‌పై ఏప్రిల్ 22,2016 న సంతకాలు చేసిన కొద్దికాలంలోనే తన ఆమోదాన్ని ధ్రువపరచింది.

2. దేశ స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను తన ప్రతిజ్ఞలను United Nations Framework Convension on Climate Change (UNFCCC)కి సమర్పించింది. మృత్తిక నుండి సేకరించిన ఇంధన వినియోగాన్ని, ఉద్గారాల విడుదల తగ్గించడం ఇందులోని ప్రధాన అంశాలు.

3. 2070 కల్లా దీర్ఘకాలిక ప్రణాళికగా నెట్ కారబోన్ జీరో ఎమిషన్ సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది. మన దేశం తీసుకున్న ఈ నిర్ణయాలు విజయవంతంగా అమలుచేయడంలో మనందరి పాత్ర ఎంతైనా ఉంది కదా మరి!

అధిక జనాభా కలిగి, ఆర్థిక ప్రగతిలో దూసుకు పోతున్న భారత్ పర్యావరణ పరిరక్షణకై నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చాలా కృషి చేస్తోంది. ముఖ్యంగా దేశం వ్యవసాయ ఆధారితం కాగా, ఇంకా 60% వరకు ప్రజలు గ్రామాలలోనే ఉంటున్నారు. వీరి జీవనసరళి మారాలంటే వీళ్ల ఆర్థికంగా ఎదగాలి. అందుకు పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలు అధికంగా స్థాపించాల్సి వస్తోంది. దీన్నే సోషియో ఎకనామిక్ ప్రెషర్ అంటాము. అధిక పరిశ్రమలవల్ల కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉంది. పరిశ్రమలకు, వాణిజ్య కార్యకలాపాలకు పెట్రోల్, డీజిల్, బొగ్గు ఆధారిత విద్యుత్తు ఎక్కువ అవసరమవుతాయి. వీటివల్ల కాలుష్యం పెరిగే అవకాశముంది, కాబట్టి ఆర్థిక ప్రగతితో పాటు పర్యావరణ సమతుల్యత సాధించడం భారత్‌కు పెను సవాలుగా మారిందనుకోవచ్చు. ఈ ప్రయత్నంలో భాగంగా అటు పరిశ్రమ నిర్వాహకులు, వాణిజ్య సంస్థలు, ఇటు ప్రజలు మరింత బాధ్యతతో వ్యవహరించి ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తే భారత్ అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకోగలదు. అలాగే గ్రామాల్లో, పట్టణాల్లో శుభ్రత ఇంకా పెరగాలి. దీనికి ప్రభుత్వాలు నిర్బంధ స్వచ్ఛ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి. ప్రజలందరూ ఏకతాటిగా దీనికి సహకరించాలి. భారత్ పర్యావరణ పరిరక్షణలో అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే ముఖ్యంగా మూడు దిశలలో విపరీతమైన కృషి చేయాలి. అవి:. 1. ఇంధన పొదుపు, ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకం 2. చెత్త తగ్గింపు 3. అన్ని కార్యకలాపాలలో చట్టాలలో నిర్దేశించిన పరిమితులకు లోబడి కాలుష్య నియంత్రణ పాటించాలి. ఈ 'వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే-2026 (జూన్ 5) సందర్భంగా ప్రజలందరూ ఈ విషయాలను పూర్తిగా అర్థం చేసుకుని ప్రభుత్వంతో సహకరించి, కాలుష్యాన్ని నియంత్రించి ఈ ప్రపంచంలో కాలుష్యం తగ్గించడానికి తమ వంతు కృషి చేస్తారని ఆశిద్దాం. ★

**పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం నమోదు చేసిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సువేందు అధికారి నాయకత్వంలో మే 9వ తేదీన కొలువు దీరడం తెలిసిందే. బెంగాల్‌కు ఇది చారిత్రాత్మక ఉదయం 'సోనార్ బంగ్లా' యుగానికి శ్రీకారం చుట్టినట్లు సువేందు అధికారి ప్రకటించారు. "స్వాతంత్ర్యం తర్వాత ఆ రాష్ట్రంలో బీజేపీ తొలి ప్రభుత్వం ఏర్పాటు ద్వారా మన స్థాపకుల కలలను సాకారం చేస్తున్నాం. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగిన దుర్వినియోగ పాలనకు ముగింపు పలుకుతున్నాం. ఇక నుంచి అభివృద్ధి, శాంతి, సుసంపన్నత లక్ష్యంగా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పనిచేస్తుంది. 'సోనార్ బంగ్లా' యుగానికి అధికారిక ఆరంభం" అని ప్రకటించారు సువేందు.**

దేశ ప్రజల దృష్టి పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వంపై ఉంది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని ఓడించి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సువేందు అధికారి, ఇక ఏమాత్రం జాప్యం లేకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోపే తొలి మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

నూతన ప్రభుత్వం సుపరిపాలన, భద్రతను అందిస్తుందని సీఎం సువేందు అధికారి హామీ ఇచ్చారు. తమ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం దేశంలోని ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు అనుసరిస్తున్న అభివృద్ధి మార్గంలోనే ముందుకు సాగుతుందని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శాలకు, 'ప్రజల కోసం– ప్రజల ద్వారా–ప్రజలచేత' అనే సూత్రానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని వివరించారు. సుదీర్ఘ కాలం తర్వాత రాష్ట్రంలో భయం, హింసకు తావులేని, నిష్పాక్షిక ఎన్నికలు జరిగాయని, ఈ ప్రక్రియలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రివర్గం కృతజ్ఞతలు తెలిపిందని పేర్కొన్నారు.

## సరిహద్దులో కంచె నిర్మాణం

బాంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయడానికి, కంచె నిర్మాణానికి అవసరమైన భూములను 45 రోజుల్లోగా సరిహద్దు భద్రతా దళానికి (బీఎస్‌ఎఫ్) బదిలీ చేయాలన్నది కొత్త ప్రభుత్వ నిర్ణయాల్లో ముఖ్యమైనది. ప్రాథమికంగా 27 కి.మీ. మేర సరిహద్దు ప్రాంతానికి సంబంధించిన భూమిని అందజేశారు. సరిహద్దు భద్రతను మెరుగుపరిచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం కేవలం ప్రారంభం మాత్రమేనని, అవసరమైతే అక్కడ మరింత భూమిని కేటాయిస్తామని చెప్పారు. అంతర్జాతీయ సరిహద్దులో ఇంకా చాలా భాగం కంచె లేకుండానే ఉంది. బెంగాల్, బాంగ్లాదేశ్ మధ్య మొత్తం 2,200 కి.మీ సరిహద్దు ఉంది. ఇప్పటికే సుమారు 1600 కి.మీ మేర కంచె నిర్మించగా, దాదాపు 600 కి.మీ మేర సరిహద్దు ఎలాంటి కంచె లేదు. మమతా బెనర్జీ ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు విధానాలతో సరిహద్దు మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించలేదని విమర్శించారు సువేందు. పైగా పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను వ్యతిరేకించారన్నారు.

చొరబాటుదారులను నేరుగా బీఎస్‌ఎఫ్‌కు అప్పగించే విషయమై గతేడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక లేఖ పంపింది. అయితే ఆనాటి సర్కార్ ఈ కీలకమైన నిబంధనను అమలు చేయడంలో విఫలమైంది. ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు విధానాల కారణంగా భూమి ఇవ్వలేదు. అంతేకాదు గత కొన్ని సంవత్సరాలుగా సరిహద్దు ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసులు, బీఎస్‌ఎఫ్ దళాలకు, పాలనా యంత్రాంగం మధ్య సమన్వయ సమావేశాలు జరగలేదు. ఇకపై ఇలాంటి సమావేశాలు క్రమం తప్పకుండా జరుగుతాయని సువేందు అధికారి స్పష్టం చేశారు.

## సీఏఏ అమలు

బెంగాల్‌లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలు చేస్తామని ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. 'అక్రమ వలసదారులపై మరింత కఠిన విధానాన్ని అనుసరిస్తాం. సీఏఏ పరిధిలోకి రాని వారిని చొరబాటుదారులుగా పరిగణిస్తాం. రాష్ట్ర పోలీసులు వారిని అరెస్టు చేసి బీఎస్‌ఎఫ్‌కు అప్పగిస్తారు. తరువాత దేశం నుంచి బహిష్కరిస్తాం" అని తేల్చి చెప్పారు. పౌరసత్వ చట్టంలోని నిబంధనలను ప్రస్తావిస్తూ, 'సీఏఏ పరిధిలోకి వచ్చే ఏడు సామాజిక వర్గాలకు చెందినవారు, నిర్ణీత గడువు తేదీకి ముందు (2024 డిసెంబర్ 31 లోపు) భారత్‌లోకి ప్రవేశించినవారికి మాత్రం మినహాయింపు ఉంటుంది. వారిని పోలీసులు అదుపులోకి తీసుకోలేరు. పౌరసత్వ సవరణ చట్టం పరిధిలోకి రాని వారిని దేశ బహిష్కరణ చేస్తాం. ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు బీఎస్‌ఎఫ్ అధికారులు, బాంగ్లాదేశ్ సరిహద్దు భద్రత సంస్థతో సమన్వయం చేసుకుంటారు. ఈ చట్టం వెంటనే అమలులోకి




# 'సోనార్ బంగ్

వస్తుంది" అని సీఎం వివరించారు.

రాష్ట్రంలో అక్రమంగా నివాసం ఉంటున్న బాంగ్లాదేశీయులను న్యాయస్థానాల ముందు హాజరు పరచకుండా, నేరుగా బీఎస్‌ఎఫ్‌కు అప్పగించాలని పోలీసులకు, రైల్వే రక్షక దళం అధికారులకు సీఎం సువేందు అధికారి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సీఏఏ పరిధిలోకి రాని బాంగ్లాదేశ్ చొరబాటుదారుడినీ ఇకపై కోర్టులకు తరలించవద్దని, వారికి సరైన ఆహారం, సంరక్షణ కల్పించిన తర్వాత నేరుగా బీఎస్‌ఎఫ్ సరిహద్దు అవుట్‌పోస్టుకు అప్పగించాలని పేర్కొన్నారు.

గత 15 ఏళ్లలో తృణమూల్ కాంగ్రెస్ గూండాల చేతిలో హత్యకు గురైన 321 మంది బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బాధిత కుటుంబాలు కోరుకుంటే ప్రభుత్వం విచారణ ప్రారంభిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

కాగా, గతంలో ఎన్నికల సందర్భంగా నమోదైన

**చొరబాటుదారులను నేరుగా బీఎస్‌ఎఫ్‌కు అప్పగించే విషయమై గతేడాది కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఒక లేఖ పంపింది. అయితే ఆనాటి సర్కార్ ఈ కీలకమైన నిబంధనను అమలు చేయడంలో విఫలమైంది. ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు విధానాల కారణంగా భూమి ఇవ్వలేదు. అంతేకాదు గత కొన్ని సంవత్సరాలుగా సరిహద్దు ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసులు, బీఎస్‌ఎఫ్ దళాలకు, పాలనా యంత్రాంగం మధ్య సమన్వయ సమా వేశాలు జరగలేదు.**



కేసులను తిరిగి తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2021 అసెంబ్లీ, 2023 పంచాయతీ ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఈ కేసులను అప్పటి మమత ప్రభుత్వం మూసివేసింది. సంబంధిత కేసులను తిరిగి తెరవాలని సీనియర్ పోలీసు అధికారులను ముఖ్యమంత్రి సువేందు ఆదేశించారు. డీఐజీ, అదనపు డైరెక్టర్ జనరల్స్, జోనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్స్, రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తదితరులతో సహా సీనియర్ పోలీసు అధికారుల మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.




## ...్లా'కు శ్రీకారం

రాష్ట్రంలో మతహింసను ప్రేరేపించే వారిపై బెయిల్‌కు అవకాశం లేని నేరాల కింద కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. పోలీసులు నిర్భయంగా పని చేయాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. నేరచరితులకు భద్రత ఉపసంహరణమరో కీలక పరిణామం. ఇందులో భాగంగా మమత మేనల్లుడు, టీఎంసీ కీలక నాయకుడు అభిషేక్ బెనర్జీకి ఉన్న భారీ భద్రతను అధికారిక హోదా, ముప్పు అంచనా ఆధారంగా సమీక్షించనున్నారు.

**నాడు రక్షకులే భక్షకులు**

ఆర్జీకర్ హత్యాచార ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో, దర్యాప్తు చేయడంలో తీవ్రమైన పరిపాలన లోపాలు, నిర్లక్ష్యం, బాధితురాలి కుటుంబానికి లంచాలు ఇవ్వజూపిన ఆరోపణలపై ఐపీఎస్ అధికారులు ముగ్గురిని (వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీ, అభిషేక్ గుప్తాపై) ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆగస్టు 9, 2024 రాత్రి ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి నాటి మమతా బెనర్జీ ప్రభుత్వం, సాక్ష్యాధారాలను ధ్వంసం చేసిందని, ప్రధాన నిందితులను రక్షించడానికి ప్రయత్నించిందని ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తులో లోపాలు ఉన్నాయని హైకోర్టు కూడా తప్పు పట్టింది. వాస్తవాలను వెలికితీయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. తాజా ఎన్నికల్లో ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి తల్లి రత్నా దేవనాథ్‌ను బీజేపీ పానీహట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించారు.

**పశువుల అక్రమ రవాణాపై ఉక్కుపాదం**

పశువుల అక్రమ రవాణా అరికట్టడానికి బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బాంగ్లాదేశ్‌లో గొడ్డు మాంసానికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో బెంగాల్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి దొంగిలించిన పశువులను సరిహద్దు దాటించి అమ్ముకునే ముఠాలు చాలా ఉన్నాయి. ఈ అక్రమ రవాణా స్మగ్లింగ్, సిండికేట్ నెట్‌వర్క్‌లను పూర్తిగా అంతం చేస్తామని సువేందు ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దులోని దినాజ్‌పూర్, మాల్దా, ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాల జిల్లాల్లో అక్రమ పశువుల మార్కెట్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. చట్టబద్ధమైన, లైసెన్స్ పొందిన పశువుల మార్కెట్లు మాత్రమే పనిచేయాలి.

**మతపర వేతనాలు రద్దు**

రాష్ట్రంలో మతపరమైన ప్రోత్సాహకాలను నిలిపివేస్తూ మరో సంచలన ప్రకటన చేశారు సువేందు అధికారి. ఇకపై ఇమామ్‌లు, ముయజ్జిన్‌లు, ఆలయ పూజారులకు ఇచ్చే నెలవారీ గౌరవ వేతనం నిలిపివేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. మమతా బెనర్జీ ప్రభుత్వ కాలంలో నిధుల పంపిణీలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయడానికి రిటైర్డ్ జస్టిస్ బిశ్వజిత్ దాస్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేశారు. రహదారులపై నమాజును నిషేధించింది. మతపరమైన ప్రదేశాలలో లౌడ్ స్పీకర్ల వాడకంపై కూడా ఆంక్షలు విధించింది. లౌడ్ స్పీకర్ల శబ్దం ఆయా ప్రార్థనా మందిరాల ప్రాంగణాన్ని దాటి బయటకు రాకూడదని ఆదేశించింది.

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం జరిగే అసెంబ్లీ ప్రార్థనల్లో 'వందేమాతరం' ఆలపించడాన్ని తప్పనిసరి చేశారు. ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందుతున్న (ఎయిడెడ్), గుర్తింపు పొందిన మదర్సాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ గీతం ఆలపించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం




పెంచింది. గత ప్రభుత్వం చేసిన జాప్యం కారణం, నోటిఫికేషన్లు రావడం ఆలస్యం కావడం, పరీక్షలు వాయిదా పడటం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు పరీక్ష రాయకుండానే వయోపరిమితి దాటిపోయారు. ఈ వయోపరిమితి పెంపు మే 11 నుంచి అమల్లోకి వచ్చాయి.

**బిస్వా బంగ్లా తొలగింపు**

జాతీయ చిహ్నం స్థానంలో మమతా బెనర్జీ ప్రవేశపెట్టిన 'బిస్వా బంగ్లా' లోగోను తొలగిస్తూ సువేందు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి బదులుగా దేశ జాతీయ చిహ్నమైన అశోక స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నారు. బెంగాలీ అక్షరం 'బ' చుట్టూ రూపొందించిన ఈ లోగోను తృణమూల్ కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ వెబ్‌సైట్‌లు,మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఉపయోగించారు. దీనికి బదులుగా భారతదేశ జాతీయ చిహ్నమైన అశోక స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పలు ప్రభుత్వ విభాగాలు, సేవలకు లింక్‌లను అందించే 'ఎగియే బంగ్లా' పోర్టల్‌లో ఇప్పుడు బిస్వా బంగ్లా లోగో స్థానంలో అశోక స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

**అక్రమ కట్టడాలపై బుల్‌డోజర్**

ప్రభుత్వం స్థలాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న అక్రమ కట్టడాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ముఖ్యంగా కోల్‌కతా, దాని పరిసర మెట్రోపాలిటన్ ప్రాంతాల్లోని అక్రమ కట్టడాల కూల్చివేతలు ప్రారంభించింది. హౌరా, సీల్దా రైల్వేస్టేషన్ల దగ్గర బుల్డోజర్లతో వందల దుకాణాలను తొలగించారు.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

# బంగారంతో సాటి




**క్రీ॥పూ॥ 2,3 శతాబ్దంలో శాతావాహనుల కాలం ప్రారంభమైన తరువాత తెలుగుభాషకు శ్రీకారం చుట్టినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి గౌతమి మహ విద్వాంసురాలు, చక్కటి రాజనీతిజ్ఞురాలు. ఆమే తెలుగు భాషకు శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తున్నది. ఆమె ప్రతిభా పాటవాలకు ముగ్ధుడైన శాతకర్ణి, తన పేరును గౌతమీపుత్ర శాతకర్ణి అని గర్వంగా ప్రకటించుకొన్నాడు. ఈ రాజవంశంలోని 17వ రాజు హాలుడు చక్రవర్తే కాకుండా స్వయంగా కవి. అంతకు మంచి కవిపోషకుడు. ఆయన 'గాథా సప్తశతి' సాహిత్యాన్ని విలువలతో తూకం వేసే ప్రమాణ గ్రంథంగా నిలుస్తుంది. ఇది ఒక కాలానికి చెందినది కాదు. త్రాసులో ఒక తక్కెడలో బంగారాన్ని, మరో తక్కెడలో అక్షరాలను ఉంచితే – రెండూ సమానంగా తూగుతాయన్నదే వీరి భావన.**

**'వర్ణా వళీమస్య జానంతో లోకాలోక్కెర్గౌర వాభ్యధికాః /సువర్ణకార తులా ఇవ నిరక్షరాలిపి స్కంధై రుద్యంతే॥**

ఈ శ్లోకం గాథాసప్తశతిలోని అక్షరాల విలువను తూకం వేస్తుంది. ఈ గ్రంథం ప్రధానంగా పల్లెటూరి ప్రేమ, శృంగారం, విరహం, ప్రకృతి వర్ణనలతో కూడిన చిన్న చిన్న కవితల (గాథల) సంకలనం. దీనిని ప్రాచీన రోమన్ కవి "ఓవిడ్" రాసిన "ఆర్స్ అమటోరియా"తో పోల్చవచ్చును. లేదా క్రీ॥పూ॥ 7వ శతాబ్దం నుండి కీ॥శ॥ 10వ శతాబ్దం వరకూ వివిధ గ్రీకు కవులు రాసిన "పాలటైన్ అంథాలజీ" (చిన్న కవితల)తో పోల్చవచ్చును. అయితే హాలుడు బృహత్ కథను సంకలనం చేయడం వెనుక ఓ పెద్ద విషయమే ఉంది.

గుణాఢ్యుడు పైశాచిక భాషలో బృహత్కథ రాశాడు (అది ఇప్పుడు అలభ్యం). దానిని ఆధారంగా చేసుకొని సోమదేవుడు 11వ శతాబ్దంలో సంస్కృతంలో కథా సరిత్సాగరం రాశాడు. కాశ్మీర్ రాజు అనంతదేవుని పట్టమహిషి సూర్యమతీదేవి వినోదం కోసం ఈ కథలు రాసినట్లు తెలుస్తుంది. ఈ కథల్ని 18 పుస్తకాలుగా, 124 అధ్యాయాలుగా 21000 శ్లోకాలతో రాశారు. దీనిని వేదం వేంకటరాయశాస్త్రి గారు ఆంధ్రీకరించారు.

గాథా సప్తశతిని సంకలన కర్త హాలునికి అస్సలు సంస్కృతం రాదు. ఆ భాషలో పాండిత్యం గల సింహళ దేశపు రాకుమార్తె 'మలయవతి'ని వివాహం చేసుకున్నాడు. ఒకనాడు ఆమె కొలనులో స్నానం చేస్తూ ఉండగా హాలుడు ఆమెపై నీళ్లు చల్లాడు. ఆమె సంస్కృతంలో "మోదకై స్తాడయా" (మా ఉదకైః తాడయా) నీళ్లతో నన్ను కొట్టవద్దు అంది. పదాలకు అనేక అర్థాలు ఉంటాయి. మోదకములు అంటే లడ్లు (తినుబండారములు) అనే అర్థం కూడా ఉంది. హాలునికి రెండవ అర్థం స్ఫురించి సేవకులను పిలిచి లడ్లు తెప్పించాడు. దానికి మలయవతితో పాటు చుట్టూ ఉన్న పరిచారికలు నవ్వారు. రాజు తలదించు కున్నాడు. అక్కడి సందర్భం నీళ్లు చల్లుతుంటే వద్దు అంది. ఉదాహరణకి "దయ చేయండి" అనే పదాన్ని రావడానికి, వెళ్లడానికీ వాడతారు. అయితే అక్కడ గల సందర్భాన్నిబట్టి దాని అర్థం ఉంటుంది.

ఈ అనుభవంతో, తనకు సంస్కృత భాషలో పాండిత్యం సంపాదించాలని ఉందని, అందుకు మార్గమేమిటని ఆస్థాన పండితులు గుణాఢ్య, శర్వవర్మలను సంప్రదించగా, ఆరు సంవత్సరాలలో సంస్కృతం నేర్పగలనన్నాడు శర్వవర్మ 'రాజుకు నీవు ఆ గడువులో సంస్కృతం నేర్పగలిగితే నేను సంస్కృత ప్రాకృత భాషలను వదలి, అడవుల్లో జీవిస్తూ పైశాచిక భాషలో గ్రంథ రాస్తాను' అన్నాడు గుణాఢ్యుడు. ఈ పందెంలో శర్వవర్మ గెలిచాడు. గుణాఢ్యుడు అడవులకు పోయి ఏడేళ్లు ఏడు ఆశ్వాసాల గ్రంథం 'బృహత్ కథ' రాసి హాలుని వద్దకు పంపగా ఆయన ఆ గ్రంథాన్ని స్వీకరించలేదు. దానితో కోపించిన గుణాఢ్యుడు గ్రంథంలో ఆరు ఆశ్వాసాలను అగ్నికి ఆహుతి చేయగా ఏడవ దానిని మాత్రం హాలుడు రక్షించగలిగాడు. అందులోని కొన్ని కథలు ఉపకథలు కలిసి నేడు బృహత్కథగా ప్రసిద్ధమైంది.

రెండు వేల సంవత్సరాల నాటి ఈ కథలు అరేబియన్ నైట్స్, పంచతంత్రం, హితోపదేశం, బేతాళ, పంచవింశతి కథలుగా రూపాంతరం చెందాయి, అయితే బృహత్కథ కర్త గుణాఢ్యుడు తెలుగువాడు కావటం విశేషం. హైదరాబాద్ దగ్గరలోని కొండాపూర్ ఆయన పుట్టిన ఊరని ప్రజల నమ్మకం.

వేదభాష ప్రజా వ్యవహారాల నుంచి దూరమై సంస్కృత మేధావులకు పరిమితం కావటంతో బౌద్ధ ద్యమాల కాలంలో ప్రాకృత, పాళీ రూపాలకు వ్యాప్తి పెరిగింది. మహారాష్ట్ర, శౌరసేన, మగధి, పైశాచి లాంటి ప్రాకృత భేదాలు ఏర్పడ్డాయి. అందుకే హాలుడు సేకరించిన కథలు మహారాష్ట్ర ప్రాకృతంలో ఉ న్నాయి. తెలుగు నేలకు సంబంధించినంత వరకు తొలినాళ్లలో పాళీ, ప్రాకృతాలు రాజాదరణ పొంది సాహిత్య భాషలుగా వికసించాయి. సంస్కృతానిది ద్వితీయ స్థానంకాగా, ఆంధ్రభాష మూడవ స్థానంలో కొనసాగింది. 'లలితమైన మధురాక్షరాలతో నిండిన ప్రాకృతం ఉండగా, సంస్కృత కావ్యాలను ఎవరు చదువుతారు?' అని ఒక గాథ ప్రశ్నిస్తుంది, గాథా సప్తశతి ఇతర ప్రాకృత కావ్యాలు ఉత్తరాది రాష్ట్రాలలో సజీవంగా ఉన్నాయి. తెలుగు నేలపై "శ్రీ ఉత్పత్తి పిడుగు" అనే ఒక శైవసంస్థ గదను లోగోగా ధరించి శూన్యవాదం ప్రబోధించే వారి పాలిట (బౌద్ధుల) పిడుగులా పనిచేసింది తద్వారా ప్రాకృతం కనుమరుగైంది.

హాలుడు తన కాలంలో జానపదుల నోటిని వెలువడిన వేలాది గాథల నుంచి ఉత్తమమైన 700 గాథలను సేకరించి, సంకలనం చేశాడు. 8వ శతాబ్దానికి చెందిన పాకృత కవి 'ఉద్యోతన సూరి' కువలయమాల కావ్యం రాశాడు. 'ఆంధ్రులు సుందరంగా ఉంటారని. సౌందర్య పిపాస ఎక్కువ. వాళ్లకి అందగత్తెలంటే మహా మోజు. యుద్ధ జీవులు. కదన రంగాన ముందుంటారు. సహజంగా భోజన ప్రియులు. కమ్మని రుచులు, కొత్త రుచులను ఆస్వాదించే తత్వం ఉన్నవాళ్లు' అని దానిలో ఆంధ్రులను గురించి రాశాడు.

గాథా సప్తశతి ధ్వని శాస్త్రానికి మచ్చుతునక. కావ్య సౌందర్యానికి ప్రతీక. ఆనందవర్ధనుడు సాహిత్య శాస్త్రంలో ధ్వని లక్షణాలకు గాథాసప్తశతిలోని వాటిని ఉదాహరణలుగా ఉపయోగించాడు.

హర్షవర్ధనుడి ఆస్థాన కవి బాణుడు తన 'హర్షచరిత్ర' ఉపోద్ఘాతంలో ఒక శాతవాహన రాజు ఉత్తమ కావ్యకోశాన్ని (యాంథాలజీని) రూపొందించి నట్లు పేర్కొన్నాడు. "గాథా సప్తశతి కావ్య

# ‘గాథా సప్తశతి’




సౌందర్యంతో కూడిన, అక్షయమైన రత్నాలను సమకూర్చిన కోశం” అనటం చాలా విలువైన ప్రశంస.

ప్రాకృతం అంటే ప్రకృతి. అంటే మూలభాష సంస్కృతం అంటే సస్కరించబడినది అని ఒక వాదన ఉంది. సంస్కృతంలో “ధర్మ” అనే కంటే పాకృతంలో “దమ్మ” అనటం తేలిక. అయినా గాథా సప్తశతి మహారాష్ట్ర పాకృతం తొలినాటి రచన. శాతావాహనుల తరువాత ఐదారు శతాబ్దాల కాలం ఈ ప్రాకృత భాష పరిణామక్రమం కొనసాగింది. అందువలన శాస్త్రరీత్యా మహారాష్ట్ర ప్రాకృత లక్షణాలు పూర్తిగా అందులో ఉండకపోవచ్చు కూడా! కులబాలదేవుడు, గంగాధర భట్టు, వీరణారాయణుడు, సర్వజ్ఞ చక్రవర్తి, పెదకోమటి వేమారెడ్డి, ఇలా చాలామంది కవులు సంస్కృత వాఖ్యానాలు రాశారు.

“బరువులెత్తే కార్మికుడి లాగా మేఘుడు వాన పగ్గాలు వేసి భూమిని పైకి లాగుతూ ఊపిరి బిగబట్టి బిగ్గరగా మూలిగినట్టు ఉరుములు మోగుతున్నాయి” అంటుంది ఓ గాథ. ఇలాంటి ఊహాలు జనకవులకు వచ్చినట్లు రాజకవులకు రావంటారు ఆచార్య తిరుమల రామచంద్ర. నాగలి దున్నేటప్పుడు ఎద్దుల కన్నులలో కనిపించే శ్రమ మనసును కదిలిస్తుంది. ఇందులో జీవకారుణ్యం జాలువారుతోంది. ఇది పశు పోషణ. పశువులను కన్న బిడ్డల్లా చూసుకోవాలి, ఎద్దులు యాంత్రిక సాధనాలు కావు.. జీవన సహచరాలు. శాతవాహన సమాజంలో వ్యవసాయం ఒక సజీవ సంబంధాల వ్యవస్థ.

గాథాసప్తశతి సామాజిక, సాంస్కృతిక జీవితానికి ప్రతిబింబం. గ్రామీణ జీవనం, రైతుల శ్రమ, రుతుచక్రం, పంటలు, పండుగలు, స్త్రీ పురుషుల మధ్య సున్నితభావాలు, ప్రేమలు, విరహాలు, కుటుంబ సంబంధాలను సహజ సౌందర్యంతో చిత్రించింది.

కుటుంబ వ్యవస్థలో వృత్తి విభజన కనిపిస్తుంది. ఈ గాథలలో గ్రామీణ–పట్టణ జీవన వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. నాగరికులు ధనార్జన, వాణిజ్య ఆలోచనలతో జీవిస్తే గ్రామీణులు, జీవనానుభూతులతో జీవిస్తున్నారని గ్రామీణులు సంగీతం, నృత్యం, కోడిపందాలు, పొట్టేళ్ల పందాలు, ఎద్దుల పందాలు వంటి ఎన్నో పోటీలు నిర్వహించి నట్లు ఈ గాథల ద్వారా తెలుస్తున్నది.

పులింద అనే ఆటవిక జాతి స్త్రీ... తన భర్త పరాయి స్త్రీతో సరస సల్లాపాలు చేయడంపై ఈర్ష్య పడడాన్ని ఒక గాథలో వర్ణితమైనది. కులాంతర వివాహాలు ముమ్మరంగా జరిగేవని తెలుస్తున్నది.

భర్త పొలంలో కష్టపడుతుంటే, ఇంటి పని భారంతో భార్య అలసిపోతుంది. ఉత్పాదకతలో స్త్రీ పురుషుల సమభాగస్వామ్యం కన్పిస్తుంది. రైతు మాత్రమే కాదు, రైతు కుటుంబమే ఉత్పత్తి సాధనం. ఇది ఆధునిక ఆర్థిక సిద్ధాంతాలకు ముందే ఉన్న గ్రామీణ వాస్తవం.

సంస్కృతంలోగానీ, ప్రాకృతంలోగానీ, దేశ భాషలలోగానీ, గాథా సప్తశతితో సరితూగ గల కవితా సంపుటి మరొకటి లేదనేది సాహిత్య లోకంలో ప్రసిద్ధమే, అత్యధిక సామాజిక జీవనం. దీనిలో ప్రతి బింబించడమే దీనికి మూలకారణం.

శాతవాహనుల కాలంలో రోమ్, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్యం జోరుగా సాగేది. వ్యాపారులను శ్రేష్ఠులు లేక శెట్టిలు అనేవారు. గ్రామాల్లోని రైతులకన్నా భిన్నంగా ఉండేవారు. విలాసవంతమైన గృహాలు. విశాలమైన గదులు కలిగి ఉండేవారు. సన్నని పట్టువస్త్రాలు, విదేశీ దుస్తులు, రత్నఖచిత ఆభరణాలు ధరించేవారు. నాడు బట్టను కత్తిరించడం, కుట్టడం భారతీయ సాంప్రదాయం కాదు. కాబట్టి ‘కొలతలు సరిగ్గా ఉండి, వెడల్పూ, పొడవు బాగుండి ఉతికితే రంగు వెలిసి పోకుండా, కట్టుకుంటే సుఖంగా ఉండే బట్టను ఇవ్వు’ అని బట్టల కొట్టాయన్ని ఓ నాయక అడిగిన గాథ ఉంది. చెప్పులు కుట్టువారున్నారు కానీ, బట్టలు కుట్టే (దర్జీలు ) వారు లేరు. ఒకదాన్ని పంచెగానూ, రెండవదాన్ని నడుముకు కట్టుకొనేవారు.

దూర ప్రాంతాలకూ, విదేశాలకూ వ్యాపార నిమిత్తం వెళ్లేటప్పుడు గుంపులు గుంపులుగా ప్రయాణించేవారు. దారిలో ఊళ్ల వద్ద పెద్ద మర్రి చెట్టు చూసుకుని సరుకుదించి వ్యాపారం చేసేవారు. అందుకే వారికి ‘బనియా’అని పేరు వచ్చింది. అలాంటి ఉత్తరాది వ్యాపారులకు బనియాలు అని పేరు వారికి ఆశ్రయం ఇచ్చేది కాబట్టి వటవృక్షాన్ని “బనియన్ ట్రీ” అన్నారు. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు, ముత్యాలు, రత్నాలు ఆ రోజుల్లో ముఖ్య వ్యాపార వస్తువులు. వ్యాపారులు నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలకు వెళ్లి ముడిసరుకు, ముఖ్యంగా ప్రత్తి, ధాన్యం పంటపండే కాలంలో సేకరించేవారు. రైతుకు ముందుగాపెట్టుబడి పెట్టి ఆకట్టుకొనేవారు. గ్రామీణ యువతులు పట్టణం నుండి వచ్చిన శెట్టీల వేషధారణను, వారి వింత ప్రవర్తనను ఆశ్చర్యంగా చూసేవారని హాలుడు రాశాడు. వ్యాపారవేత్తలు సామాజిక సేవలో ఎక్కువగా పాల్గొనేవారు, ధర్మకార్యాలు, ఆలయనిర్మాణం, సత్రాల నిర్వహణ, కరవుకాలంలో ప్రజలను ఆదుకోవడం చేసేవారు. వాణిజ్య సంఘాలను శ్రేణి అనేవారు, వీరే రాజుల వద్ద ప్రతినిధులుగా ఉండేవారు, నాడు ప్రధాన రేవు పట్టణాలు భరుకచ్ఛం, ప్రతిష్ఠానపురం, ఘంటశాల బాగా ప్రసిద్ధి పొందాయని హాలుడు వివరించాడు

పాళీ, ప్రాకృతాలలో తెలుగుపదాలు అనేకం చేరాయి. తెలుగు ‘నాగలి’ (రుగ్వేదంలో లాంగల) పాళీ భాషలో ‘నాంగల’గా చేరింది. ప్రాకృతము, పాళీ, సంస్కృతం భాషలు ముప్పిరి గొనటం వలన క్రీస్తు పూర్వం., శకం వరకూ తెలుగు సాహిత్య భాషగా ఎదగలేదు. అంతవరకు తెలుగువాడుక భాషగానే ఉంది. గాథా సప్తశతిలోని గాథల రచయితలు తెలుగు, కన్నడ, మరాఠీ వారై ఉండాలి అని అభిప్రాయ పడుతున్నారు భాషావేత్తలు.

**మూలం:**

1. గుణాఢ్యుడి బృహత్ కథ పై శారదా ప్రసాద్.
2. సంచిక (తెలుగు సాహిత్య వేదిక) హాల శాతవాహనుని గాధాసప్తశతి పై డా॥.జి.వి. పూర్ణచందు.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

సనాతన ధర్మానికి నిలయమైన భారతదేశంలో హిందూ దేవాలయాలు, కట్టడాలు మావే అని కోర్టులలో వాదించుకోవాల్సి రావడం దురదృష్టకరం. మధ్యప్రదేశ్ ధార్ పట్టణంలోని భోజ్‌శాలలో లభ్యమైన శాసనంలో ప్రాకృత భాషలో 'కోదండకావ్య', 'ఖడ్గశత' అనే రెండు పద్యాలు ఉన్నాయి. ఒక పద్యం ధనుస్సుకు, మరొకటి ఖడ్గానికి చెందినది. ఇది బహుశా రాముడు లేదా అర్జునుడికి చెందిన ధనుస్సుగా చరిత్రకారులు భావిస్తున్నారు. ఇవి 'ఓం నమః శివాయ' ప్రార్థనతో ప్రారంభం అయ్యాయి. ఇంత స్పష్టంగా సనాతన ధర్మానికి చెందిన రుజువులున్నా..'అది మసీదు కాదు...హిందూ దేవాలయం' అని న్యాయస్థానాల మెట్టు ఎక్కాల్సి రావడం మన దౌర్భాగ్యం.

మొఘల్‌లు, బ్రిటిస్ సామ్రాజ్యవాదులు హిందువులపై చేసిన దౌర్జన్యాలు, దాడులు దేశానికి, సనాతన ధర్మానికి మచ్చగా మిగిలిపోయాయి. వాటిలో మధ్యప్రదేశ్ ధార్ పట్టణంలోని భోజ్‌శాల కూడా ఒకటి. భోజరాజు కాలంలో సరస్వతీ దేవీ ఆలయం, సంస్కృత విద్యాపీఠంగా వెలుగువెలిగిన భోజ్‌శాలను కమాల్ మౌలా మసీదుగా మార్చి దీన్ని వివాదాస్పద కట్టడం చేశారు. అయితే న్యాయస్థానాల్లో సుదీర్ఘ పోరాటంతో ఈ కట్టడం హిందువులకు చెందినదే అని ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వడం హిందువులకు గొప్ప విజయం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి చాలా కాలమైనా దుష్టశక్తుల ఆనవాళ్లు ప్రజల మనస్సులో మచ్చగా మిలిగిపోయాయి. ఆలస్యమైనా దేశప్రజల చిరకాల వాంఛ అయిన అయోధ్యలో భవ్యమైన రామాలయం నిర్మించుకున్నాం. ఇప్పుడు అదే తరహాలో మధ్యప్రదేశ్‌లో భోజ్‌శాల కట్టుకొనే అవకాశం రావడం చారిత్రాత్మకమైన విజయం.

భోజ్‌శాల ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించి న్యాయపరమైన పరిణామాలు, పురావస్తు సర్వేలు, చారిత్రక ఆధారాలపై దీర్ఘకాలంగా సాగుతున్న వాదోపవాదాలు దీన్ని ఒక ప్రాంతీయ అంశంగా కాకుండా, భారతీయ సంస్కృతి, చరిత్ర, ఆధ్యాత్మిక వారసత్వం అంశాలుగా నిలిచింది. సనాతన ధర్మం అనుసరించే వారి దృష్టిలో భోజ్‌శాల ఒక సాధారణ కట్టడం కాదు. అది విద్యాదేవి సరస్వతికి అంకితమైన ఒక మహత్తర విద్యాపీఠం. భారతీయ జ్ఞాన సంప్రదాయానికి ప్రతీక. విదేశీ దండయాత్రల వల్ల అసలు రూపాన్ని కోల్పోయిన చారిత్రాత్మకమైన ఆలయం.

భోజ్‌శాల 11వ శతాబ్దానికి చెందినదిగా అనేక చారిత్రక వర్గాలు పేర్కొంటున్నాయి. పరమార వంశానికి చెందిన మహారాజా భోజుడు ధార్ ప్రాంతాన్ని విద్యా, సాహిత్య, సంస్కృత అధ్యయనాలకు కేంద్రంగా తీర్చిదిద్దినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన పాలనలో ఆ పట్టణాన్ని 'విద్యాకాశీ'గా అభివర్ణించే వారని చరిత్ర పేర్కొంటుంది. ఇక్కడ సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు జరిగేవి.

భోజ్‌శాలలో కనిపించే నిర్మాణ శైలి, శిల్పకళ, అక్కడి స్తంభాలపై చెక్కిన సంస్కృత శాసనాలు, దేవతా రూపాలు అన్నీ ఇది హిందూ ఆలయమని, కట్టడమని నిరూపిస్తున్నాయి. ముఖ్యంగా వాగ్దేవికి సంబంధించిన చిహ్నాలు, శిల్పాలలో కనిపించే హిందూ కళా లక్షణాలు, ఆలయ శైలిలోని మండప నిర్మాణం, శాసనాలలోని సంస్కృత పదాలు ఆలయ చరిత్రను సూచిస్తున్నాయి. 1305 ప్రాంతంలో అల్లావుద్దీన్ ఖిల్జీ సేనల దండయాత్రలో ఈ ఆలయం ధ్వంసమైంది. అనంతరం అక్కడి నిర్మాణాన్ని కమాల్ మౌలా మసీదు రూపంలో మార్చారు. ఆలయ స్తంభాలు, గర్భగుడి నిర్మాణ శైలిని పూర్తిగా తొలగించకుండా, వాటిపైనే మసీదు నిర్మించారు. భోజ్‌శాల ప్రాంగణంలో కనిపిస్తున్న అనేక శిల్పాలు, విరిగిన దేవతా విగ్రహ

'భోజ్‌శాల' అనే సంస్కృతం పదం వినగానే ఇది హిందూ సంప్రదాయాలకు చెందినదిగా స్పష్టమవుతుంది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఈ భోజ్‌శాల సనాతన ధర్మానికి చెందిన కట్టడం అని నిరూపించుకోవడానికి దేశంలో మెజార్టీలైన





# మరో చా
# విజయం

భాగాలు, కళా అవశేషాలు హిందూ కట్టడంగా నిరూపిస్తున్నాయి. ఈ నిర్మాణంలో సరస్వతీదేవీ విగ్రహం ఉండడం హిందువుల్లో భావోద్వేగాన్ని నింపుతోంది. బ్రిటిష్ పాలనలో అక్కడి అసలు సరస్వతి విగ్రహాన్ని విదేశాలకు తరలించారు. ప్రస్తుతం అది లండన్‌లోని మ్యూజియంలో ఉంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మన పూజనీయ కట్టడాలను స్వాధీనం చేసుకోవడానికి పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడడం దురదృష్టకరం. భోజ్‌శాల వివాదం కూడా స్వాతంత్ర్యం అనంతరమూ దీర్ఘకాలంగా కొనసాగింది. దీన్ని సరస్వతి ఆలయంగా గుర్తించాలని హిందువులు డిమాండ్ చేస్తుండగా, ముస్లిం వర్గాలు దీన్ని కమాల్ మౌలా మసీదుగా పేర్కొంటూ ప్రార్థనా హక్కులు కోరాయి. ఈ నేపథ్యంలో 2003లో భారత పురావస్తు శాఖ ప్రత్యేక విధానాన్ని అమలు చేసింది. దాని ప్రకారం మంగళవారాల్లో హిందువులు పూజలు చేసుకోవడానికి, శుక్రవారాల్లో ముస్లింలు నమాజ్ చేసేందుకు అనుమతి ఇచ్చింది. అయితే ఈ నిర్ణయాన్ని నాడే హిందూ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కట్టడం మొత్తం హిందూ సంస్కృతితో ఉంది. దేవాలయ ఆనవాళ్లు ఉన్నాయి. ఇది సరస్వతి ఆలయమైతే నమాజుకు అనుమతి ఎలా ఇస్తారు? అని హిందువులు ప్రశ్నించారు. హిందూ ఆలయమైన కట్టడాన్ని చారిత్రక సత్యాన్ని దాచిపెడుతున్నారని కోర్టును ఆశ్రయించారు.

ఈ వివాదం దీర్ఘకాలిక న్యాయపోరాటం అనంతరం హిందువుల పక్షం తీర్పు రావడం చారిత్రాత్మక ఘట్టం. అనేక హిందూ సంస్థలు, విశ్వహిందూపరిషత్, హిందూ మహాసభ వంటి

**హిందువులు సుదీర్ఘకాలం పోరాడి విజయం సాధించారు. ఇది ఒక కట్టడం లేదా నిర్మాణం కోసం చేసిన పోరాటం కాదు. భారతీయ, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మకమైన కట్టడం.**



# రిత్రక 'భోజ్‌శాల'

సంస్థలు భోజ్‌శాల అంశాన్ని బహిర్గతం చేసేందుకు, అసలు నిజాలను బయట పెట్టేందుకు కోర్టులను ఆశ్రయించాయి. కట్టడంపై శాస్త్రీయ సర్వే నిర్వహించి చారిత్రక వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేయడంతో, సర్వే చేపట్టాలని మధ్యప్రదేశ్ హైకోర్టు పురావస్తు శాఖను ఆదేశించింది. ఆ ఆదేశంపై ముస్లిం వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఇక్కడే వారి నైజం బయటపడింది. అక్కడ హిందూ దేవాలయానికి సంబంధించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో అది మసీదు కాదని తెలిసే వారు సర్వేను వ్యతిరేకించారు. దేశంలో బుజ్జగింపు రాజకీయాలతో వాస్తవాలను మరుగుపర్చేందుకు యత్నించారు. అయితే సర్వేను నిలిపి వేయడానికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నిరాకరించింది. కట్టడ నిర్మాణ స్వరూపానికి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాత్రమే సూచించింది.

కోర్టు ఆదేశాలతో దాదాపు మూడు నెలల పాటు సాగిన పురావస్తు సర్వేలో అనేక కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. హిందూ శైలికి చెందిన స్తంభాలు, సంస్కృత శాసనాలు, దేవతాశిల్పాల భాగాలు, ఆలయ నిర్మాణ అవశేషాలు బయట పడ్డాయి. కొన్ని శిల్పాలలో కమలాలు, హంసలు, విద్యకు సంబంధించిన చిహ్నాలు కనిపించాయి. ఇవి యాదృచ్ఛికంగా ఏర్పడిన గుర్తులు కావని, భోజ్‌శాల సరస్వతి ఆలయమేనని స్పష్టమైంది. సర్వేలో తేలిన వాస్తవ విషయాల ఆధారంగా మధ్యప్రదేశ్ హైకోర్టు భోజ్‌శాల హిందువులదే అని ఇచ్చిన తీర్పు దేశంలోని హిందువుల్లో ఉత్సాహం కలిగించింది. ఇప్పుడు కేవలం మంగళవారాల్లోనే కాకుండా ప్రతిరోజూ అక్కడ పూజలు చేసుకోవచ్చు. కోర్టు తీర్పుతో, 700 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భక్తులు ఇక్కడ అఖండ జ్యోతిని వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

విద్యాదేవి సరస్వతి ఆలయాన్ని తిరిగి చారిత్రాత్మకంగా నిలబెట్టడం భారతీయ నాగరికతకు గౌరవం ఇవ్వడమే. భోజుడు నిర్మించిన విద్యాపీఠాన్ని కాపాడటం అంటే భారతీయ జ్ఞాన సంపదను సగర్వంగా నిలబెట్టడమే. బ్రిటిష్ పాలనలో లండన్‌కు తరలించిన సరస్వతీ విగ్రహాన్ని ఇక్కడికి తిరిగి తీసుకొచ్చి ప్రతిష్టించాలని భక్తులు కోరుతున్నారు.

అయోధ్య, భోజ్‌శాలపై కోర్టు తీర్పులు హిందువులకు అనుకూలంగా రావడంతో 'ప్లేస్ ఆఫ్ వర్షిప్ యాక్ట్ 1991' చట్టంపై దేశంలో మళ్లీ చర్చ ప్రారంభమైంది. కొన్ని వర్గాల వారు ఈ చట్టం ప్రాధాన్యత గురించి వాదనలు వినిపిస్తున్నారు. ప్రధానంగా సనాతన ధర్మం వ్యతిరేకులు, ముస్లిం సంస్థలు ఈ చట్టాన్ని ప్రస్తావిస్తూ, 1947 నాటికి ఉన్న ప్రార్థనా స్థలాల స్వరూపం మార్చకూడదని చెబుతున్నాయి. అంటే గతంలో ముఖ్యంగా మొఘల్ పాలనలో హిందూ ఆలయాలను ధ్వంసంచేసి ముస్లిం కట్టడాలుగా మార్చారనేది వారంతా పరోక్షంగా ఆమోదిస్తున్నట్టే. లౌకికవాదం పేరు చెబుతూ బుజ్జగింపు రాజకీయాలకు ప్రాధాన్యతిచ్చే కుహనా సెక్యులరిస్టుకు హిందువుల మనోభావాలు పట్టవా..? అందుకే '1991 చట్టం ఇక్కడ అప్రస్తుతం' అంటూ "చారిత్రక సత్యాన్ని వెలికితీయడం చట్ట విరుద్ధం కాదు...చరిత్రలో జరిగిన అన్యాయాలను శాశ్వతంగా కొనసాగించలేం" అని హిందూసంస్థలు వ్యాఖ్యానిస్తున్నాయి. పురావస్తు ఆధారాలు, నిర్మాణ శైలి, సంస్కృత శాసనాలు ఇలా అన్నీ కలిపి భోజ్‌శాల అసలు స్వరూపాన్ని చూపుతున్నాయని, ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని సనాతనవాదులు వాదించడంలో ఎలాంటి అతిశయోక్తులు లేవు. ఒకవైపు హిందూ సంస్థలు దీనిని "భారత సంస్కృతి పునరుద్ధరణ"గా చూస్తుంటే, అటు ముస్లింవర్గాలు, సెక్యులర్‌వాదులు ఆందోళనలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టుకు వెళతామని చెబుతున్నారు. అయితే అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లినా భోజ్‌శాలలో లభించిన ఆధారాల ప్రాతిపదికగా అది హిందూ కట్టడమే అని మరోసారి తీర్పు వస్తుందని సనాతన వాదులు ఆశిస్తున్నారు. భోజ్‌శాల ఇప్పుడు భారతదేశ రాజకీయ, సాంస్కృతిక, ధార్మిక చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిపోయింది. ఇది కేవలం న్యాయపోరాటంలో విజయమే కాదు. భారతీయ సంస్కృతి, చరిత్ర, స్వాభిమానానికి ప్రతీక. "సరస్వతి ఆలయం మళ్లీ తన అసలు గుర్తింపును పొందాలి" అనే డిమాండ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా మరింత బలంగా వినిపిస్తోంది.

భోజ్‌శాల తీర్పుతో చారిత్రక సత్యం వెలుగులోకి వచ్చింది. ఇది శతాబ్దాల పోరాటానికి లభించిన న్యాయం. ఈ తీర్పు "అయోధ్య తర్వాత మరో చారిత్రక ఘట్టం" అని నిస్సందేహంగా చెప్పవచ్చు. భోజ్‌శాల అయోధ్య రామాలయం ఉద్యమాలకు సారూప్యతలున్నాయి. అయోధ్యలో రామమందిరం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం చివరకు సుప్రీంకోర్టు తీర్పుతో ముగిసినట్లే, భోజ్‌శాలలో కూడా చారిత్రక సత్యం బయటపడింది. ఈ రెండు తీర్పుల్లో ఏఎస్ఐ నివేదికలు కీలక పాత్ర పోషించాయి. అయోధ్య రామాలయం నిర్మాణం అనంతరం భోజ్‌శాల, వారణాసి జ్ఞానవాపి, మధుర అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఈ ప్రాంతాలన్నింటిలో విదేశీయులు..ప్రధానంగా ముస్లిం రాజులు దాడులు చేసి చారిత్రాత్మకమైన హిందూ దేవాలయాలను, కట్టడాలను ధ్వంసం చేశారు. నాటి నుండి నేటి వరకు హిందువులు వాటి పునర్నిర్మాణం కోసం పోరాడుతూనే ఉన్నారు. అందుకే ఈ ప్రధాన స్థలాలు నిత్యం చర్చల్లో ఉంటాయి. భారత్‌లో ధ్వంసమైన అనేక ఆలయాల చరిత్ర ఇప్పుడు తిరిగి వెలుగులోకి వస్తున్నాయి.

భోజ్‌శాల తీర్పు భారతీయ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచిపోయింది. ఇది కేవలం న్యాయపరమైన విజయం మాత్రమే కాదు, శతాబ్దాలుగా కొనసాగిన సాంస్కృతిక పోరాటానికి లభించిన గుర్తింపు. అయోధ్య తర్వాత భోజ్‌శాల అంశం కూడా దేశవ్యాప్తంగా చారిత్రక చైతన్యాన్ని రగిలిస్తోంది. భారతదేశం సనాతన సంప్రదాయాల పునరుద్ధరణ దిశగా అడుగులు వేసేందుకు ఈ తీర్పు గొప్ప నైతిక బలం ఇచ్చింది. 'చరిత్రను తెలుసుకోవడం విభజన కాదు... నాగరికతను కాపాడుకోవడం' అనే సందేశాన్ని భోజ్‌శాల న్యాయ పోరాటం దేశానికి అందించింది.

**– శ్రీపాద**



# ధాన్యం కొనుగో
# రైతన్నల అ

**తెలంగాణలో అన్నదాతలు మరోసారి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో ఆనందపడాల్సింది పోయి, కొనుగోలు కేంద్రాల వద్ద రోజులు తరబడి పడిగాపులు కాచే పరిస్థితి దాపురించింది. ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలో అలసత్వం రైతులను తీవ్ర ఆందోళనలోకి నెట్టేశాయి. పెద్ద సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ధాన్యాన్ని కొనుగోలు రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు కాంటా కోసం 15 నుంచి 25 రోజుల వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. ఎండల్లో, వర్షాల్లో ధాన్యపు రాశుల వద్దే రైతులు కాపలా కాస్తున్నారు. కష్టాలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.**

రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా, అక్కడ తగినంత సరైన సిబ్బంది లేకపోవడం, కాంటాలు వేయడానికి ఏర్పాట్లు లేకపోవడం, హమాలీల కొరత, లారీలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. కాంటా వేసిన తర్వాత కూడా ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోంది. ధాన్యం తరలింపునకు లారీలు సమయానికి రాకపోవడం మరింత సమస్యగా మారింది. ఈ ఆలస్యం రైతులకు ఆర్థికంగా కూడా తీవ్ర నష్టం కలిగిస్తోంది. ఎండల్లో రోజులు తరబడి ధాన్యం ఉంచడంతో బరువు తగ్గిపోతోంది. కొంతమంది లారీ యజమానులు బస్తాకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎండల్లో రోజులు తరబడి ధాన్యం ఉంచడంతో బరువు తగ్గిపోతోంది. తూకాల ప్రక్రియ, తరుగు సమస్య సమస్యలుగా పరిణమించాయి. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ అధికారులు ధాన్యాన్ని తిరస్కరించడం, తరుగు పేరుతో అదనపు కోతలు విధించడం రైతులకు భారీ నష్టాన్ని మిగులుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ 17 శాతం దాటితే కోతలు విధిస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇష్టం వచ్చినట్లు తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే మార్కెట్ ధరలు పడిపోయి ఇబ్బందులు పడుతున్న రైతులు, క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదుకిలోల వరకు అదనపు కోతలు విధించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్నిచోట్ల బస్తాకు అదనపు బరువు వేస్తున్నారని, తూకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. పెట్టుబడులు పెరిగి అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు ఈ తరహా కోతలు మరింత ఆర్థిక భారం మిగులుస్తున్నాయి.

**అకాల వర్షాలు.. రైతు గుండెల్లో గుబులు**

వాతావరణ పరిస్థితులు కూడా రైతులను తీవ్రంగా భయపెడుతున్నాయి. రుతుపవనాల ప్రభావం మొదలవడంతో అనేక జిల్లాల్లో గాలి వానలు, వడగళ్ల వానలు కురుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో రోజులు తరబడి పడివున్న ధాన్యం వర్షాలకు తడిసి రంగు మారుతోంది. తేమ పెరగడంతో అధికారులు తిరస్కరిస్తారేమోనన్న భయం రైతులను వెంటాడుతోంది. కొన్ని ముందుస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం టార్పాలిన్లు, తాత్కాలిక నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, అలాంటివి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**గోదాముల కొరత.. రవాణా అస్తవ్యస్తం**

కొనుగోలు కేంద్రాల్లో, మిల్లుల వద్ద గోదాముల కొరత ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి సరిపడా స్థలం లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ నెమ్మదించింది. కొన్ని ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తమ వంత ఎప్పుడోనని స్థానిక రైతులు ఎదురు చూస్తూ గడుపుతున్నారు.

**రైతులకు భరోసా ఎక్కడ?**

ఎన్నికల సమయంలో రైతులకు పెద్ద ఎత్తున హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పూర్తిగా విస్మరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా, పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, వేగవంతమైన కొనుగోళ్లు... అన్న హామీలు అంతగా అమలు కాక రైతు అప్పుల బారిన పడుతున్నాడు. పంట అమ్ముడుకాక కొత్త సాగుకు పెట్టుబడి దొరకడం లేదు. కొనుగోళ్లలో జాప్యం, ప్రభుత్వ యంత్రాంగం పనిలో సమన్వయ లోపం, కొనుగోలు ప్రక్రియలో ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం, సరఫరా వ్యవస్థలో గందరగోళం కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు.

**ప్రభుత్వం సమీక్షలు.. పరిష్కారం కాని సమస్యలు**

ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. 'మిషన్ మోడ్‌లో కొనుగోళ్లు పూర్తి చేయాలి', 'రైతులకు ఇబ్బంది కలగకూడదు', 'నిర్లక్ష్యాన్ని సహించం' అని అధికారులకు హెచ్చరికలతో కూడిన ఆదేశాలు ఇచ్చారు. గోనె సంచులు, హమాలీలు, లారీలు అందుబాటులో ఉండాలని సూచించారు. అవసరమైతే ఫంక్షన్ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక గోదాములుగా ఉపయోగించాలని చెప్పారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారులను నియమించాలని కూడా ఆదేశించారు. కానీ ఈ ఆదేశాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు కావడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**కొనుగోలు కేంద్రాల మూసివేత?**

పెద్ద సంఖ్యలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొన్నిటిని త్వరలో మూసివేయాలని అంతర్గత ఆదేశాలు ఇచ్చారనే వార్తలు రైతుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో ఇంకా దాదాపు లక్షల టన్నుల ధాన్యం బయటే ఉండగా కొనుగోలు కేంద్రాలు మూసేస్తే మిగిలిన పంట ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు పనిచేయకపోతే రైతులు ప్రైవేట్ వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువకు కొనుగోలు చేయడం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. మక్కలు, జొన్నల కొనుగోళ్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొనడం రైతుల్లో



# ళ్ల సంక్షోభం.. గచాట్లు



పంట పండించడం రైతు బాధ్యత అయితే... పండించిన పంటకు గిట్టుబాటు కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా? అనే ప్రశ్న ఇప్పుడు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో బలంగా వినిపిస్తోంది. రైతు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి పోతుంటే, ప్రభుత్వం సమీక్షలతో సరిపెడుతోందనే భావన రైతుల్లో పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రైతు సమస్యలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు బీజేపీ చేపట్టిన "రైతు గోస – బీజేపీ భరోసా" యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది.

అసంతృప్తిని పెంచుతోంది.

**'రైతుగోసకు బీజేపీ భరోసా'**

ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలుస్తామంటూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. "రైతుగోస – బీజేపీ భరోసా" పేరుతో చేపట్టిన యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చను లేవనెత్తింది. రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించారు. వికారాబాద్, గజ్వేల్, భువనగిరి, వరంగల్, భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లి తదితర ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాలను ఈ బృందాలు సందర్శించాయి. రైతులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి సమస్యలను నమోదు చేశాయి. కాంటాల జాప్యం, తరుగు కోతలు, గన్నీ సంచుల కొరత, లారీలు లేక రవాణా సమస్యలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలపై రైతుల నుంచి నేరుగా వివరాలు సేకరించారు.

రాష్ట్రాన్ని రైతుల ఆత్మహత్యలు లేనిదిగా తీర్చిదిద్దడమే తమ పార్టీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. "రైతుగోస – బీజేపీ భరోసా' యాత్రలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న అవస్థలకు తీవ్రంగా స్పందించారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, రవాణా సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రాంచందర్‌రావు విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో రైతులు మానసికంగా కుంగి పోతున్నారని, కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, రైతులకు తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. 'తమ పార్టీ యాత్ర ప్రకటించిన తర్వాతే ప్రభుత్వం హడావిడిగా ఏర్పాట్లు చేస్తోంది. తేమ శాతం పేరుతో రైతులను వేధిస్తున్నారు. ఐకేపీ కేంద్రాల్లో రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. వరితో పాటు మక్కలు, జొన్నల కొనుగోళ్లలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకు రైతులు పంట అమ్ముకునే పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోంది. దళారులు, ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు లాభం చేకూరేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది' అని ఆరోపించారు. రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని, ప్రతి గింజా కొనుగోలు చేసేలా ఒత్తిడి తెస్తామని ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

**హడావిడి సమీక్షలు**

బీజేపీ యాత్ర ప్రకటించిన తర్వాతే ప్రభుత్వం వరుస సమీక్షలు నిర్వహించడం రాజకీయంగా చర్చకు దారితీసింది. రైతుల సమస్యలు నెలలుగా కొనసాగుతున్నా.. అప్పటివరకు కనిపించని అత్యవసర పరిస్థితులను ప్రభుత్వం ఒక్కసారిగా చూపించడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు ఉండాలని, లారీలు అందుబాటులో ఉంచాలని, తాత్కాలిక గోదాములు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పుడు చెప్పడం,ఒక్కసారిగా ముందస్తు ప్రణాళికలో వైఫల్యాన్ని స్పష్టం చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వం ఒకవైపు సమీక్షలు, వీడియో కాన్ఫరెన్సులు నిర్వమిస్తుండగా, మరోవైపు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద కాంటా కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.

పంట పండించడం రైతు బాధ్యత అయితే... పండించిన పంటకు గిట్టుబాటు కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా? అనే ప్రశ్న ఇప్పుడు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో బలంగా వినిపిస్తోంది. రైతు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి పోతుంటే, ప్రభుత్వం సమీక్షలతో సరిపెడుతోందనే భావన రైతుల్లో పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రైతు సమస్యలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు బీజేపీ చేపట్టిన "రైతు గోస – బీజేపీ భరోసా" యాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది.

రైతుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ చెబుతుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటికైనా కొనుగోళ్లలో వేగం పెంచి రైతులకు నిజమైన భరోసా ఇవ్వాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. రైతాంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. అలాంటి రైతు నష్టపోతే రాష్ట్రం నష్టపోతుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, కొనుగోళ్లలో సమన్వయం లేకపోవడం, రైతులను ఇబ్బందుల పాలుచేయడం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

# మతవిద్వేషాల సృష్టికి

**సమాజంలో అత్యంత సున్నితమైన 'మతాన్ని' అడ్డం పెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకునే సంస్కృతి ఆంధ్రప్రదేశ్‌లో ఆందోళనకరంగా మారుతోంది. ప్రజల్లో సానుభూతి పొందడానికి, తమకంటూ రాజకీయ ఉనికిని సృష్టించుకోవడానికి కొందరు నాయకులు, స్వయం ప్రకటిత మేధావులు అత్యంత దిగజారుడు రాజకీయాలకు తెరతీస్తున్నారు. తమపై తామే దాడులు చేయించుకుంటూ నాటకాలు ఆడటం ఒక ఎత్తైతే, సొంత తప్పిదాల వల్ల జరిగే ప్రమాద మరణాలను సైతం "రాజకీయ హత్యలుగా" చిత్రీకరించి మెజారిటీ హిందువులపై, హిందూ సంఘాలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం మరో ఎత్తు.**



పాస్టర్ అభినవ్ దర్శన్

కడప ప్రాంతానికి చెందిన పాస్టర్ అభినవ్ దర్శన్ తనపై తానే దాడి చేయించుకున్న వ్యవహారం, పాస్టర్ పగడాల ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపాయి. ఇవి చీకటి రాజకీయాలకు అద్దం పడుతున్నాయి. ఈ రెండు ఘటనల వెనుక ఉన్న అసలు నిజాలు, రాజకీయ కుట్రలను విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

**పాస్టర్ అభినవ్ దర్శన్ ఆడిన "నకిలీ దాడి" నాటకం**

పాస్టర్ అభినవ్ దర్శన్ నటుడు కూడా. తన ఉనికిని బలంగా చాటుకోవాలనే ఆరాటంతో, ఇటీవల అతను 'భరోసా పార్టీ' అనే రాజకీయ పార్టీని స్థాపించి, తనకు తానే జాతీయ అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకుంటున్నానంటూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించాడు. ఈ పర్యటనలో భాగంగా, చింతపల్లి మండలంలోని నీరుతోటపాలెం సమీపంలో తన కారును కొందరు ముసుగు దుండగులు అడ్డగించారని, కారుపై కోడిగుడ్లు విసిరి, అద్దాలు పగులగొట్టి, తనను సమీపంలోని కాఫీ తోటల్లోకి లాక్కెళ్లి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారంటూ ఒక వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశాడు. తాను నొప్పితో విలవిలలాడుతున్నట్లున్న ఆ వీడియోను వైరల్ చేసి, రాత్రికి రాత్రే హీరో అయిపోవాలని కలలు కన్నాడు. 'పాస్టర్ ప్రవీణ్ లాగే నన్ను కూడా చంపాలని చూస్తున్నారు' అంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పోలీసుల విచారణపై తనకు నమ్మకం లేదని కూడా ప్రకటించాడు. తనపై దాడులు జరిగినట్లు ఉచిత పబ్లిసిటీ తెచ్చుకోవడం, క్రైస్తవ మైనార్టీ వర్గాల్లో విపరీతమైన సానుభూతి కూడగట్టుకోవడం, రాబోయే ఎన్నికల్లో మతపరమైన ఎజెండాతో నాయకుడిగా ఎదగడం ఆయన లక్ష్యం.

**సోషల్ మీడియా సాక్ష్యాలతో డ్రామా బట్టబయలు**

మొదట్లో ఈ ఘటనను నిజమైన హత్యా యత్నంగా మైనార్టీ సంఘాలు భావించి హిందూ సంస్థలు, సంఘాలపై తీవ్ర ఆరోపణలు చేశాయి. అయితే పోలీసుల సమగ్ర విచారణలో అసలు నిజాలు బట్టబయలయ్యాయి. అభినవ్ దర్శన్ ఆడిన ఈ 'నకిలీ దాడి' నాటకాన్ని పోలీసులు శాస్త్రీయ ఆధారాలతో ఛేదించారు. పోలీసులు సేకరించిన ఇన్స్టాగ్రామ్ ఆడియో క్లిప్పులు, వీడియోలు, వైద్య నివేదికలు ఈ దాడి ఒక పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన కుట్ర అని తేల్చాయి. దాడి ఎక్కడ జరపాలి, సన్నివేశాన్ని ఎలా చిత్రీకరించాలి.. అనే విషయాలపై అభినవ్ తన అనుచరులతో జరిపిన చర్చలు ఆడియో మెసేజ్‌ల ద్వారా బయటపడ్డాయి. స్వయంగా అభినవ్ దర్శన్ దగ్గరుండి స్క్రిప్ట్ రాసి, దర్శకత్వం వహించి, తన అనుచరులతోనే దాడి చేయించుకొని, ముసుగు దుండగుల సృష్టించాడని నిర్ధారణ అయ్యింది. దీంతో ఈ కుట్రలో ఏ1గా పాస్టర్ అభినవ్, ఏ2గా బిల్లా కిరణ్, ఏ3 కె.బెన్హర్, ఏ4 భానుప్రసాద్‌లతో పాటు సహకరించిన మరి కొందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

**రోడ్డు ప్రమాదంపై 'శవ రాజకీయం'**

ఇదే తరహాలో మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేసిన మరో కీలక ఘటన 'పాస్టర్ పగడాల ప్రవీణ్' మృతి. 2025 మార్చి 25న రాజమహేంద్రవరం సమీపంలో 45 ఏళ్ల పాస్టర్ ప్రవీణ్ మోటర్ సైకిల్‌పై వెళుతూ రోడ్డు ప్రమాదంలో మరణించారు. స్థానిక పోలీసులు దీనిని సాధారణ ప్రమాదంగానే నిర్ధారించారు. పోలీసుల దర్యాప్తులో, ప్రమాదానికి ముందు పాస్టర్ ప్రవీణ్ కోదాడ వద్ద రూ. 650 విలువైన మద్యం కొనుగోలు చేశారని, మద్యం తాగి వాహనం నడపడం వల్లే పలుచోట్ల కింద పడిపోయి చివరకు ప్రాణాలు కోల్పోయారని స్పష్టమైన ఆధారాలు లభించాయి. కానీ, ఈ వాస్తవాలను పక్కనపెట్టి మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, మరికొందరు పాస్టర్లు, వైఎస్సార్సీపీ సానుభూతి పరులు ఇదొక పక్కా ప్రణాళికతో జరిగిన 'రాజకీయ హత్య' అని దుష్ప్రచారం మొదలుపెట్టారు. దీనిపై హైకోర్టులో పిల్ వేయగా, కోర్టు తీవ్రంగా స్పందించింది. ప్రవీణ్ మరణానికి హిందువులే కారణమని చెప్పడానికి ఆధారాలు ఎక్కడ ఉన్నాయని హర్షకుమార్‌ను సూటిగా ప్రశ్నించింది. మద్యం తాగి వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఫొటో ఆధారాలతో సహా కోర్టు సైతం వ్యాఖ్యానించింది.

**సోషల్ మీడియా వేదికపై ప్రచారం**

సంఘటనలు జరగ్గానే క్రైస్తవ మత ప్రచారకులు, ప్రతిపక్ష అనుకూల విశ్లేషకులు, అనుకూల టీవీ

# ‘దాడుల’ నాటకాలు



పాస్టర్
పగడాల ప్రవీణ్

**పాస్టర్ అభినవ్ దర్శన్ పబ్లిసిటీ డ్రామా అయినా, పాస్టర్ ప్రవీణ్ మరణంపై జరిగిన శవ రాజకీయా లైనా.. ఈ రెండింటి వెనుక ఉన్న ఉమ్మడి లక్ష్యం మత విద్వేషాలను రగిలించి ఓటు బ్యాంకులను పదిలపరుచుకోవడమే. కొంతమంది పాస్టర్లు ఇలాంటి చౌకబారు ఎత్తుగడలకు పాల్పడటం, సీనియర్ రాజకీయ నాయకులు సైతం ఆధారాలు లేకుండా మెజారిటీ వర్గాలపై విషం చిమ్మడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.**

ఛానళ్లలో చర్చలు నిర్వహిస్తారు. దాడులు చేసింది హిందూ సంఘాలుగా ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి ఈ తతంగం జరుగుతుంది. చర్చలు చేసే వారు. సాధారణ ప్రజలకు అనుమానాలు రేకెత్తించేలా మాట్లాడతారు. హిందూ సంఘాలను దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం విపరీతంగా జరుగుతోంది. ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు కూడా ఇస్తారు. ఈ అంశంపై కోర్టు తీర్పులో హిందూ సంఘాలది తప్పు లేదని తేలినా వీరు కోర్టు తీర్పులను సైతం తప్పుపడుతున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒక ఫాస్టర్ పవన్ కల్యాణ్ తలకు వెలకట్టి బహిరంగంగా మాట్లాడి వైరల్ అయిన సంఘటనపై మాత్రం ఈ విశ్లేషకులు నోరు మెదపలేదు.

**హిందువులే ఎందుకు లక్ష్యం?**

ఒకరు ఉచిత పబ్లిసిటీ కోసం నకిలీ దాడి నాటకం ఆడినా, మరొకరు సొంత తప్పిదంతో రోడ్డు ప్రమాదంలో చనిపోయినా.. ఈ రెండు ఘటనలను ‘మతపరమైన దాడులుగా’ చిత్రీకరించడం వెనుక అతిపెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న క్రైస్తవ మైనార్టీ వర్గాలను భయభ్రాంతులను చేసి, ‘మెజారిటీ హిందువులు మిమ్మల్ని అంతమొందిస్తున్నారు’ అనే ఒక తప్పుడు భావనను వారిలో సృష్టించడం. ప్రభుత్వానికి, హిందూ సమాజానికి మచ్చ తీసుకురావడం ద్వారా మైనార్టీలను ఒక వర్గం వైపు తిప్పుకోవడం. రెండు మతాల మధ్య విద్వేషాలు రగులుకుంటే, తాము మైనార్టీల ‘రక్షకులం’ అని చెప్పుకునే అవకాశం దొరుకుతుందని హర్షకుమార్ లాంటి నాయకుల వ్యూహం.

**వీరి వెనుక ఉన్న అదృశ్య హస్తం ఎవరిది?**

సాధారణ పాస్టర్లకు ఇంత ధైర్యం ఎక్కడి నుంచి వస్తుంది? పోలీసులంటే భయం లేకుండా పక్కాగా స్క్రిప్టులు రాసుకుని మరీ దాడుల డ్రామాలు ఆడుతున్నారంటే వీరి వెనుక బలమైన రాజకీయ శక్తులు ఉన్నాయని స్పష్టమవుతోంది.

ముఖ్యంగా రాజకీయంగా ఒక వర్గాన్ని దెబ్బ తీయడానికి, రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించడానికి కొన్ని శక్తులు వీరిని ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ఈ పాస్టర్ల ఫోన్ కాల్ డేటా, బ్యాంక్ అకౌంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తే, వీరి నాటకాల వెనుక ఉన్న సూత్రధారులు ఎవరో బయటపడటం ఖాయం.

**కూటమి విడగొట్టేందుకు ప్రయత్నం**

ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత ఉంది. దాని పాలన పట్ల సంతృప్తి కనిపిస్తోంది. టీడీపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వంలో జనసేనతో పాటు బీజేపీ ప్రధాన భాగస్వాములుగా ఉన్నాయి. అయితే ఆ మూడు పార్టీలు కలిసి ఉండడం ప్రతిపక్షానికి ఇబ్బందికరమే. కులపరంగా, మత పరంగా రాజకీయ అస్థిరతను సృష్టించేందుకు కూడా పార్టీ ప్రయత్నాలు చేస్తున్న విషయం పదేళ్ల నుంచి సమాజం చూస్తోంది. ప్రతిపక్షం ఇలాంటి అసత్య ఆరోపణలు, సంఘటనలు ఆధారంగా చేసుకుని కూటమిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ పార్టీలు ఆరోపిస్తున్నాయి.

**మత విద్వేషాలతో లబ్ధికి ప్రయత్నం**

అభినవ్ దర్శన్ లాంటి వారు పోలీసుల విచారణలో దొరికిపోయినా, ఇంకా కొంతమంది అదే మొండితనంతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతున్నారు. రాష్ట్రంలో కుల, మత సామరస్యాన్ని దెబ్బతీసి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ఈ పాస్టర్ల ఆటలకు అడ్డుకట్ట వేయాల్సిన సమయం వచ్చింది. దేవుడి పేరు చెప్పి మోసాలకు పాల్పడే ఇలాంటి నకిలీ పాస్టర్ల వల్ల నిజమైన ఆధ్యాత్మికవేత్తలకు కూడా చెడ్డపేరు వస్తోంది.

పాస్టర్ అభినవ్ దర్శన్ పబ్లిసిటీ డ్రామా అయినా, పాస్టర్ ప్రవీణ్ మరణంపై జరిగిన శవ రాజకీయా లైనా.. ఈ రెండింటి వెనుక ఉన్న ఉమ్మడి లక్ష్యం మత విద్వేషాలను రగిలించి ఓటు బ్యాంకులను పదిలపరుచుకోవడమే. కొంతమంది పాస్టర్లు ఇలాంటి చౌకబారు ఎత్తుగడలకు పాల్పడటం, సీనియర్ రాజకీయ నాయకులు సైతం ఆధారాలు లేకుండా మెజారిటీ వర్గాలపై విషం చిమ్మడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. అల్లూరి జిల్లా పోలీసులు డిజిటల్ ఆధారాలతో సత్వరమే ఈ నాటకాలను బట్టబయలు చేయడం అభినందనీయం. ఈ ఘటనలు సమాజానికి ఒక మేలుకొలుపు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆరోపణను గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను గ్రహించి, స్వార్థ రాజకీయశక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

**సంఘర్షణల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ప్రాధాన్యత లేని దిగుమతులను వాయిదా వేసుకోవాలి. డాలర్ ఆధారిత వాణిజ్య లావాదేవీలు, కరెన్సీ మార్పిడులు, డాలరేతర ఒప్పందాలపై భారీగా దృష్టి పెట్టాలి.**

**భా**రతీయ రూపాయి దాడికి గురవుతోందా? ఒక అమెరికన్ డాలర్‌కు రూ.100 అనే మానసిక అవరోధాన్ని మారకం నిష్పత్తి దాటుతుందా? దానివల్ల భారత ఆర్థిక వ్యవస్థ బాహ్య కరెన్సీ మార్కెట్ కదలికలకు మరింత సున్నితంగా లేదా బలహీనంగా మారుతుందా? లేక, చమురు, సమరం కారణమా?

ఈ రోజుల్లో విపరీతంగా హెచ్చుతగ్గులకు లోనవుతున్న రూపాయి విలువను ఎలా అర్థం చేసుకోవాలి? రూపాయి నిరంతర పతనాన్ని అరికట్టడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-ఆర్‌బీఐ అనుసరిస్తున్న వ్యూహంపై భారతదేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పదహారవ ఆర్థిక సంఘం ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగరియా నేతృత్వంలోని ఒక పెద్ద వర్గం, ఒక అమెరికన్ డాలర్‌కు రూపాయి విలువ 100 రూపాయల మార్కును దాటడాన్ని అంత తీవ్రంగా పరిగణించకూడదని వాదిస్తోంది. రూపాయి స్వేచ్ఛా పతనం లేదా విలువ తరుగుదల కోసం ఒత్తిడి చేస్తూ, ఇటీవల రాసిన తన కాలమ్‌లో డాక్టర్ పనగరియా "అది కేవలం ఒక సంఖ్య మాత్రమే" అని పేర్కొన్నారు.

ముడి చమురు కొరత కొనసాగుతున్నందున, డాలర్‌కు ఫార్వర్డ్ మార్కెట్ రేటును ఒక్కో మారకం విలువకు రూ.100గా నిర్ణయించడం, భారతీయ కరెన్సీ భవిష్యత్తుపై పెద్ద చర్చకు దారితీసింది.

మార్కెట్లలో జోక్యం చేసుకుని, తన వద్ద ఉన్న భారీ విదేశీ మారక నిల్వలతో రూపాయిని కాపాడవద్దని ఆర్‌బీఐకి డాక్టర్ పనగరియా సలహా ఇచ్చారు. చమురు కొరత, రిటైల్ స్థాయిలో అధిక ద్రవ్యోల్బణం, వీటికి తోడు ఆరోగ్యకరమైన వడ్డీ రేట్లు కలిసి రూపాయి స్వేచ్ఛా పతనానికి కారణమవు తున్నాయి, దీంతో రూపాయి విలువ డాలర్‌కు 97 రూపాయలను దాటింది.

రూపాయి విలువ విషయంలో మరింత సంప్రదాయబద్ధమైన విధానాన్ని అనుసరించాలని ఒక ముఖ్యమైన బృందం సిఫార్సు చేసింది. రూపాయి విలువ మరింతగా పడిపోయి డాలర్‌ను 100 రూపాయల వద్దకు చేర్చవద్దని ఆర్ఎస్ఎస్ స్ఫూర్తితో ఏర్పడిన స్వదేశీ జాగరణ్ మంచ్-ఎస్‌జేఎం ఆర్‌బీఐని కోరింది.

ఎస్‌జేఎం వాదన ప్రకారం అలా జరిగిన పక్షంలో దేశీయ పరిశ్రమలకు, వ్యాపార వర్గానికి దిగుమతులు ఖరీదైనవిగా మారతాయి. ఉత్పత్తులు, సేవల ధరలు వేగంగా పెరిగి, తద్వారా వినియోగ డిమాండ్‌పై ప్రభావం పడి, చివరికి వృద్ధి దెబ్బతింటుంది. ఒకవేళ రూపాయి విలువ డాలర్‌కు 100కి మించి పడిపోతే, స్వావలంబన లేదా స్వదేశీ అనే నినాదంతో సాగుతున్న 'మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' ప్రచారానికి ఆటంకం కలుగుతుంది.

ఫార్వర్డ్ మార్కెట్లలో అమెరికన్ డాలర్ విలువ ఇప్పటికే రూ. 100 దాటి ఉన్నందున, రూపాయి విలువ మరింత పడిపోవడం రాజకీయంగా కూడా ఆమోదయోగ్యం కాకపోవచ్చు. భారతదేశపు వైవిధ్యభరితమైన ఇంధన విభాగంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం కూడా దాని ప్రభావాన్ని చూపింది.

ఉదాహరణకు, ఏప్రిల్ 2025, ఏప్రిల్ 2026 మధ్య ముడి చమురు ధరలు 70 శాతానికి పైగా పెరగడం భారత్ ఇంధన దిగుమతుల బిల్లుపై తీవ్ర ప్రభావం చూపింది. గత సంవత్సరంలో బ్యారెల్‌కు 67.62 డాలర్లుగా ఉన్న ముడి చమురు మొత్తం ధర ప్రస్తుత కాలంలో 114.48 డాలర్లకు చేరింది. బ్యారెల్‌కు ముడి చమురు ధరలో పెరిగే ప్రతి డాలర్, భారతదేశానికి ఒక బిలియన్ డాలర్లకు పైగా దిగుమతుల బిల్లుకు దారితీస్తుంది.

ద్రవ్యలోటు పెరగడం, ఇంధనంపై సబ్సిడీ బిల్లు విపరీతంగా పెరగడం, అలాగే మూలధన పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టులపై వ్యయాన్ని తగ్గించాల్సి రావడం వంటి కారణాల వల్ల, బ్యారెల్‌కు మొత్తం ధర 85 డాలర్లకు చేరినా కూడా 2026-27 బడ్జెట్ అంచనాలపై ఒత్తిడి

**యూఎస్ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, భారతదేశ విదేశీ మారక ద్రవ్య బాస్కెట్‌ను విస్తరించడం, వైవిధ్యపరచడం ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా భారతదేశం, తమ ఆర్థిక వ్యవస్థను 'డీ-డాలరైజింగ్' చేయాలనే ఆలోచనను అధ్యక్షుడు డొనాల్డ్ జె ట్రంప్ వ్యతిరేకించవచ్చు. కానీ, వాణిజ్య ఒప్పందాలను స్థానిక కరెన్సీలలో పరిష్కరించు కోవడం ఒక పెద్ద అవకాశంగా మారవచ్చు.**




పడవచ్చు. ఇటీవల అమలు చేస్తున్న పొదుపు చర్యల కోసం ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు వెనుక ఉన్న తర్కం, కారణం, హేతుబద్ధతను ఇది అందిస్తుంది.

ఈ నేపథ్యంలో, డాక్టర్ పనగరియా వంటి వారి నేతృత్వంలోని ఉదారవాదులు, నిల్వలను పెంచడానికి డాలర్లలో ప్రభుత్వ పత్రాలను జారీ చేయడం లేదా అధిక వ్యయంతో కూడిన ఎన్నారై డిపాజిట్ల ద్వారా డాలర్లను సమీకరించడం వంటి చర్యలను వ్యతిరేకించారు. కరెన్సీ విలువలో పెరుగుదలలకు అనుగుణంగా చెల్లింపులను వాయిదా వేయడం లేదా కరెన్సీ లాభాలను ఎన్నారైలకు బదిలీ చేయడం సరైన మార్గం కాదని వారు వాదించారు.

దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించడం, ప్రాధాన్యత లేని దిగుమతులను వాయిదా వేయడం, 'వ్యాపార సౌలభ్యం' పరంగా భారతదేశంలోని వస్తు, సేవల పరిశ్రమను ఆకర్షణీయంగా మార్చడం ఉత్తమమైన మార్గం.

మార్చి, 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం 95 బిలియన్ డాలర్ల స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను-ఎఫ్‌డీఐ ఆకర్షించింది. కానీ, పెట్టుబడుల నిష్క్రమణలు, లాభాల తరలింపు, పెట్టుబడుల ఉపసంహరణలు మొదలైనవి, వడ్డీ చెల్లింపులను మినహాయించిన



# చిక్కుముడి

తర్వాత నికర పెట్టుబడులు కేవలం 7.7 బిలియన్ డాలర్లుగా మాత్రమే నమోదయ్యాయి. నికర ఎఫ్‌డీఐ పెట్టుబడులను వేగంగా విస్తరించేందుకు ప్రయత్నిం చాల్సిన అవసరం ఉంది. మొదటగా, ఈ ఆర్థిక సంవత్సరంలో నికర ఎఫ్‌డీఐ ప్రవాహాలను 25 బిలియన్ డాలర్లకు లక్ష్యంగా పెట్టుకోగలమా?

రెండవది, మధ్యకాలికం నుండి దీర్ఘకాలికం వరకు కరెన్సీ మార్పిడులు అనే ఆలోచనను బ్యాంకర్లు, విధాన రూపకర్తలు విస్మరించలేరు. కరెన్సీ మార్కెట్‌లోని అస్థిరతను ఉపయోగించు కోవడం, పొజిషన్లు తీసుకోవడం అనేది ఒక ప్రణాళికాబద్ధమైన పద్ధతిలో చేయవలసిన విషయం.

గత ఏడాది కాలంలో యూఎస్ డాలర్ల అమ్మకంపై ఆర్‌బీఐ మంచి లాభాలను ఆర్జించిందని కరెన్సీ వ్యాపారులు ఇప్పటికే నివేదించారు. కరెన్సీ నష్టాలను తగ్గించే మార్పిడులతో పాటు, మార్కెట్లలోని అస్థిరత ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి ఆర్‌బీఐ, అగ్రశ్రేణి భారతీయ బ్యాంకులు డాలర్ వ్యాపారాన్ని కొనసాగించాలి. ఏప్రిల్ 1, 2026తో ముగిసిన గత ఏడాది కాలంలో, రూపాయిని కాపాడటానికి లేదా లాభాలను ఆర్జించడానికి ఆర్‌బీఐ 53 బిలియన్ డాలర్లను విక్రయించింది. నేటి వరకు, భారతదేశ విదేశీ మారక నిల్వలు 688.9 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు నివేదితమైంది.

యూఎస్ డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, భారతదేశ విదేశీ మారక ద్రవ్య బాస్కెట్‌ను విస్తరించడం, వైవిధ్యపరచడం ఒక ప్రత్యామ్నా యంగా ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ముఖ్యంగా భారతదేశం, తమ ఆర్థిక వ్యవస్థను 'డీ-డాలరైజింగ్' చేయాలనే ఆలోచనను అధ్యక్షుడు డొనాల్డ్ జె ట్రంప్ వ్యతిరేకించవచ్చు. కానీ, వాణిజ్య ఒప్పందాలను స్థానిక కరెన్సీలలో పరిష్కరించు కోవడం ఒక పెద్ద అవకాశంగా మారవచ్చు. బ్రిక్స్ గ్రూపునకు అతీతంగా, ఆయా కరెన్సీలలో వస్తు, సేవల వాణిజ్య పరిష్కారాలను పరిగణించవచ్చు.

బంగారం, వెండి దిగుమతులను ఒక సంవత్స రానికి వాయిదా వేయడం కూడా చెడ్డ ప్రత్యామ్నాయం కాదు. 2025-26 సంవత్సరంలో, 702 టన్నుల బంగారం దిగుమతులపై ఏకంగా 71.98 బిలియన్ డాలర్ల భారీ మొత్తం ఖర్చయింది. 2024-25తో పోలిస్తే బంగారం దిగుమతుల బిల్లులో 24 శాతం పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. దీనివల్ల కలిగే భారీ ఆర్థిక వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని, కుటుంబాలు తమ బంగారం, వెండి కొనుగోళ్లను విడతల వారీగా చేసుకోవడంలో ఏమాత్రం నష్టం లేదు.

విదేశీ మారక ద్రవ్య వినియోగం కోసం ప్రాధాన్యతా రంగాలను పునఃసమీక్షించడం లేదా పునఃనిర్వహించడం వంటి అంశాలను తీవ్రంగా పరిగణించవచ్చు. ఉదాహరణకు, ఫార్మాస్యూటికల్ రంగం విదేశీ మారక ద్రవ్యాన్ని అధికంగా వినియోగించే రంగాలలో ఒకటి. ముఖ్యంగా, తుది వినియోగ ఫార్ములేషన్ల ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాల కోసం దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇక్కడ కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రాణరక్షక మందులకు, పునఃఎగుమతి ప్రయోజనాల కోసం ఉత్పత్తి చేసిన మధ్యంతర, ఫార్ములేషన్లకు ప్రాధాన్యత ఇవ్వవచ్చు.

సంఘర్షణ పరిస్థితులను ఎదుర్కోవడానికి కరెన్సీ నిల్వలతో ఒక ప్రత్యేక 'యుద్ధ నిధి'ని సృష్టించడం ఒక గొప్ప ఆలోచన కావచ్చు. వ్యూహాత్మక చమురు నిల్వల తరహాలోనే, సంఘర్షణ కరెన్సీ నిల్వలను ఎందుకు నిర్మించకూడదు? ఇటీవలే, ప్రధానమంత్రి మోదీ తన సంక్షిప్త పర్యటనలో, వ్యూహాత్మక చమురు నిల్వలను 36 మిలియన్ బ్యారెళ్ల మేర పెంచడానికి ఒక ఒప్పందం కుదిరింది.

ప్రతి సంవత్సరం, ఆర్‌బీఐ మిగులు నిధులలో కొంత భాగాన్ని యుద్ధ నిధి నిల్వలకు కేటాయించ వచ్చు. ఇది, ఆర్‌బీఐ ముడి చమురు నిల్వల వలె నిర్వహించే సాధారణ విదేశీ మారక నిల్వలకు అదనం. ఉదాహరణకు, రూ. 2.87 లక్షల కోట్ల మిగులు నిధులను ఆర్‌బీఐ ప్రభుత్వానికి డివిడెండ్‌గా బదిలీ చేస్తుంది. ఒకవేళ ప్రతి సంవత్సరం ఆర్‌బీఐ మిగులు నిధుల నుండి రూ. లక్ష కోట్లను ప్రత్యేక యుద్ధ నిధికి బదిలీ చేస్తే, బహుశా దీనిని సంఘర్షణ సంబంధిత ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కోవడానికి ఉపయోగించుకో వచ్చు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కరెన్సీల విషయంలో బహుళ మార్గాలను అనుసరించాల్సి రావచ్చు.



**కె.ఎ.బదరీనాథ్**
**డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్,**
**సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్**
**హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.**

కథ

కారు దిగి లోపలికి వస్తున్న నన్ను చూడగానే "వచ్చారా... సార్! మీ కోసమే ఎదురు చూస్తున్నాము. మూడు రోజుల నుండి మీరు రాకపోయేసరికి మీమీద దిగులు పెట్టుకున్నారేమో, మేడంగారు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టటం లేదు. మీకు ఫోన్ చేస్తుంటే 'నాట్ రీచ్‌బుల్...' అని వస్తుంది. మేడంగారిని చూస్తుంటే చాలా భయమేస్తుందండీ... చాలా 'వీక్' అయ్యారు..." సిస్టర్ మాటలకి.

"ఓ.. సారీ అండి... అర్జెంట్ పనిమీద 'బొంబే' వెళ్లాను. అక్కడ వర్షాలు ఎక్కువగా ఉండటాన 'సిగ్నల్స్' అందక ఫోన్ కలవలేదేమో.." అంటూ ఆవిడ వెంట రాగా హడావిడిగా మాధురి ఉన్న గదిలోకి నడిచాను.

పక్కకి తిరిగి పడుకొని ఉన్న మాధురిని చూస్తూ "మధూ...!"అంటూ పిలిచాను.

నాగస్వరం విన్న 'నాగిని'లా ఒక్కసారిగా ఇటు తిరిగింది.

కళ్లకింద నల్లటి వలయాలు... లోపలికి పోయిన కళ్లు, బుగ్గలు... పీక్కుపోయిన మొహంతో పదిరోజుల నుండి తిండిలేని దానిలా నీరసంగా ఉన్న మధుని చూడగానే జాలి, కోపం రెండూ ఒకేసారి కలిగాయి.

"తనకి తినిపించటానికి ఏదైనా పంపించండి... నేను దగ్గరుండి తినిపిస్తాను..." అని సిస్టర్‌కి చెప్పి... ఆమె వెళ్లగానే...

"ఏమిటి మధూ ఈ పిచ్చి పని.... రెండ్రోజులు వీలుకాక రాలేకపోతే తిండి మానేయాలా..? చూడు.. ఎలా అయిపోయావో..." అంటూ ప్రేమగా మందలించాను.

ఇంతలో సిస్టర్ భోజనం తీసుకురావటంతో మధుని మెల్లగా లేపి దిండుకి ఆనుకొని కూర్చోబెట్టి సిస్టర్ చేతిలోని ప్లేటు తీసుకొని స్పూన్‌తో కలిపి కొంచెం.... కొంచెంగా తినిపించసాగాను. బాగా ఆకలి మీదుందేమో నా మొహంలోకి దీక్షగా చూస్తూ పెట్టినదంతా తినేసింది.

మంచినీళ్లు తాగించి, మూతి తుడిచి "చూడు మధూ...! ఇంకెప్పుడు ఇలా పిచ్చి వేషాలేయకు. నీ ఎదురుగా కూర్చుని నీకు సేవలు చేయాలంటే కుదరకేగా ఎంత ఖర్చైనా నిన్నిక్కడ చేర్పించింది. ఇక్కడ అందరూ నిన్ను ఎంతో బాగా... జాగ్రత్తగానే చూసుకుంటున్నారు కదా! ఇంకేం కావాలి నీకు? త్వరగా కోలుకొని ఇంటికి రావాలని లేదా ఏమిటి...? పనులుండి వీలుకాక రాకపోతే ఇలా తిండి తినకుండా కూర్చుంటావా....? అస్తమానం నీ ఎదురుగా కూర్చోటానికి నాకు వేరే పనేం లేదా? నేనెంత బిజీగా ఉంటానో నీకు తెలుసు కదా? అన్నీ తెలిసి కూడా ఎందుకు ఇట్లా మూర్ఖంగా ప్రవర్తించి నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నావు? ఎవర్ని బెదిరించటానికి? ఏం సాధిద్దామని..?"

ఒక్క క్షణం తెల్లబోయింది నా మాటలకి... తర్వాత నన్ను చూడటం ఇష్టం లేనిదానిలా మొహం పక్కకి తిప్పుకుంది.

"మధూ...! నువ్విలా మొండిగా ప్రవర్తిస్తే ఎప్పటికి కోలుకుంటావు? జీవితాంతం ఇక్కడే ఉండి పోవాలనుకుంటున్నావా ఏమిటి....? ఇదుగో... ఇప్పుడే చెబుతున్నా... ఇంకోసారి ఇలా తిండి, నీళ్లు మానేసి చిన్న పిల్లలా అలకలు సాగించావంటే నీ దగ్గరికి రాను కూడా రాను...." కోపంగా బెదిరించాను.

అంతే...ఎడం చేత్తో స్టూలు మీదున్న గ్లాసుని కిందికి విసిరి కొట్టింది. చివ్వున నావైపు తిరిగింది. ఆవేశంతో గుండెలెగసి పడుతున్నాయి. ఆ కళ్లల్లో కోపంతో కూడిన ఎర్రటి జీరలు మా నలభై ఏళ్ల వైవాహిక జీవితంలో ఎన్నడూ చూడని ఆ కోపం, ఆవేశం చూసి ఒక్కక్షణం బిత్తరపోయాను. అంతలోనే తమాయించుకొని అక్కడుండటం ఇష్టం లేనివాడిలా బయటకు నడిచాను.

"సార్... డాక్టర్‌గారు మిమ్మల్నోసారి వచ్చి కలవమన్నారు..."



# అంతర్మథనం

కె. రాజేశ్వరి



సిస్టర్ చెప్పటంతో డాక్టర్‌గారి రూంలోకి వెళ్లాను.

"నమస్తే డాక్టర్..." అని విష్ చేయగానే "రండి... రమాకాంత్‌గారూ...! కూర్చోండి..." అన్నారు.

బుద్ధిగా వెళ్లి ఆమెకి ఎదురుగా ఉన్న ఛైర్లో కూర్చున్నాను.

"చూడండి... నాకు తెలిసి మీ భార్య తన జీవితంలో ఇప్పటి వరకు ఎటువంటి అనారోగ్యానికి గురికాలేదు కదూ...?"

అన్నీ తెలిసి అలా ఎందుకు అడుగుతున్నారో అర్థంకాక అయోమయంగా చూస్తూ "అవునండి..." అన్నాను.

ఇంట్లో అన్ని పనులు బాధ్యతగా చూసుకొంటూ, ఎంతో చలాకీగా...ఉత్సాహంగా ఉండే మీభార్య ఒక్కసారిగా 'పెరాలసిస్' వచ్చి కాలు చెయ్యి పనిచేయకపోతే ఆమె మానసిక పరిస్థితి ఎలా ఉంటుందో మీరు ఊహించుకోగలరా? తన బాధ చెప్పుకోవటానికి మాట స్పష్టత లేదు. కాలు, చెయ్యి సరిగా వస్తాయో రావో తెలియదు. 'ఎన్నాళ్లకి లేచి తిరగగలుగుతానో! ఇలా ఇతరుల చేత సేవలు చేయించుకొంటూ జీవితాంతం మంచానికే అంకితమైపోతానా.? 'అన్న ఆలోచనలతో, దిగులుతో మీభార్య ఎంతగా కృంగిపోతుందో, మానసికంగా ఎంత వేదనపడుతుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా...?'

ఆమె అలా సూటిగా అడిగేసరికి ఏం మాట్లాడాలో తెలియక తలొంచుకున్నాను.

'ఒక్క మీ భార్యే కాదు, ఇలాంటి పరిస్థితిలో ఉన్న ఏ పేషెంటు మానసిక స్థితి అయినా ఇలానే ఉంటుంది. జీవితం మీద విరక్తి కలుగుతుంది. మృత్యువు కోసం ఎదురు చూస్తుంటారు.

వాళ్లు త్వరగా కోలుకోవాలంటే వాళ్లని విసుక్కోకుండా, పసిపిల్లల్లా... లాలనగా, ప్రేమగా చూడాలి. 'మీకు మేమున్నాం..' అంటూ మానసిక ధైర్యాన్నివ్వాలి. మా డాక్టర్లు... సిస్టర్స్ ఎంత మంచి 'ట్రీట్‌మెంట్ ఇచ్చి, ఎంత బాగా చూసుకున్నా 'నా' అనే వాళ్ల ప్రేమ, ఆప్యాయతలే వాళ్లని బాగా కోలుకొనేలా చేస్తాయి.

ఇంటి దగ్గరైతే మీరు రోజూ కనిపిస్తూ, పలకరిస్తూ ఉంటారు. అలవాటైన ఇంటి పరిసరాలు, ఆ వాతావరణం తనకి మానసికంగా ఎంతో బలాన్ని, ధైర్యాన్ని, ఊరటనిస్తాయి. పైగా, హాస్పిటల్ వాతావరణంలో అందరూ మనశ్శాంతిగా, స్థిమితంగా ఉండలేరు. మీరు రోజూ రావాలన్నా మీకుండే పనుల వలన కుదరకపోవచ్చనే 'ఇక్కడున్నా చేసేదేం లేదు. ఇంటికి తీసికెళ్లి 'ఫిజియోథెరపి' చేయిస్తూ మందులు కంటిన్యూ చేస్తాను' అని ఇంటికి తీసుకువెళ్లారు.

మీరు గమనించారో, లేదో కాని ఇంటి దగ్గరున్న వారం రోజుల్లోనే తనలో ఎంతో మార్పు వచ్చింది. ఆ మొహంలో ఏదో తెలియని మెరుపు. ప్రశాంతత, పెదవుల మీద చిరునవ్వు. బుగ్గల్లో నిగారింపు చూసి నేనే ఆశ్చర్యపోయాను. అయితే మీకు ఇంట్లో ఇబ్బందిగా ఉంటుందని మళ్లీ తీసుకొచ్చి ఇక్కడే జాయిన్ చేస్తిరి. వచ్చి కూడా వారం దాటింది. ఈ వారంలో ఆమె ఎలా అయిపోయారో గమనించారా మీరు? ఆ కళ్లల్లో దిగులు తప్ప, ఆ మొహంలో చిరునవ్వుని చూడగలిగారా? మూడు రోజులుగా మీరు కనిపించకపోయే సరికి తిండి, నీళ్లు, నిద్ర మానేసి జీవంలేని దానిలా, ఓ పిచ్చిదానిలా ఎలా తయారయ్యారో మీరే చూశారు కదా! ఆమెనిలా చూస్తుంటే మీకెలా ఉందోకాని, మేము మాత్రం తట్టుకోలేకపోతున్నాము.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఇంతకు ముందు సీరియస్‌గా ఉన్న ఒక పేషెంట్‌ని చూసి వస్తూ....మీ గది ముందుకి రాగానే అనుకోకుండా మీరు మీ భార్యతో అంటున్న మాటలు విన్నాను. మీ పర్సనల్ సమస్యలు ఎన్ని ఉన్నా తన ముందు ఇలా చిరాకుపడకూడదండీ! అయిన వాళ్ల ప్రేమ, అభిమానం, ఆత్మీయమైన పలకరింపులే మందుల కన్నా ఇలాంటి పేషెంట్ల మీద త్వరగా ప్రభావితం చూపించి కోలుకొనేలా చేస్తాయి. ఒకరి నెల రోజులు మీ పనులన్నీ పక్కనపెట్టి దగ్గరుండి ఆమెని జాగ్రత్తగా చూసుకోండి. తనలో ఎంత మార్పు వస్తుందో మీరే చూస్తారు. ఆమె మానసిక పరిస్థితి తెలిసిన మీ ఫ్యామిలీ డాక్టరుని కాబట్టి ఇంతగా చెబుతున్నాను. ఇలా చెప్పానని మరోలా భావించకండి...."

* * *

ఇంటికి రాగానే ఏదో నీరసం,నిస్సత్తువ ఆవహించినట్లైంది. తలంతా ఏదో దిమ్ముగా, మనసంతా తెలియని ఆందోళనతో నిండిపోయింది. బట్టలు కూడా మార్చుకోకుండానే అలాగే పడుకుండిపోయాను. ఇల్లంతా ఏదో శూన్యంగా, వెలితిగా అనిపించింది. డాక్టర్ చెప్పిన మాటలు పదే పదే గుర్తొచ్చి నిద్ర కూడా కరువైంది.

సడెన్‌గా నా చూపు ఎదురుగా గోడమీదున్న మా పెళ్లి ఫొటోమీద పడింది.

ఎంతో అమాయకంగా,అరవిచ్చిన మందారంరా, ముగ్ధ మనోహరంగా మెళ్లో పూలదండతో నా పక్కన నిలబడి ఉన్న మాధురిని చూడగానే ఒక్కసారిగా గతమంతా కళ్లముందు నిలిచింది.

ఇరవై ఏళ్ల వయసులో నా చిటికెనవేలు పట్టుకొని నా అడుగులో అడుగేసు కొంటూ నా ఇంట్లో కాలు పెట్టింది మాధురి. అప్పటి నుండి అమ్మతో పాటు చీకటితోనే నిద్రలేచి, ప్రతి పనిలో అమ్మకి ఎంతో సాయంగా ఉంటూ, ఇంట్లో అందరితో స్వంత మనిషిలా కలిసిపోయింది. తమ్ముడి, చెల్లి పెళ్లిళ్లు, సీమంతాలు, బారసాలలు, నోములు, వ్రతాలు అంటూ ఒకటేమిటి....ఇంట్లో ఏ వేడుక జరిగినా అలుపనేది లేకుండా, ఎంతో చలాకీగా ప్రతి పనిలో తానే ముందుండేది. తమకి పుట్టిన ఇద్దరి పిల్లల ఆలనా, పాలనా, చదువులు, స్కూలు ఫీజులు, ఆరోగ్యం బాగా లేకపోతే హాస్పిటల్‌కి తీసికెళ్లటం దగ్గరుండి... అంతా తానే చూసుకుంది. ఆఖరికి పిల్లలకి మంచి సంబంధాలు చూసి పెళ్లి చేసే విషయంలో కూడా తనే బాధ్యత తీసుకుంది. ఇంట్లోకి అవసరమైన డబ్బులిస్తూ, సెంటర్‌లో ఉన్న తన 'గోల్డు షాపు'ని చూసుకోవటం తప్ప ఇంటి విషయాలు ఏనాడూ పట్టించుకోలేదు నేను.

'హార్ట్ ఎటాక్'తో సడెన్‌గా అమ్మ చనిపోతే ఆ దిగులుతో మంచాన పడ్డ నాన్నను కూడా పసి పిల్లవాడిని చూసినట్లు చూసుకుంది. స్నానం

చేయించటం దగ్గర్నుండి, టైముకి భోజనం తినిపించి మందులేయటం వరకు అన్నీ తనే చూసుకుంది.

“ఒక్కదానివే చేయలేవు. ఎవరినైనా మనిషిని ఏర్పాటుచేస్తా....” అంటే జీతానికి చేసేవాళ్లు స్వంత మనుషుల్లా, బాధ్యతగా ఎందుకు చూసుకుంటా రండీ? మా నాన్నగారికైతే చెయ్యనా ఏమిటి...? మామయ్యగారు నా తండ్రిలాంటి వారు... నాకేం ఇబ్బంది లేదు.. ఇంకెప్పుడూ మీరలా మాట్లాడకండి...” అన్నది.

అంతదాకా ఎందుకు. అనుకోకుండా యాక్సిడెంట్ జరిగి నా కుడికాలి తొంటికి ఆపరేషన్ జరిగితే నెలరోజుల వరకు మంచం మీద నుండి దిగనీయకుండా ఎంత సేవ చేసింది! ‘బెడ్‌పాన్’ పెట్టి మలమూత్రాలు ఎత్తిపోసి క్లీన్ చెయ్యటం, వీల్ ఛెయిర్లో కూర్చోబెట్టి బాత్‌రూంకి తీసికెళ్లి స్నానం చేయించటం, వేళకి టిఫిను, భోజనం, మందులు వేయటం దగ్గర్నుండి విసుగనేది లేకుండా, నవ్వుతూ... ఎంత ప్రేమగా సేవలు చేసింది. వాకర్‌తో మెల్లిమెల్లిగా నాలుగడుగులు వేయిస్తూ, కాలు బాగా తగ్గి నా అంతట నేను నడిచేవరకు నా వెన్నంటే ఉండి నాకెంత ధైర్యాన్నిచ్చింది.

ఎప్పుడు చూసినా గలగలా మాట్లాడుతు ఇల్లంతా ఎంతో హుషారుగా తిరుగుతూ అన్ని పనులు తనే చూసుకొనే మధు ఇప్పుడలా సడెన్‌గా ‘పెరాలసిస్’ వచ్చి కాలు, చెయ్యి పడిపోయి మంచానికి అంకిత మవటం అంటే నిజంగా ఎంత బాధ!. ఎంత నరకం! తన బాధ ఎవరికైనా చెప్పుకోవటానికి నోరు కూడా పడిపోయిందే! అలాంటి మధుని దగ్గర్నుండి ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకోవాల్సింది పోయి ఎంత మూర్ఖంగా, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాను... ఇంట్లో ఉన్న వారం రోజుల్లోనే ‘కేర్ టేకర్’ వచ్చి ‘డైపర్’ మార్చటం ఓ అరగంట లైటేతే ఎంతగా విసుక్కొనేవాడినో! నాకు, నా కుటుంబానికి ఇంత చేసిన మధుకి నేనేం చేశాను? నా బిజినెస్ పనుల మీద ఊళ్లు తిరగాల్సి వస్తుందని... ఇంట్లో ఒకదాన్నే ఉంచలేక మళ్లీ హాస్పిటల్‌కి తీసుకొచ్చాను.

తనకి ‘పెరాలసిస్’ వచ్చిందని తెలిసి అమెరికాలో ఉన్న కూతురు, కొడుకు వచ్చి ఓ పదిరోజులుండి వెళ్లారు. బంధువులు వచ్చి చూసి వెళ్లిపోయారు.... ఎవరు మాత్రం వాళ్ల వాళ్ల పనులు మానుకొని ఎన్నాళ్లని వచ్చి ఉంటారు? కట్టుకున్న వాడిని నేనే నా బిజినెస్ పనుల కోసం తనని సరిగా పట్టించుకో పోతే బంధువులకి, బయటవాళ్లకి ఏం అవసరం? అయినా, ఇంకా ఈ వయసులో నాకీ బిజినెస్ అవసరమా;? సంపాదించి ఏం చెయ్యాలి? ఎవరికి ఇవ్వాలి? పిల్లలిద్దరు అమెరికాలో కోట్లు గడిస్తున్నారు. వాళ్లకి ఇక్కడున్న నా ఆస్తులు అవసరం కూడా లేదు. అలాంటప్పుడు ఇంకా నాకెందుకీ డబ్బు తాపత్రయం? ఎంత సంపాదిస్తే తృప్తి అనేది



తనకి ‘పెరాలసిస్’ వచ్చిందని తెలిసి అమెరికాలో ఉన్న కూతురు, కొడుకు వచ్చి ఓ పదిరోజులుండి వెళ్లారు. బంధువులు వచ్చి చూసి వెళ్లిపోయారు.... ఎవరు మాత్రం వాళ్ల వాళ్ల పనులు మానుకొని ఎన్నాళ్లని వచ్చి ఉంటారు? కట్టుకున్న వాడిని నేనే నా బిజినెస్ పనుల కోసం తనని సరిగా పట్టించుకోపోతే బంధువులకి, బయటవాళ్లకి ఏం అవసరం?

ఉంటుంది? ఉద్యోగస్తులైతే ఈ పాటికి ఎప్పుడో రిటైరై ఇంట్లో కూర్చుని ప్రశాంత జీవనం గడిపేవారు. మా వ్యాపారస్తులకి రిటైర్మెంట్ అనేవి ఉండదుగా. బతికినన్నాళ్లు ఇంకా... ఇంకా సంపాదించాలనే కోరుకుంటాము. ఈ సంపాదనకి మితం, అంతం అనేవి ఉండవేమో! రెండు తరాలు తిన్నా తరగనంత ఆస్తి ఉంది. ఇంకా నాకెందుకీ తాపత్రయం?డబ్బు సంపాదనలో పడి ఇన్నాళ్లు మా కోసం తన సర్వస్వాన్ని ధారవోసిన ‘నా మధు’ని ఎందుకు దూరం చేసుకోవాలి? పుట్టింటికి వెళ్లినా ‘నాకు ఇబ్బంది...’ అని రెండ్రోజులు కూడా ఉండకుండా వచ్చేసేది. ఏనాడూ కూడా తనకి ‘ఇది కావాలి..’ అని అడిగింది లేదు. ఈ రోజు కూడా తనున్న పరిస్థితి ‘నేను ఎదురుగా ఉంటే చాలు...’ అనుకుంటుంది. ఇప్పుడు కూడా ఒకరికొకరం అండగా ఉండకపోతే పెళ్లి నాటి ప్రమాణాలకి విలువేం ఉంటుంది? భార్యాభర్తల అనుబంధానికి అర్థమేం ఉంటుంది?

ఇప్పుడు నాకు డెబ్బై. తనకి అరవై ఐదు. దాదాపు జీవితపు చరమాంకానికి వచ్చినట్లే. ఎవరు ముందో! ఎవరు వెనకో! అలాంటప్పుడు ఉన్నన్నాళ్లు ఒకరి కోసం ఒకరం ఎంతో ప్రేమగా, బాధ్యతగా ఉంటే... అంతకన్నా ఈ జన్మకింక ఏం కావాలి...?

మధూ లేని ఇల్లు ఎంతో బోసిగా... శ్మశాన వైరాగ్యాన్ని తలపిస్తుంది. ఒంటరితనం భరించలేక పోతున్నాను. ఒంటరితనాన్ని మించిన నరకం లేదేమో. అది అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది. అలవాటైన ఇంట్లోనే నేనింత ఒంటరితనాన్ని అనుభవిస్తుంటే అక్కడ... ఆ హాస్పటల్లో ‘నా’ అనే వాళ్లు లేక... దిక్కులేని దానిలా మధు ఎన్నాళ్లని ఉంటుంది? ఒకవేళ... ఒకవేళ.... మధు పరిస్థితిలో నేనే ఉంటే... తను నన్నిలాగే వదిలేసి ఉండేదా...?

ఆ ఆలోచన నా మనసుని అతలాకుతలం చేసింది. కాసేపు దీర్ఘంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. అవును... అలాగే చేయాలి.

రేపే వెళ్లి నా మధుని ఇంటికి తీసుకొచ్చి జాగ్రత్తగా చూసుకోవాలి. తను ఇంట్లో ఉంటే నాకూ తోడుగా ఒకరున్నారన్న ధైర్యం ఉంటుంది. నేను తన పక్కనే ఉండి ఏదో ఒకటి మాట్లాడుతుంటే మధు ఎంతో సంతోషిస్తుంది. తనకంటే నాకీ బిజినెస్ ఎక్కువేం కాదు. తెల్లారగానే మేనేజర్‌కి ఫోన్ చేసి చెప్పేయాలి. “షాపు అమ్మేస్తానని, రేపటి నుండి షాపుకి రానని, అమ్ముడు పోయేవరకు తననే జాగ్రత్తగా చూసుకోమని....” అసలు ఈ నిర్ణయం మధుకి బాగా లేనప్పుడే తీసుకోవాల్సింది. ఆలస్యం చేసి చాలా తప్పు చేశాను....

ఈ నిర్ణయం తీసుకోగానే తలమీద నుండి ఏదో పెద్ద భారం దిగిపోయినట్లు మనసంతా ఎంతో తేలిగ్గా...హాయిగా...ప్రశాంతంగా అయింది.

ఆనందంగా పెళ్లి ఫోటోవైపు చూస్తూ “మధూ...! తెల్లారగానే నీ కోసం వచ్చేస్తున్నా...నిన్ను ఇంటికి తీసుకొచ్చి నా గుండెలకి హత్తుకొని పసి పాపలా చూసుకుంటాను. నేనే స్వయంగా నీ కాలికి, చేతికి మసాజ్ చేసి, వాకర్‌తో నడిపిస్తాను. రోజంతా నీ ఎదురుగా కూర్చుని బోలెడన్ని కబుర్లు చెబుతాను. సాయంత్రాలు ‘వీల్ ఛెయిర్లో’ కూర్చోబెట్టి బోలెడన్ని కబుర్లు చెబుతాను. ‘వీల్ ఛెయిర్లో’ కూర్చోబెట్టి, పెరట్లో నువ్వు ఎంతో ప్రేమగా పెంచుకొంటున్న మొక్కల దగ్గరకి తీసికెళ్తాను... నువ్వు కాస్త కోలుకున్నాక తీర్థయాత్రలన్నీ తిరిగి వద్దాము. నిజం మధూ.... నీ మీద ఒట్టు... నన్ను నమ్ము....”

పట్టలేని ఆనందంతో మనసులోనే మధుతో మాట్లాడుతూ... మాట్లాడుతూ.. ‘ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా....’ అని ఎదురు చూస్తూ నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

సెల్ మోగటంతో ఉలిక్కిపడి లేచాను. కిటికీలో నుండి పడుతున్న సూర్య కిరణాలని చూసి ‘అమ్మో.... బాగా తెల్లారిపోయిందే! ఇంతసేపు పడుకున్నా నేమిటి...?” అనుకొంటూ గబగబా మంచం దిగి డ్రెస్సింగ్ టేబుల్‌మీదున్న సెల్ తీసుకొని

“హలో....” అన్నాను.

“సార్...! రాత్రి మీరు వెళ్లిపోయిన దగ్గరుండి మేడంగారు ఒకటే ఏడుపు. ఎంత మందిమి, ఎంతగా ఓదార్చినా వినలేదు. మీరు తినిపించిన భోజనం కూడా వాంతి చేసుకున్నారు. ఇప్పుడు ‘బ్రష్’ చేయించి మెడిసిన్స్ ఇద్దామని వచ్చి లేపుతుంటే మేడం గారు లేవలేదు.వెంటనే డాక్టర్ గారిని పిలిస్తే వచ్చి చూసి...” ప్రాణం పోయి ఒక గంటైంది...” అన్నారు.

అంతే...అవతల ఏం చెబుతున్నారో... నా చేతిలో నుండి సెల్ ఎప్పుడు జారిపోయిందో తెలీదు... నా నోటి నుండి ‘మధూ....” అన్న ఒక్క వెర్రి కేక తప్ప. ★

ఎంత సాధించినా ఇంకా సాధించాల్సింది మిగిలే ఉంటుందనడానికి సాకర్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు మించిన నిదర్శనం మరొకటి ఉండదు. తన దేశం పోర్చుగల్‌కు 'ఫీఫా' ప్రపంచ కప్ అందించాలన్న లక్ష్యంతో 41 సంవత్సరాల లేటు వయసులో ప్రపంచ కప్-2026 సమరానికి సిద్ధమయ్యాడు. జూన్ 11 నుంచి నెలరోజులపాటు సాగే ఈ క్రీడా సమరంలో అర్హత రౌండ్ల నుంచి ఫైనల్ రౌండ్‌కు చేరిన మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించి లీగ్ దశ పోటీలను నిర్వహించనున్నారు.



# రొనాల్డోకి ఆరోసారైనా 'కప్' దక్కేనా?

రంగం ఏదైనా లక్ష్యసాధనకు వయసుతో ఏమాత్రం సంబంధం ఉండదని పలు సందర్భాలలో తేటతెల్లమయ్యింది. ఆ పరంపరలో భాగంగా 41 ఏళ్ల పోర్చుగల్ సాకర్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తన జట్టును విశ్వవిజేతగా నిలపడానికి సమాయత్తమయ్యాడు. కెనడా, అమెరికా, మెక్సికో దేశాల సంయుక్త ఆతిథ్యంలో జూన్ 11న ప్రారంభమయ్యే ఫీఫా ప్రపంచకప్-2026 ఫుట్‌బాల్‌లో తలపడే తమ దేశ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు.

**ఆరో ప్రపంచ కప్‌తో రికార్డు....**

రెండున్నర దశాబ్దాల ఫుట్‌బాల్ క్రీడా జీవితంలో ఎన్నో ఘనతలు, మరెన్నో రికార్డులు, తనకే సాధ్యమైన విజయాలు, అవార్డులు సాధించిన క్రిస్టియానో రొనాల్డోకు ఫీఫా ప్రపంచకప్ మాత్రం అందని ద్రాక్షలా తయారయ్యింది. ప్రతిష్ఠాత్మక యూరోపియన్ కప్, నేషన్స్‌కప్ లాంటి తన దేశానికి అందించిన రొనాల్డో ఇప్పటివరకూ ఐదు వేర్వేరు ప్రపంచకప్ టోర్నీలలో స్వదేశ జట్టుకు ప్రాతినిథ్యం వహించినా ఒక్కసారీ విజేతగా నిలుపలేకపోయాడు.

18 సంవత్సరాల ప్రాయంలోనే పోర్చుగల్ జాతీయ జట్టులో చోటు సంపాదించిన రొనాల్డో 21 ఏళ్ల వయసులో తొలిసారిగా ప్రపంచకప్‌లో (2006) పాల్గొన్నాడు. ఆ తర్వాత నుంచి ప్రపంచకప్ ఫైనల్ రౌండ్‌కు పోర్చుగల్ అర్హత సాధించిన ప్రతిసారీ పాల్గొంటూ వచ్చాడు. తన జట్టుకు ప్రపంచ కప్ సాధించి పెట్టాలనే ధ్యేయంతో 2006, 2010, 2014, 2018, 2022 ప్రపంచకప్ టోర్నీలలో పోటీ పడినా ఆతని కలలు సాకారం కాలేదు. అయితే.. ఆశలను సజీవంగా ఉంచుకొంటూ, ఫీఫా ప్రపంచ కప్-2026 పోటీలకు సిద్ధమవుతున్నాడు. అర్జెంటీనా సాకర్ మాంత్రికుడు లయనల్ మెస్సీ, మెక్సికో గోల్ కీపర్ గులెర్మో సైతం ప్రపంచకప్‌లో పోటీకి దిగడం ద్వారా రొనాల్డో సరసన నిలువ నున్నారు.

**అరుదైన రికార్డుల సూపర్ స్టార్....**

పోర్చుగీస్ థండర్ క్రిస్టియానో రొనాల్డోకు పలు అరుదైన రికార్డులతో అవినాభావ సంబంధం ఉంది. 37 సంవత్సరాల వయసులో వరుసగా ఐదో ప్రపంచకప్‌లో పాల్గొన్న ఆతనికి 8 గోల్స్ సాధించిన ఘనత ఉంది. ఖతర్ రాజధాని దోహా స్టేడియంలో 974 వేదికగా జరిగిన 2022 ప్రపంచకప్ గ్రూప్-హెచ్ ప్రారంభమ్యాచ్‌లో ఘనాపై తొలి గోలు సాధించడం ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఐదు వేర్వేరు ప్రపంచకప్ టోర్నీలలోనూ గోల్స్ సాధించిన మొట్టమొదటి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. బ్రెజిల్ దిగ్గజం పీలే, జర్మన్ జోడీ సీలర్, మిరోస్లావ్ క్లోజ్‌ల పేరుతో గల సంయుక్త రికార్డును రొనాల్డో అధిగ మించాడు. పై నలుగురు సాకర్ దిగ్గజాలు నాలుగు వేర్వేరు ప్రపంచకప్ టోర్నీలలో గోల్స్ సాధిస్తే.. రొనాల్డో మాత్రం ఐదు వేర్వేరు ప్రపంచకప్ టోర్నీలలో అరుదైన ఈ ఘనత సాధించిన మొనగాడిగా నిలిచాడు.

**200కు పైగా మ్యాచ్‌ల మొనగాడు..**

ఇప్పటికే అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలలో పోర్చుగల్ తరపున 200 మ్యాచ్‌లు ఆడటం ద్వారా రొనాల్డో మరో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. కువైట్‌కు చెందిన బాదెర్ అల్ ముతావ(196 మ్యాచ్‌లు) రికార్డును అధిగమించాడు. వెయ్యికి పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మొనగాడిగా రికార్డు సైతం క్రిస్టియానో రొనాల్డో పేరుతోనే ఉంది. 2002- 2026 మధ్యకాలంలో స్పోర్టింగ్, రియల్ మాడ్రిడ్, మాంచెస్టర్ యునైటెడ్, పోర్చుగల్, యువెంటస్, అల్ నాసర్ క్లబ్ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తూ.. 1000 అంతర్జాతీయ మ్యాచ్‌ల మైలు రాయిని చేరుకోగలిగాడు.

**గిన్నిస్ బుక్‌లోకి....**

పోర్చుగల్ జట్టు సభ్యుడిగా ఇప్పటికే 118కి పైగా గోల్స్ సాధించిన రొనాల్డో వెయ్యికి పైగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 900కు పైగా గోల్స్ సాధించడం ద్వారా తనకు తానే సాటిగా నిలిచాడు. ఆతను సాధించిన మొత్తం గోల్స్‌లో 457 గోల్స్ 12 రకాల టోర్నీల ద్వారా సాధించినవే కావడం విశేషం. ఫుట్‌బాల్ ఆడిన మొత్తం సమయంలో ప్రతి 112 నిముషాలకు ఓ గోల్ చొప్పున సాధించడం ఓ రికార్డు.

**ప్రపంచ కప్ గెలుపు అంతతేలికకాదు...**

204 దేశాలు తలపడే ఫీఫా ప్రపంచ కప్ ట్రోఫీని సాధించడం అంత సులువు కాదు. కేవలం ఒకరిద్దరు ప్రతిభావంతులైన ఆటగాళ్లతో జరిగే పని అసలే కాదు. జట్టులోని సభ్యులంతా సమాన ప్రతిభ కలిగి, జట్టు నిలకడగా రాణించగలిగితేనే విశ్వవిజేతగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గ్రూప్-కె లీగ్‌లో కొలంబియా, కాంగో, ఉజ్బెకిస్థాన్ జట్లతో పోర్చుగల్ తలపడటం ద్వారా తన టైటిల్ వేటకు శ్రీకారం చుట్టనుంది. 2016 యూరోకప్‌ను తన దేశానికి అందించిన రొనాల్డో.. 2026 ఫీఫా ప్రపంచ కప్‌ను తన ఆరవ ప్రయత్నంలోనైనా అందించ గలిగితే ప్రపంచ మేటి ఫుట్‌బాల్ ఆటగాడిగా తన జీవితాన్ని పరిపూర్ణం చేసుకోగలుగుతాడు.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969




**కామారెడ్డి :** నేటి సమాజంలో ప్రతి మహిళకు ఈ ప్రశిక్షణ అవసరమని, ప్రతి స్త్రీ తనను తాను రక్షించుకుంటూ సమాజ పరిరక్షణకు పాటుపడాలని లింగంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బొందుగుల వనిత అన్నారు. రాష్ట్ర సేవికాసమితి తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ఎస్పిఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మే 16న జరిగిన సమితి శిక్షావర్గలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సేవికా సమితి తెలంగాణ ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ ప్రసంగిస్తూ హిందూత్వాన్ని ఆచరణలోకి తీసుకుని వచ్చే పని సమితి చేస్తున్నదని అన్నారు. కార్యకర్తలు స్థిరంగా నిత్యనిరంతర సాధనచేయాలి, సమస్యలకు బెదరక, వైఫల్యాలకు కుంగిపోక, ప్రశంసలకు పొంగకుండా ముందుకు సాగాలని అన్నారు. మాతృశక్తిని జాగృతం చేసి వారిలో అష్టభుజాదేవీ తత్త్వాన్ని హృదయంలో అధిష్టింపచేసి, ఆచరణలో అనుష్టింప చేయాలని, తేజోవంతమైన హిందూ దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. మే 2 నుండి 17 వరకు ప్రబోధ్ శిక్షావర్గ, విశేష గృహిణి వర్గ, ఘోష్ వర్గ ఏడురోజులు జరిగింది. ఈ వర్గలలో మొత్తం 50 మంది పాల్గొన్నారు. సార్వజనికోత్సవంలో శిక్షార్థినులు ప్రదర్శించిన శారీరిక్ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.




**సికింద్రాబాద్ :** మే 23న మల్కాజ్‌గిరిలోని ఛత్రపతి శివాజీ పార్క్, మారుతినగర్‌లో జరిగిన హిందూ సమ్మేళనంలో విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీతా రామ్మోహన్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయులు రాకాసుధాకర్ ప్రసంగించారు.




**అనంతపురం :** రాష్ట్ర సేవికాసమితి ప్రవేశ శిక్షా వర్గ మే 2 నుండి 17వ తేదీ వరకు 15 రోజులపాటు అనంతపురం శ్రీవివేకానంద జూనియర్ కాలేజ్‌లో జరిగింది. మానసికంగా, శారీరకంగా క్షమతలను పెంచుకొని దేశ నిర్మాణంలో మహిళా శక్తి పాత్రను పెంచడానికి యువత, గృహిణిలు వివిధ రకాల యుద్ధ కళలతోపాటు శారీరక్ అంశాలలో శిక్షణ పొందుటకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుండి 50 మంది పాల్గొన్నారు.

మే 17న జరిగిన సార్వజనికోత్సవంలో ముఖ్యఅతిథిగా జెఎన్‌టియు ప్రొఫెసర్ పద్మసువర్ణ, అఖిల భారత ఘోష్‌ప్రముఖ్ పంకజవల్లి పాల్గొన్నారు.

పంకజవల్లి ప్రసంగిస్తూ సమాజంలో మనందరి మనసులు ఒకటై కలిసిమెలిసి జీవించాలని అన్నారు. ఐకమత్యం ద్వారా భారత్ పునర్వైభవ స్థితిని పొందుతుందని, తద్వారా "తేజోవంతమైన హిందూ దేశ పునర్నిర్మాణ ధ్యేయాన్ని సాధించగలమని తెలిపారు.



# త్యాగం, సేవ, దేశభక్తి సంగమమే సంఘం



**భాగ్యనగర్:** స్వాతంత్రోద్యమ కాలంలోను, దేశవిభజన సమయంలోను జాతికి స్వయంసేవకులు అండగానిలిచారని, విపత్తులవేళ ప్రజలకు తోడై ఆకలితీర్చడంతోపాటు ఔషధాలు అందించి, అంతిమ సంస్కారాలు సైతం చేసిన సందర్భాలను తాను కళ్లారాచూశానని, కేవలం దేశభక్తి గలవారు మాత్రమే ఈ పని చేయగలరని లోహియా గ్రూప్ అధినేత కన్హయ్యలాల్ అన్నారు. మే 22న భాగ్యనగర్‌లోని నాదరగుల్ విద్యాభారతి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సంఘ శిక్షావర్గ (సామాన్య) – సార్వజనికోత్సవంలో ముఖ్య అతిథిగా కన్హయ్యలాల్ లోహియా పాల్గొని ప్రసంగిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లుగా దేశం కోసం నిస్వార్థసేవ చేస్తూ స్వామి వివేకానంద ఆశించిన యువశక్తిని తయారు చేస్తోందని, రాష్ట్రచేతనకు నడుంబిగించిన స్వయం సేవకుల ముఖాలలో ఆ చైతన్యాన్ని తాను చూస్తున్నానని ప్రశంసించారు. తెలంగాణ ప్రాంత సహ కార్యవాహ ఎర్ర నర్సింగ్‌రావు మాట్లాడుతూ సువిశాలమైన, సుసంపన్నమైన భారతదేశం కేవలం గుప్పెడు మంది ఆంగ్లేయుల చేతుల్లో బందీ కావడాన్ని తరచుగా డాక్టర్‌జీ ప్రశ్నించుకుంటూ చివరికి హిందూసంఘటనే సరైన మార్గమని నమ్మి, 1925లో సంఘాన్ని ప్రారంభించారని అన్నారు. ఎన్నో పరిహాసాలు, అడ్డంకులను దాటి వంద సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సమయానికి సంఘం సమాజ ఆదరణకు నోచుకుంటున్నదని తెలియజేశారు. సంఘంలోని నిత్యశాఖ శక్తి కేంద్రంగా వ్యక్తి నిర్మాణం ద్వారా సంస్కారాలతో యువతను తీర్చిదిద్దుతున్నదని తెలిపారు. త్రేతా యుగంలో యజ్ఞస్థలం శక్తికేంద్రంగా ఉండేదని, నేడు శాఖ అటువంటి సామాజిక శక్తికేంద్రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సంఘ చాలక్ డాక్టర్ వామన శనై, తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బర్ల సుందర్‌రెడ్డి, వర్గ సర్వాధికారి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. మే 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన ఈ వర్గలో 260మంది శిక్షార్థులు పాల్గొన్నారు. సార్వజనికోత్సవంలో స్వయంసేవకుల శారీరక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 743 మంది సార్వజనికోత్సవాన్ని వీక్షించారు.




**భువనగిరి :** ఆలేరులో మే 21న జరిగిన జాగృతి వీక్లీ పాఠకుల సమావేశంలో పత్రికను నియమితంగా వితరణ చేస్తున్న పోస్ట్‌మెన్‌లను సన్మానిస్తున్న భువనగిరి జిల్లా సహసంఘచాలక్ బండిరాజుల శంకర్, సమరసతా ప్రముఖ్ దూడల వెంకటేశ్, జాగృతి మేనేజింగ్ ఎడిటర్ దుర్గారెడ్డి, ఆలేరు జాగృతి మిత్ర బృందం.

# బాల జాగృతి



## మోసానికి మోసం | కథ



ఆహారం దొరక్క నకనకలాడుతోంది ఓ నక్క. దాంతో ఒక పథకాన్ని ఆలోచించింది. ఒక కొలను ఒడ్డుకుపోయి తచ్చాడసాగింది. సూర్య కిరణాలు నడినెత్తికి రావడంతో చిన్నచిన్న జంతువులన్నీ ఆహార సంపాదనకు బయటకు వచ్చాయి.

'మిత్రులారా! బద్ధకం భవిష్యత్తును నాశనం చేస్తుంది. వేకువనే మేల్కొని పనులు చేసుకోవడం మంచి పని' అంటూ అటుగా పోతున్న కుందేళ్ల గుంపును ఉద్దేశించి హితవాక్యాలు చెప్పింది నక్క. 'నిజమే కాని చలి మమ్మల్ని బయటకు రానివ్వడం లేదు!' అని సమాధానమిచ్చాడు కుందేళ్ల నాయకుడు.

'చలిని చూసి మీరు భయపడటమా? ఆ చలే మిమ్మల్ని చూసి భయపడి పారిపోయే మంత్రం నా దగ్గర ఉంది. నిండా మునిగిన వాడికి చలే ఉండదంటారు. వేకువనే ఈ నీటిలో మునగండి, హాయిగా ఉండండి" అంది నక్క. ఇవి కుతంత్రపు మాటల్లా ఉన్నాయని గ్రహించిన కుందేళ్లు 'రేపటి నుండి అలానే చేస్తాము' అని తప్పించుకుని పోయాయి.

'ఈ కుందేళ్లు నా మాటలు నమ్మినట్లున్నాయి. నిండా మునిగితే ఊపిరాడక చస్తాయి. ఇక ఒడ్డున కాచుకుని ఉంటే చాలు నాకు తిండి సమస్య తీరిపోయినట్లే' అని నక్క పైకే అనేసింది. కొలనులో ఉన్న మొసలి మాటలు విని 'నక్క బావా! నీ మాటలు యథార్థం కాదు. చలిని భరించలేక ఈ కొలనులోని చేపలన్నీ తమను బయట పడేయమని నన్ను కోరుతున్నాయి. అది నా ఒక్కడి వల్ల సాధ్యం కావడం లేదు. నువ్వు తోడుంటే వాటిని తోడి బయటపడేద్దాము" అని బతిమాలింది మొసలి.

దాని మాటలు నిజమని నమ్మిన నక్క "ఓస్... అంతేనా, అయితే పద పోదాం" అంటూ చెంగున ఎగిరి మొసలి వీపుపై కూర్చుంది. కొద్ది దూరం పోయాక మొసలి నీటిలో బుడుంగున మునిగింది. ఈత రాని నక్క ఊపిరాడక చివరకు మొసలికి ఆహారమై పోయింది. ★

## మంచిమాట



**సమస్త తప్పిదాలకు కారణం మనసు. దాన్ని సరిగా ఉంచుకుంటే ఎప్పటికీ తప్పులు చేయవు.**

## మెదడుకు మేత



**మొదట చప్పన, మధ్య పుల్లన,**
**చివర కమ్మన.. ఏంటది?**

జవాబు : మొక్కజొన్న

## పద్యం

**ఉత్తమ గుణములు నీచున**
**కెత్తెఱగున గలుగనేర్చు నెయ్యడలం దా**
**నెత్తిచ్చి కఱిగిపోసిన**
**నిత్తడి బంగార మగునె యిలలో సుమతీ!**

భావం : బంగారానికి సమానమైన ఇత్తడిని తీసుకొని ఎన్నిసార్లు కరిగించి పోసినా అది బంగారం కాదు. అలాగే లోకంలో నీచుడికి ఎలాంటి మంచి గుణాలు కలుగవు.

## శ్లోకం

**వాణిజ్యే వర్తతే లక్ష్మీః తదర్థం కృషి కర్మణి**
**తదర్థం రాజసేవాయాం భిక్షాయాం నైవ నైవహి**

భావం : వాణిజ్యం వల్ల ధనవంతులు అవుతారు. వ్యవసాయం వల్లనూ భాగ్యవంతులవుతారు. ప్రభుసేవలో కొంతలో కొంతైనా రాబడి ఉంటుంది. యాచన ద్వారా దారిద్ర్యమే కానీ ధనం లభించదు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఇండోనేషియా | టెహ్రాన్ |
| ఇరాన్ | మాడ్రిడ్ |
| ఇరాక్ | జకార్తా |
| ఐర్లాండ్ | బాగ్దాద్ |
| స్పెయిన్ | డబ్లిన్ |

జవాబులు : ఇండోనేషియా-జకార్తా, ఇరాన్-టెహ్రాన్, ఇరాక్-బాగ్దాద్, ఐర్లాండ్-డబ్లిన్, స్పెయిన్-మాడ్రిడ్

## శాస్త్రవేత్తలు

### బి.బి. లాల్

భారతదేశానికి చెందిన ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త పూర్తి పేరు బ్రజ్ బాసి లాల్ (బీబీ లాల్) మే 2,1921న ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో జన్మించారు. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి భారత చరిత్ర పరిశోధనలో విశేష సేవలు అందించారు. అయోధ్య, హస్తినాపూర్, కాలిబంగన్ వంటి ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహించి పురాతన నాగరికతలకు సంబంధించిన ఆధారాలను వెలికితీశారు. ముఖ్యంగా రామాయణ, మహాభారత ఇతిహాసాలకు సంబంధించిన పరిశోధనల వల్ల ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. భారత పురావస్తు రంగానికి చేసిన సేవలకుగాను ఆయనకు పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు లభించాయి.




## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశ మొదటి రాష్ట్రపతి ఎవరు?
2. ఏ ఆఫ్రికా దేశంలో ఇటీవల మహారాజా రంజిత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు?
3. శుభ్‌మన్ గిల్ ఏ క్రీడకు సంబంధించిన ప్లేయర్?

సమాధానాలు: 1. డా. రాజేంద్ర ప్రసాద్; 2. ఘనా; 3. క్రికెట్.

## భక్తాగ్రేసరులు

### మెహర్ బాబా

మెహర్ బాబా పూణేలో పార్శీ కుటుంబంలో జన్మించారు. అసలు పేరు మేర్వాన్ షెరియార్ ఇరానీ. 'మెహర్' అంటే దయ, కరుణ గల తండ్రి అని అర్థం. చిన్నతనం నుంచే తెలివైనవానిగా పేరు తెచ్చుకొన్న ఆయనను అందరూ ఇష్టపడేవారు. పర్షియన్, మరాఠా, ఆంగ్ల భాషల్లో కవితలు, రచనలు చేశారు. మహాయోగిని హజరత్ బాబాజాన్ పరిచయంతో ఆయన జీవితం ఆధ్యాత్మికం వైపు మళ్లింది. ఆమె ఆయనను మొదటిసారి చూడగానే మాతృప్రేమతో కనుబొమ్మల మధ్య ముద్దాడడం ఆయనకు దివ్యానుభూతి కలిగించిందట. అలా ఆయన మూడు, నాలుగు రోజుల పాటు అలౌకికస్థితికి వెళ్లడం కన్నవారిని కలవర పరిచింది. 'వీడు నాబిడ్డ. అందరికీ మంచే చేస్తాడు. ప్రపంచాన్ని తన దైవికశక్తి, ప్రేమతో ముంచెత్తుతాడు' అని ఆమె వారికి అభయం ఇచ్చారు. మెహర్ ఆజన్మ బ్రహ్మచారి. బ్రహ్మజ్ఞానం పొందేందుకు మౌనమే సరైన భాష అనే ఆదిశంకరుల మాట ఆయనకు స్ఫూర్తినిచ్చింది. 'యోగులైన మహాత్ములు ఉంటారు. అదే సమయంలో నకిలీ గురువులూ ఉంటారు. వారు నత్తగుల్లలలాంటి వారు. ఏ గురువును విమర్శించకండి. ప్రేమ, విధేయత, సమర్పణ.. భగవత్ సాక్షాత్కార పథంలో అతిముఖ్యమైనవి' అని చెప్పేవారు. ★





# వారఫలాలు

01-07 జూన్, 2026




సింహంభట్ల సుబ్బారావు
6300674054




**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

పనులు అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. ఆలోచనలు తక్షణం అమలు చేస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారస్తులకు తగినంత లాభాలు అందుతాయి. ఉద్యోగులు కోరుకున్న మార్పులు పొందుతారు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు విశేష ఆదరణ. 1,2 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. ఒప్పందాలలో ఆటంకాలు. ఆదిత్య హృదయం పఠించండి.



**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు. నిరుద్యోగులకు శ్రమానంతరం ఫలితం. బంధువుల ప్రోద్బలంతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు. ఉద్యోగులు సత్తా చాటుకుంటారు. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళాకారులకు చిక్కులు తొలగే సమయం. 3,4 తేదీల్లో మానసిక ఆందోళన. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.



**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

భూములు, వాహనాలు కొనుగోలులో ప్రతిష్టంభన తొలగుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు తగినంత లాభాలు. ఉద్యోగులకు సహచరులతో సఖ్యత నెలకొంటుంది. విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు క్రమేపీ అనుకూల వాతావరణం నెలకొంటుంది. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. బంధువిరోధాలు. అనారోగ్యం. దక్షిణా మూర్తి స్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొన్ని వివాదాలు నేర్పుగా పరిష్కరించు కుంటారు. స్థిరాస్తి వ్యవహారాలో ఒప్పందాలు చేసు కుంటారు. ఇంటి నిర్మాణాలు పునఃప్రారంభిస్తారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సకాలంలో అంది ఊరట చెందుతారు. ఉద్యోగులకు కొత్త విధులు దక్కుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు కొంత అనుకూల పరిస్థితులు ఉండ వచ్చు. 6,7 తేదీల్లో దూరప్రయాణాలు. ఆంజనేయ స్వామి దండకం పఠించండి.



**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

దూరపు బంధువుల నుంచి వచ్చిన క్షేమ సమాచారాలు ఊరటనిస్తాయి. వాహనాలు, ఇళ్ల నిర్మాణ యత్నాలు కొంత కలసివస్తాయి. కాంట్రాక్టులు ఎట్టకేలకు సాధిస్తారు. వ్యాపారులు గతం కంటే మెరుగైన లాభాలు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. రాజకీయవేత్తలు, పరిశోధకులు, కళాకారులకు ప్రోత్సాహం. 2,3 తేదీల్లో మిత్రులతో కలహాలు. వినాయకుని పూజించండి.



**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఇంతకాలం పడిన శ్రమ కొలిక్కి వస్తుంది. విద్యార్థులకు ఊరటనిచ్చే ప్రకటన రావచ్చు. ఇంటి నిర్మాణాలకు శ్రీకారం. వ్యాపారులకు ఊహించిన లాభాలు. ఉద్యోగులు విధుల్లో ప్రతిబంధకాలు అధిగ మిస్తారు. కళాకారులు, రచయితలకు కొంత అనుకూల సమయం. 4,5 తేదీలలో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.



**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆలోచనలు స్థిరంగా సాగవు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వివాదాలకు దూరంగా ఉండండి. ఇంటి నిర్మాణయత్నాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపారస్తులకు కొంతమేర లాభాలు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. కళాకారులు, క్రీడాకారులకు నిరుత్సాహపూరితంగా ఉంటుంది. 3,4 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. అష్టలక్ష్మీ స్తోత్రాలు పఠించండి.



**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆస్తుల విషయంలో ఒప్పందాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వివాహ, ఉద్యోగ యత్నాలు క్రమేపీ అనుకూలిస్తాయి. వ్యాపారులు లాభాల వెంట నడుస్తారు. ఉద్యోగులకు బాధ్యతలు తగ్గుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు సంతోషకర సమాచారం. 5,6 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శివాష్టకం పఠించండి.



**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. పాతబాకీలు వసూలై అవసరాలు తీరతాయి. విద్యార్థుల కృషి కొంత ఫలిస్తుంది. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు హోదాలు సంతృప్తినిస్తాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు ఒక ఆహ్వానం ఉత్సాహాన్నిస్తుంది. 4,5 తేదీలలో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. వేంకటేశ్వరస్వామి స్తోత్రాలు పఠించండి.



**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని వారితో ఆనందాన్ని పంచు కుంటారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు ఈతిబాధలు తొలగి ఊరట లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు అనుకూల సమాచారం అందుతుంది. 6,7 తేదీల్లో దుబారా ఖర్చులు, ప్రయాణాలు. ఆరోగ్యభంగం. ఈశ్వరారాధన మంచిది.



**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉంటుంది. పలుకుబడి పెరుగుతుంది. ఆస్తుల విషయంలో చికాకులు తొలగుతాయి. వ్యాపారస్తులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళాకారులకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. 5,6 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.



**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

శుభకార్యాలపై కుటుంబంలో చర్చలు జరుపు తారు. కాంట్రాక్టులు కోసం చేసే యత్నాలు కొంత సఫలమవుతాయి. వ్యాపారులు మరింత ఉత్సాహంగా సాగుతారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అవాంతరాలు అధిగమించి ముందడుగు వేస్తారు. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులు కాస్త ఊపిరిపీల్చుకునే సమయం. 2,3 తేదీల్లో బంధు విరోధాలు, అనుకోని ఖర్చులు. లక్ష్మీ నృసింహ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-566

## ఆధారాలు

**అడ్డం**

1. ప్రస్తుతం పుష్కరాలు జరుగుతున్న నది (3)
3. నైమిశారణ్యం ఈ నది ఒడ్డున ఉంది (3)
5. బెంగాల్‌కు పూర్వ నామం (2)
7. ఖని, నిక్షేపాల ఖజానా (2)
9. చక్కని పలువరుస స్త్రీ (3)
10. ప్రథమా విభక్తులు (4)
12. పాతకాలపు కొలమానం (2)
14. ధేనువు...దారితప్పింది (2)
16. ఒక వారం...బృహస్పతి (2)
19. పడిశం...(3)
21. పొలిచ్చి పెంచే తల్లి (2)
23. విహారం (3)
25. మిద్దె (2)
27. తిలకం, పేరు (2)
28 అంబలి, గంజా (2)
29. ఇంటిలో ఒక భాగం (2)
31. రక్షకుడు (3)
34. ప్రసంగికుడు (2)
35. దుర్భాషణ,వ్యర్థ మాటలు (4)
38. రెండు పక్షాలు (2)
39. పార్వతీదేవి (2)
40. కథ, వార్త (2)
41. మస్తకంలో నరాల కేంద్రం (3)
42. సన్యాసుల ఆవాసం (2)

**నిలువు**

1. సమవర్తి (3)
2. నవ్వు, హాజం (3)
4. ప్రేమ, అనురాగం (3)
5. అభివాదం (3)
6. ఉపాయం, దారి (2)
8. అడ్డం కాదు...(3)
11. ఖండాలు, తునకలు (3)
13. పక్షి, పిట్ట...తిరగబడింది (2)
15. గోదారిలో అంత్యక్షరం లోపం (2)
17. ముని (2)
18. కొండ, అద్రి (3)
19. రక్తం పీల్చే జీవి (3)
20. దంబం, బడాయి...కింద నుంచి (2)
22. బంగారు నాణెం, దీనారమే (3)
24. కోవా లాంటి మధుర పదార్థం,, (2)
26. ఊదు వాద్యం (2)
30. అహోరాత్రం (3)
32. సువాసన (4)
33. సరిహద్దు, పొలిమేర (2)
35. ప్రతిబింబం, విగ్రహం (3)
36 వంచన (2)
37. సంతోషం (3)
38. ఆత్మాభిమానం,శీలం (2)
39. ఉషను పిలవండి (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | 4 | | | 5 | 6 |
| | | 7 | 8 | | | | 9 | | |
| 10 | 11 | | | | 12 | 13 | | | |
| | | | 14 | 15 | | 16 | 17 | | 18 |
| 19 | | 20 | | 21 | 22 | | 23 | 24 | |
| | | 25 | 26 | | 27 | | | 28 | |
| 29 | 30 | | 31 | 32 | | | 33 | | |
| | 34 | | | | | 35 | | 36 | 37 |
| 38 | | | 39 | | | | | 40 | |
| | | 41 | | | | 42 | | | |

## పదరసం - 565 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 వి | శ్వం | 2 భ | ర | | 3 కుం | ద | 4 నం | | 5 దీ |
| శ్వ | | ద్ర | | 6 ఇం | తి | | ద | | పం |
| 7 నా | దం | | 8 మో | పు | | 9 జ | న | 10 ని | |
| థ | | 11 మా | సం | | 12 చీ | ర | | 13 వు | రే |
| | 14 అ | ద్రి | | 15 మే | క | | 16 గో | రు | |
| 17 దా | హం | | 18 అ | ర | టి | | డ | | 19 స |
| | 20 కా | న | నం | | 21 లో | 22 భం | | 23 ప | ర్వం |
| 24 గా | రం | | 25 త | రి | | డ | | తి | |
| దె | | 26 పు | రం | | 27 ఆ | నం | 28 దం | | 29 ఏ |
| | 30 గు | ట్ట | | 31 ప్ర | జ్ఞ | | 32 తి | ల | లు |

సినిమా




# కూటమి ప్రభుత్వంలో ఎఫ్‌డీసీ బలోపేతం!

**తెలుగు రాష్ట్రాలు రెండుగా ఏర్పడి దాదాపు పదేళ్లు అయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం యేడాది నుంచి సినిమా పురస్కారాల ప్రదానం చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపించని చొరవను, తెలంగాణ ప్రభుత్వం చూపించిందని కొందరు సినీ ప్రముఖులు ప్రశంసించారు. అయితే తాజాగా ప్రభుత్వానికి – సినిమా రంగానికి వారధిగా నిలిచే ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ విషయంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్.డి.సి.) క్రియాశీలక బాధ్యతను నిర్వహించింది. అప్పటి ప్రభుత్వాలు నిర్వహించిన నంది అవార్డుల కార్యక్రమాలను ఎఫ్.డి.సి. సమన్వయం చేసేది. ఎఫ్.డి.సి.ని కేవలం సినిమాలకే పరిమితం చేయకుండా నాటక, టీవీ రంగాలను కూడా అప్పటి ప్రభుత్వం దాని నీడలోకి తీసుకొచ్చింది. సినిమాలతో పాటు టీవీ, నాటక రంగాలకు కూడా నంది అవార్డులు ఇచ్చింది. రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత ఎఫ్.డి.సి. వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో దీనిని పట్టించుకున్న వారు లేకపోయారు. అయితే నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎఫ్.డి.సి. ఏర్పాటు చేసి, అంబికా కృష్ణకు ఛైర్మన్ పదవిని అప్పగించారు. ఆ తర్వాత జగన్మోహన్‌రెడ్డి కూడా దానిని తనకు కావాల్సిన వారికి కట్టబెట్టారు. అయితే వీరెవరూ గతంలో మాదిరి ఎఫ్.డి.సి.కి డైరెక్టర్లను నియమించ లేదు. తెలంగాణలోనూ కె.చంద్రశేఖరరావు పదేళ్లుగా అదే చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత 2024 డిసెంబర్‌లో ప్రముఖ నిర్మాత దిల్‌రాజును ఎఫ్.డి.సి. ఛైర్మన్‌గా నియమించారు. కానీ డైరెక్టర్లను మాత్రం వేయలేదు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రెండు దశాబ్దాల క్రితంనాటి కనిపిస్తోంది.

మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎఫ్.డి.సి.ని పునర్వ్యవస్థీకరించే బాధ్యతలను అప్పగించారని తెలిసింది. దాంతో ఛైర్మన్ సహా డైరెక్టర్ల ఎంపిక ప్రక్రియ మొత్తం బాలకృష్ణ సలహాలు, సూచనల ప్రకారమే జరిగింది. ఈ ఎంపిక వెనుక కూడా పలు ఆసక్తికరమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. చంద్రబాబునాయుడు రెండోసారి సీఎం అయిన తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో స్టార్ హీరో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి కాగా, జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖను అప్పగించారు. దాంతో ఎఫ్.డి.సి. కొత్త ఛైర్మన్‌ను వీరే నిర్ణయిస్తారని సహజంగా భావించారు. తనతో 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్న ఎ.ఎం. రత్నంను ఎఫ్.డి.సి. ఛైర్మన్‌గా చేయాలని పవన్ కళ్యాణ్ భావించి చంద్రబాబునాయుడికి సిఫార్స్ చేశారు. దీనిపై చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా... బాలకృష్ణను కలవాల్సిందిగా ఎ.ఎం. రత్నంకు చెప్పారట. ఆయన బాల కృష్ణను కలిసినా ప్రయోజనం లేకపోయిందని సన్నిహితులు తెలిపారు.

ఎ.ఎం. రత్నం పేరును బాలకృష్ణ పక్కన పెట్టడంతో సీనియర్ నిర్మాతలు కె.ఎస్.రామారావు, కాట్రగడ్డ ప్రసాద్, నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్ తదితరుల పేర్లను ఎఫ్.డి.సి. ఛైర్మన్ పదవికి పరిశీలించారని తెలిసింది. చివరకు వీరెవరూ కాకుండా వైజాగ్‌కు చెందిన డిస్ట్రిబ్యూటర్ భరత్ భూషణ్‌ను ఈ పదవికి బాలకృష్ణ ఎంపిక చేశారు. భరత్ భూషణ్ గతంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఎఫ్.డి.సి. డైరెక్టర్ల ఎంపిక విషయంలోనూ బాలకృష్ణ గట్టి కసరత్తే చేసినట్టు తెలుస్తోంది. డైరెక్టర్లుగా సినిమా రంగంలోని వివిధ విభాగాలకు ప్రాతినిధ్యం వహించే వారిని తీసుకున్నారు. ఎ.ఎం.రత్నం విషయంలో పవన్ కళ్యాణ్ హామీ నెరవేరకపోవడంతో 'జన'సైనికులు కొంత కినుక వహించారని తెలిసింది. అయితే దానికి బదులుగా మెగా ఫ్యామిలీకి సన్నిహితుడైన దర్శకుడు మెహర్ రమేశ్‌ను వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేసినట్టు ప్రభుత్వం ప్రకటించడంతో 'జన'సైనికులు కాస్తంత చల్లబడ్డారు. కానీ, ఎఫ్.డి.సి.లో వైస్ ఛైర్మన్ అనే పదవి లేదు. కొత్తగా దాన్ని ఏర్పాటు చేయాలంటే బైలాస్‌ను మార్చాలి. అది ఇప్పట్లో అయ్యే పనికాదని గ్రహించిన ప్రభుత్వ అధికారులు చివరకు మెహర్ రమేష్‌ను కూడా డైరెక్టర్ల కేటగిరిలో వేసేశారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా దర్శకుడు సముద్ర, సీనియర్ నిర్మాత, పంపిణీదారుడు చదలవాడ శ్రీనివాసరావు, వివేక్ కూచిభొట్ల, నటులు సుమన్, శివాజీ, ఝాన్సీ, రచయిత బుర్రా సాయిమాధవ్, సీనియర్ జర్నలిస్ట్ కె. ఉమామహేశ్వరరావు, సినిమాటోగ్రాఫర్ ఎస్.మీర్, నాటకరంగానికి చెందిన కందిమళ్ల సాంబశివరావు, ఎగ్జిబిటర్స్ ఎస్.వెంకట కృష్ణారెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వర యాదవ్, ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు డి. సత్యనారాయణ డైరెక్టర్లుగా మే 25న విజయవాడలోని ఎన్టీఆర్ ఎడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. నంది అవార్డులకు తిరిగి శ్రీకారం రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2012 నుండి 2016 వరకూ నంది అవార్డులను ప్రకటించినా, వాటి ప్రదానం జరగలేదు. ఈ పురస్కారాలను తిరిగి ప్రవేశపెడతామని కూటమి ప్రభుత్వం వస్తోంది. ఈ యేడాది జనవరిలో విజయవాడలో జరిగిన ఆవకాయ లిటరరీ ఫెస్టివల్‌లో కూడా సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్ ఈ అంశం ప్రస్తావించారు. తాజాగా ఎఫ్.డి.సి. పాలకమండలి పదవీ స్వీకారోత్సవంలోనూ ఆ విషయాన్ని పునరుద్ఘాటించడంత సినిమా రంగానికి చెందిన వారిలో ఆశలు చిగురించాయి.

ఇదే సమయంలో తెలంగాణలోనూ ఎఫ్.డి.సి. ఛైర్మన్ దిల్ రాజుకు సహాయ సహకారాలు అందించేలా డైరెక్టర్లను నియమించాలనే డిమాండ్ వస్తోంది. సినిమా రంగం అనేక సమస్యలతో కుదేలు అవుతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాలు ఎఫ్.డి.సి.లను బలోపేతం చేయడం ఆ రంగాన్ని ఆదుకోవడానికి మార్గాలను అన్వేషిస్తే... అంతకంటే కావాల్సింది ఏముంటుంది!?

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు












వెల : ₹.150/- | వెల : ₹.60/- | వెల : ₹.270/- | వెల : ₹.80/- | వెల : ₹.54/-










వెల : ₹.800/900 : 999/1200 | వెల : ₹.250/- | వెల : ₹.150/- | వెల : ₹.200/-












వెల:₹.999/- సెట్ | వెల:₹.450/- | వెల :₹.699/- | వెల : ₹.400/- | వెల : ₹.145/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 33

